అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

ఆదివారం 26-01-2025

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 10 సంచిక : 337 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు + వెబ్‌లో (సోపతి) వెల : 8.00



నవచిత్రం



6 భాషల్లో 'వెంకటలచ్చిమి'

పాయల్ రాజ్‌పుత్ నటిస్తున్న పాన్ ఇండియా సినిమా 'వెంకటలచ్చిమి'. రాజా, ఎస్ఎస్ చౌదరి నిర్మాతలుగా, డైరెక్టర్ ముని దర్శకత్వంలో పాయల్ రాజ్‌పుత్ ప్రధాన పాత్రలో తెరకెక్కనున్న ఈ మూవీ రామానాయుడు స్టూడియోలో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది.

ఈ సందర్భంగా డైరెక్టర్ ముని మాట్లాడుతూ.. "వెంకటలచ్చిమి'గా కథ అనుకున్నప్పుడే పాయల్ రాజ్‌పుత్ సరిగ్గా సరిపోతారనిపించింది. పాన్ ఇండియా సినిమాగా తెలుగుతో పాటు హిందీ, పంజాబీ, కన్నడ, మలయాళం, తమిళం భాషల్లో తెరకెక్కిస్తున్నాం. ట్రైబల్ గర్ల్ యాక్షన్ రివేంజ్ డ్రామాగా ఇండియన్ ఇండస్ట్రీలో ఈ సినిమా సంచలనం సృష్టించడం ఖాయం' అని అన్నారు.

హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ మాట్లాడుతూ,'మంగళవారం' సినిమా తర్వాత ఎన్నో కథలు విన్నాను. డైరెక్టర్ ముని ఈ కథ చెప్పగానే చాలా నచ్చేసింది. ఈ సినిమా తర్వాత నా పేరు 'వెంకటలచ్చిమి'గా స్థిరపడిపోతుందేమో అన్నంతగా బలమైన సబ్జెక్ట్ ఇది. నా కెరీర్‌కి నెక్స్ట్ లెవల్‌గా ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్ నిలిచిపోతుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు. ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: ముని, మ్యూజిక్ డైరెక్టర్: వికాస్ బడిశా, ప్రొడ్యూసర్: రాజా, ఎన్ఎస్ చౌదరి



'ఎల్‌వైఎఫ్' టీజర్ విడుదల

శ్రీహర్ష, కషిక కపూర్ జంటగా నటిస్తూ మనీషా ఆర్ట్స్ అండ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, అన్నపరెడ్డి స్టూడియోస్ బ్యానర్లపై కిషోర్ రాఠి, మహేష్ రాఠి, ఏ రామస్వామి రెడ్డి నిర్మాతలుగా పవన్ కేతరాజు దర్శకత్వంలో వస్తున్న చిత్రం 'ఎల్‌వైఎఫ్'.

ఎస్పీ చరణ్, ప్రవీణ్, భద్రం, నవాబ్ షా, షకలక శంకర్, రవిబాబు, రియా, సంధ్య తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి మణిశర్మ సంగీతం అందించారు. తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ చిత్ర టీజర్ ని విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,'మంచి కథతో వస్తున్న ఈ చిత్రం గొప్ప విజయాన్ని సాధించాలి. తీసే సినిమాలు ఎక్కువ బడ్జెట్లో కాకుండా మంచి కంటెంట్ తో తక్కువ బడ్జెట్ తో ఉంటే సినిమాలు బాగుంటాయి. ఎక్కువ బడ్జెట్ పెట్టి తర్వాత టికెట్ రేట్లు పెంచాలని ప్రభుత్వాన్ని అడగడం కంటే తక్కువ బడ్జెట్లో మంచి కంటెంట్ ఉన్న చిత్రాలు ప్రేక్షకుల ముందుకు తీసుకు రావడం మంచిది.

ఈ చిత్రం అలా తక్కువ బడ్జెట్లో, మంచి కంటెంట్ తో వస్తున్న చిత్రం. ఇటువంటి చిత్రాలను ప్రోత్సహించడంలో సినిమాటోగ్రఫీ మినిస్టర్ గా నేను ముందుంటాను. ఓటిటిలో అయినా థియేటర్లో అయినా తక్కువ బడ్జెట్ తో వచ్చే చిన్న సినిమాలు మంచి విజయాన్ని సాధిస్తున్నాయి. కొత్త సినిమాలతో పోటీపడుతూ కలెక్షన్స్ వసూలు చేస్తున్నాయి' అని అన్నారు.

ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: పవన్ కేతరాజు, సినిమాటోగ్రఫీ : శ్యామ్ కె నాయుడు, సంగీతం : మణిశర్మ, యాక్షన్ : కార్తీక్ క్రౌడర్, ఎడిటర్ : ఆర్. కె, కొరియోగ్రఫీ : మోయిన్, ఆర్ట్ : చిడిపల్లి శంకర్.

కలర్‌ఫుల్‌గా 'మై సౌత్ దివా క్యాలెండర్'

ప్రముఖ ఫొటోగ్రాఫర్ మనోజ్ కుమార్ కటోకర్ రూపొందించిన ప్రతిష్టాత్మక 'మై సౌత్ దివా క్యాలెండర్' ద్వారా ఇప్పటికే పలువురు హీరోయిన్స్ పరిచయమై.. అగ్రశ్రేణిలో ఉన్నారు. తాజాగా 2025 క్యాలెండర్ ను 12 మంది స్టార్స్ తో శుక్రవారం గ్రాండ్ గా లాంచ్ చేశారు.

హీరోయిన్స్ శ్రియా శరన్, కేథరిన్ థెరిస్సా, కాజల్ అగర్వాల్, మాళవికా శర్మ, తాన్య హోప్, ఐశ్వర్య కృష్ణ, కుషిత కొల్లాపు, వినాలీ భట్నాగర్, రియా సచ్ దేవ్, కనిక మాన్, పలక్ అగర్వాల్ తో ఈ క్యాలెండర్ ను ఆవిష్కరించారు.

క్యాలెండర్ ఫౌండర్ మనోజ్ కుమార్ కటోకర్, భారతి సిమెంట్స్ మార్కెటింగ్ డైరెక్టర్ రవీందర్ రెడ్డితోపాటు సినిమాటోగ్రాఫర్ జ్ఞాన శేఖర్, దర్శకులు కరుణ కుమార్, సుజనా రావు ముఖ్య అతిథులుగా హాజరై తమ విషెస్ తెలియజేశారు.

ఈ సందర్భంగా మై సౌత్ దివా క్యాలెండర్ ఫౌండర్, ఫోటో గ్రాఫర్ మనోజ్ కుమార్ కటోకర్ మాట్లాడుతూ,'మా క్యాలెండర్ ను తొమ్మిది ఏళ్లుగా సపోర్ట్ చేస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. 12 మంది హీరోయిన్స్ తో కూడిన ఈ క్యాలెండర్ అందరికీ నచ్చుతుందని భావిస్తున్నా. మా క్యాలెండర్ ద్వారా ఇప్పటికే కొత్తవారిని మోడల్స్ గా పరిచయం చేశాం. అలాగే కొంతమంది హీరోయిన్స్ గా మంచి గుర్తింపును అందుకున్నారు. ఈ ఏడాది మరో



ఐదుగురిని ఇంట్రడ్యూస్ చేస్తున్నాం. ఈ జర్నీలో నాకు సపోర్ట్ గా నిలిచిన మా పార్ట్నర్స్ భారతి సిమెంట్స్, కియారా జ్యువెలరీ, ఈరా క్లినిక్స్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు' అని చెప్పారు.

భారతి సిమెంట్స్ మార్కెటింగ్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, 'సౌత్ దివా క్యాలెండర్ చాలా బ్యూటిఫుల్‌గా ఉంది. ఒక క్యాలెండర్‌లో చాలా కల్చర్స్ ఉండటం మంచి పరిణామం. స్టార్ హీరోయిన్స్‌తో ఉన్న ఈ క్యాలెండర్ కలర్‌ఫుల్‌గా ఉంది' అని అన్నారు

రాష్ట్ర మహాసభకు 'నవతెలంగాణ' ప్రత్యేక సంచిక

ఆవిష్కరించిన బీవీ.రాఘవులు, తమ్మినేని వీరభద్రం



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభ ఈ నెల 25-28 తేదీల్లో సంగారెడ్డిలో జరుగుతున్నందున 'నవతెలంగాణ' ప్రత్యేక సంచికను తీసుకొచ్చింది. మహాసభ సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో నిర్వహించిన ప్రజా పోరాటాలు, సాధించిన విజయాలకు సంబంధించి ఆర్టికల్స్‌తో పాటు పలువురు ప్రజానాయకుల ఇంటర్వ్యూలతో కూడిన ప్రత్యేక సంచికను శనివారం పీఎస్ఆర్ గ్రౌండ్‌లో జరిగిన సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభ బహిరంగ సభలో ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, జి.నాగయ్య, బి.వెంకట్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, చుక్క రాములు, జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, టి.జ్యోతి, మల్లు లక్ష్మి, అబ్బాస్, పాలడుగు బాస్కర్, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, నవతెలంగాణ సీజీఎం ప్రభాకర్‌తో కలిసి సభావేదికపై ఆవిష్కరించారు. నవతెలంగాణ మెదక్ రీజియన్ మేనేజర్ రేవంత్‌కుమార్, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రాంతీ య ప్రతినిధి మేకల కృష్ణయ్య, డెస్క్ ఇన్‌చార్జి అనిల్‌కుమార్, రిపోర్టర్స్ సుదర్శన్‌రెడ్డి, బి.శ్రీనివాస్, ఏడివిటి బాధ్యులు మల్లేశం, ప్రవీణ్ పాల్గొన్నారు.

నేడు 4 పథకాలు ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

అమలు చేస్తామని వెల్లడించారు. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా, భూమిలేని నిరుపేద, ఉపాధి హామీ పథకంలో 20 రోజులపాటు పనిచేసిన వారందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు తీసుకొని అర్హులందరికీ లబ్ధి చేకూర్చాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు. లక్షలాది సంఖ్యలో వచ్చిన దరఖాస్తులను క్రోడీకరించి జనవరి 26న అత్యంత పరమ పవిత్రమైన భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజు ఈ సంక్షేమ పథకాల అమలును ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఇచ్చిన మాట మేరకు పథకాలు అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని అన్ని మండలాల్లో మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని నూరు శాతం ఆ గ్రామంలో ఈ నాలుగు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని తెలిపారు. లక్షలాదిగా వచ్చిన దరఖాస్తులను కంప్యూటర్లలో ఎంట్రీ చేసి అర్హులను గుర్తిస్తామన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి ఉదాత్త ఉన్నతమైన సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఇందిరమ్మ రాజ్యం సంక్షేమ రాజ్యం అని తెలిపారు. అంతకు ముందు ఆ నాలుగు పథకాలపై సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు.

నేడు నారాయణపేట జిల్లాలో

సీఎం రేవంత్ రెడ్డి నాలుగు పథకాలను లాంఛనంగా ప్రారంభించనున్నారు. నారాయణపేట జిల్లా కోస్గి మండలం, చంద్రవంచ గ్రామంలో మధ్యాహ్నం 1.15 నుంచి 2.15 గంటల వరకు జరిగే కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ఇందు కోసం ఆదివారం మధ్యాహ్నం 12.10 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి వెళ్లనున్నారు.

తమ్మినేని సోదరి తోటకూరి సరోజిని మృతి

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం నివాళి

నవతెలంగాణ-చింతకాని

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సోదరి, ఖమ్మం జిల్లా చింతకాని మండలం రేపల్లెవాడ గ్రామానికి చెందిన తోటకూరి సరోజిని(70) అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. మృతదేహానికి ఆమె తమ్ముడు తమ్మినేని వీరభద్రం నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేపల్లెవాడ గ్రామంలో సీపీఐ(ఎం)కు ఆమె పునాదులు వేసినట్టు చెప్పారు. పార్టీ కార్యకలాపాలలో తమ బావకి చేదోడు వాదాడుగా ఉంటూ, సహకరిస్తూ ఉండేదని, అలాంటి వ్యక్తి ఈరోజు మన మధ్యన లేకపోవడం మా కుటుంబానికి తీరని లోటుగా భావిస్తున్నామన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మధిర డివిజన్



కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, మండల కార్యదర్శి రాచబంటి రాము, నాయకులు కృష్ణమూర్తి కిరణ్ బాబు తదితరులు నివాళి అర్పించారు.

వారం రోజుల్లో నలుగురు రైతుల ఆత్మహత్య

- మాజీ మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అప్పుల బాధలు భరించలేక వారం రోజుల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నలుగురు రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎక్స్‌లో ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు చనిపోతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. "కాంగ్రెస్‌కు నమ్మి ఓటేసిన పాపానికి నట్టేట ముంచి, నమ్మక ద్రోహం చేస్తున్నది. రుణమాఫీ పూర్తి చేస్తే రైతులు ఎందుకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలి. అప్పులు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్న రైతు కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ప్రకటించాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

రోడ్డు భద్రత నియమాలను పాటించాలి

గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

- ములుగులో రోడ్డు భద్రత మాసోత్సవాలు
- టాస్క్ సెంటర్ ప్రారంభం



నవతెలంగాణ-ములుగు

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమావళిని పాటిస్తూ ప్రమాదాలను నివారించాలని గ్రామీణ అభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా శనివారం సాధన స్కూల్ నుంచి సాధన స్కూల్ వరకు 3కే రన్నింగ్ పోటీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి సీతక్క, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, కలెక్టర్ దివాకర్ టీఎస్, జిల్లా గ్రంథాలయ చైర్మెన్ బానోతు రవిచందర్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ పైడాకుల అశోక్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. నాణ్యమైన ఆహారాన్ని తీసుకుంటూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యకంగా ఉండాలని సూచించారు. సహజ సిద్ధమైన కూరగాయలను తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, నియంత్రణ అలవర్చుకోవాలని అన్నారు. తప్పుదారుల్లో వాహనాలను నడపటం, అధిక వేగం, హెల్మెంట్ ధరించకపోవడం, మద్యం సేవించి వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలకు గురై ఎంతోమంది విలువైన ప్రాణాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యకరంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని సూచించారు. రోడ్డుపై లభించే తినుబండారాలను విచ్చలవిడిగా తినడం వల్ల చిన్నపిల్లలకు సైతం గుండె జబ్బులు, క్యాన్సర్ లాంటి వ్యాధులు వస్తున్నాయని, ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో సహజసిద్ధమైన కూరగాయలను సాగు చేసుకోవాలని చెప్పారు.

ఎంపీ బలరాంనాయక్ మాట్లాడుతూ.. ములుగు జిల్లా గిరిజన ప్రాంతమని, రోడ్డు భద్రత నియమావళిని పూర్తిగా అవగాహన చేసుకున్న తర్వాతే వాహనాలు నడపాలని అన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ మాట్లాడుతూ.. తాను కళాశాలలో ఉన్నప్పుడే రోడ్డు భద్రత నియమావళిని పూర్తిస్థాయిలో అవగాహన చేసుకున్నానని, జీవితం పోతే తిరిగి రాదని, రోడ్డు ప్రమాదాలలో విలువైన ప్రాణాన్ని తీసుకోవద్దని వికలాంగులుగా మారవద్దని చెప్పారు.

జిల్లాలో టాస్క్ శిక్షణ కేంద్రం ఏర్పాటు గొప్ప వరం

నిరుద్యోగ యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు పొందేందుకు, ప్రతిభ పరిజ్ఞానం అభివృద్ధి చేసుకోవడానికి జిల్లాలో టాస్క్ సెంటర్ ఏర్పాటు చేయడం గొప్ప వరమని మంత్రి సీతయ్య అన్నారు. కష్టంలో వచ్చిన విజయం జీవితాంతం సంతోషాన్నిస్తుందని చెప్పారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన టాస్క్ సెంటర్‌ను కలెక్టర్ దివాకర్ టి.ఎస్, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రవి చందర్‌తో కలిసి మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. టాస్క్ సెంటర్ మారుమూల ప్రాంతాల యువతి, యువకులకు ఎంతగానో దోహదపడుతుందని, ప్రతిభా పరిజ్ఞానం లేకపోతే ఉన్నత చదువులు చదివినా లాభం ఉండదని చెప్పారు.

సత్ఫలితాలనిస్తున్న మిషన్ భగీరథ టోల్ ఫ్రీ నెంబర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మిషన్ భగీరథ టోల్ ఫ్రీ నెంబర్‌తో మంచి ఫలితాలొస్తున్నాయని మంత్రి సీతక్క తెలిపారు. ఆమె ఆదేశాలతో గతేడాది డిసెంబర్ 23న ప్రారంభమైన ఈ కాల్ సెంటర్‌ద్వారా సత్ఫలితాలొస్తున్నాయన్నారు. 280 కాల్స్ రాగా, ఇందులో పట్టణ ప్రాంతాల నుంచి 73, గ్రామీణ ప్రాంతాల నుంచి 207 ఫిర్యాదులొచ్చాయని తెలిపారు. మొత్తం 280 ఫిర్యాదులు రాగా.. 187 ఫిర్యాదులను అధికారులు పరిష్కరించారని చెప్పారు.

వక్ఫ్ కమిటీ చైర్మెన్ చర్యను తప్పుబట్టిన సీపీఐ(ఎం)

న్యూఢిల్లీ : వక్ఫ్ బిల్లుపై ఏర్పాటు చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) చైర్మెన్ తీసుకున్న చర్యను సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో తీవ్రంగా విభేదించింది. ప్రభుత్వ అభిప్రాయాలను వ్యతిరేకించినందుకు జేపీసీలోని ప్రతిపక్ష సభ్యులందరినీ సస్పెండ్ చేయడానికి కమిటీ చైర్మెన్ ఎంచుకున్న కారణం చాలా పేలవంగా వుందని విమర్శించింది. కమిటీ వ్యవస్థకు సంబంధించి ఏండ్ల తరబడి స్పష్టంగా రూపొందించుకుని, అనుసరిస్తూ వచ్చిన సాంప్రదాయాలన్నింటినీ తుంగలో తొక్కి చట్టబద్ధమైన పార్లమెంటరీ ప్రక్రియను దెబ్బతీయడం కన్నా మరేదీ దారుణం కాబోదని పొలిట్‌బ్యూరో ఒక ప్రకటనలో పేర్కొంది. ఎన్డీఏ ప్రభుత్వం అనుసరించే ఇటువంటి దారుణ చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ప్రతిఘటించేందుకు ప్రజాస్వామ్యాన్ని, పార్లమెంట్ సార్వభౌమాధికారాన్ని గౌరవించే వారందరూ ఏకతాటిపైకి రావాలని పొలిట్‌బ్యూరో విజ్ఞప్తి చేసింది.

నితీశ్,రింకు అవుట్

తెలుగు తేజం నితీశ్ కుమార్ రెడ్డి, ఫినిషర్ రింకు సింగ్‌లు గాయం బారిన పడ్డారు. చెపాక్‌లో రెండో టీ20 ముంగిట ప్రాక్టీస్ సెషన్లో నితీశ్, రింకు గాయపడినట్టు బీసీసీఐ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. చెపాక్‌లో ఇంగ్లాండ్‌తో టీ20కి ఈ ఇద్దరు దూరం అయ్యారు. చివరి మూడు టీ20లకు నితీశ్, రింకు స్థానంలో శివం దూబె, రమణ్‌దీప్‌లను సెలక్షన్ కమిటీ జట్టులోకి ఎంపిక చేసింది.

సంపుటి : 10 సంచిక : 340
www.navatelangana.com
Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam
ఆదివారం 26-01-2025
12 పేజీలు + వెబ్‌లో (సోపతి)
వెల : 8.00
అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక



విభజించు.. పాలించు

ఇదే కాషాయపరివార్ విధానం | జనం మదిలో రాజ్యాంగం..బీజేపీ మనసులో మనువాదం

- ప్రజల విశ్వాసాలకు, ఆర్ఎస్ఎస్ హిందూత్వకు సంబంధమే లేదు
- మతాన్ని రాజకీయాలకు వాడుకోవడం దేశానికే ప్రమాదకరం
- అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షా రాజీనామా చేయాలి
- సామాన్యులపైకి బుల్డోజర్ వస్తే ఎర్రజెండా అడ్డుకుంటుంది
- కార్మికులు, రైతుల హక్కుల కోసం నిలబడేది కమ్యూనిస్టులే
- సమాజమార్పు కోసం పోరాడాలి : సీపీఐ(ఎం) బహిరంగసభలో పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్

'మతోన్మాదాన్ని తుదముట్టిస్తాం.. కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తాం.. ప్రజలకిచ్చిన హామీలను అమలు చేసే దాకా పోరాడతాం...' అని సీపీఐ (ఎం) శ్రేణులు ప్రతినబూనాయి. కులం, మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుబెడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా తెలంగాణలో పోరాట పథాన్ని నిర్దేశిస్తూ, భవిష్యత్ ఉద్యమాలకు దిక్సూచిగా నిలుస్తూ సీపీఐ (ఎం) రాష్ట్ర నాలుగో మహాసభలు శనివారం సంగారెడ్డి పట్టణంలో అత్యంత ఉత్సాహ పూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. సన్నాహకంగా పట్టణంలో నిర్వహించిన భారీ ప్రజా ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. సాంస్కృతిక కార్యక్రమాలు, విచిత్ర వేషధారణలు సైతం పాలకుల విధానాలను ఎండగట్టాయి. నాలుగు రోజులపాటు కొనసాగే ఈ మహాసభల ప్రారంభ సూచికగా స్థానిక పీఎస్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన బహిరంగ సభలో సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్, బీవీ రాఘవులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తదితరులు ప్రసంగించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తెలంగాణలో బీజేపీ మత రాజకీయాలను అడ్డుకొంటామని అందుకు కలిసొచ్చే శక్తులన్నింటినీ కలుపుకుని పోతామని వారు ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. కులాలు, మతాల ఆధారంగా జనాన్ని విభజించి పాలించాలని చూస్తున్న ఆ పార్టీ కుయుక్తులను ఐక్య పోరాటాల ద్వారా తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

వివరాలు 12లో



కార్పొరేట్లే వాళ్ల దోస్తులు : బీవీ రాఘవులు



ట్రంప్, మోడీ, రేవంత్‌రెడ్డిలకు సంపన్నులే దోస్తులని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు విమర్శించారు. వారికి పేదల బాధలు పట్టవన్నారు. దేశంలో, రాష్ట్రంలో అనేక పార్టీలను, ప్రభుత్వాలను చూశామనీ, ఆ పార్టీల మాదిరిగా సీపీఐ(ఎం) కాదని చెప్పారు. తమ పార్టీ పేదలు, సామాన్యులు, రైతులు, కార్మికుల బతుకుల బాగు కోసం నిరంతరం కొట్లాడుతుందని చెప్పారు. బడుగుల బతుకులు బాగుపడాలంటే ఎర్రజెండా పాలన రావాలని ఆకాంక్షించారు. కమ్యూనిస్టులు ప్రశ్నిస్తారనే పాలకులు భయపడుతున్నారని విమర్శించారు. దున్నేవాడిదే భూమి కావాలని కొట్లాడేది కమ్యూనిస్టులేనని ...12లో

మతోన్మాదులారా.. ఖబడ్దార్ : తమ్మినేని



బీజేపీ దేశానికే కాకుండా తెలంగాణకు కూడా ప్రమాదకరమైన పార్టీ అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆ పార్టీని ఫాసిస్టు లక్షణాలున్న ఆర్ఎస్ఎస్ నడుపుతున్నదని విమర్శించారు. ఎక్కడ అవకాశం దొరికినా మతాలు, కులాల మధ్య తగాదాలు పెడుతున్నదని చెప్పారు. ఉట్నూరు, జైనూరులో జరిగిన ఘటనలు అందులో భాగమేనని వివరించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం భూమి కోసం, భుక్తి కోసం, పేదల విముక్తి కోసమే సాగిందన్నారు. కానీ బీజేపీ దాన్ని హిందూముస్లింలకు మధ్య పోరాటం జరిగిందంటూ చరిత్రను వక్రీకరిస్తున్నదని విమర్శించారు. ఏటా సెప్టెంబర్ 17న హిందూ ముస్లింల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నదని అన్నారు. తమ చూపంతా బీజేపీని రాష్ట్రంలోకి రానీయకుండా ...12లో

31న ఉస్మానియా ఆస్పత్రి భవనానికి శంకుస్థాపన

ప్రయివేటును తలదన్నేలా నిర్మాణాలు

- వందేండ్ల అవసరాలకు తగినట్టు ఆధునిక సౌకర్యాలు
- పార్కింగ్, ఫైర్‌స్టేషన్, ఎస్టీపీ, హెలీ అంబులెన్స్ ఏర్పాట్లు
- అంబులెన్స్‌లు, ఫైర్ ఇంజిన్‌ల కోసం ప్రత్యేక ట్రాక్
- మార్చురీ, బాడీ ఫ్రీజింగ్‌లో ఆధునిక పద్ధతులు : సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఈనెల 31వ తేదీ ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఆ మేరకు ఏర్పాట్లు చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు ఉన్నతాధికారులను ఆదేశించారు. వందేండ్ల భవిష్యత్ అవసరాలకు తగినట్టు పూర్తి ఆధునిక వసతులతో ఆస్పత్రి భవన నిర్మాణం ఉండాలని ఆకాంక్షించారు. దానికోసం ఎక్కడా రాజీపడొద్దని అధికారుల్ని హెచ్చరించారు. శనివారం తన నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతోపాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ ప్లాన్‌లో మార్పులు సూచిస్తూ, సీఎం దిశానిర్దేశం చేశారు. ఆస్పత్రితో పాటు వైద్య కళాశాల నిర్మాణం, అక్కడి వైద్య విద్యార్థులు, బోధనా సిబ్బందికి వేర్వేరుగా హాస్టల్ భవనాలు నిర్మించాలని చెప్పారు. పార్కింగ్, ల్యాండ్ స్కేప్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలనీ, రాకపోకల కోసం ...11లో



వైవిధ్యతను ఆచరిస్తేనే సమానత్వం

- ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలి
- లక్ష్యసాధన దిశగా సాగాలి : దేశ ప్రజలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

వివరాలు 11లో

పద్మ అవార్డులు ప్రకటించిన కేంద్రం

- ఏడుగురికి పద్మ విభూషణ్
- 19 మందికి పద్మ భూషణ్..
- 113 మందికి పద్మశ్రీ
- ఏడుగురు తెలుగువారికి పురస్కారాలు
- తెలంగాణ నుంచి ఇద్దరు..
- ఏపీ నుంచి ఐదుగురు
- వైద్య విభాగంలో దువ్వూరి నాగేశ్వర్ రెడ్డికి పద్మ విభూషణ్
- ప్రజా వ్యవహారాలు కేటగిరిలో మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ
- ఏపీ నుంచి నటుడు బాలకృష్ణకు పద్మభూషణ్
- మరో నలుగురికి పద్మశ్రీ

వివరాలు 11లో


(ఫైల్)

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు ఐలయ్య మృతి

- పేదల పక్షాన అలుపెరగని పోరాటాలు
- పలు రాజకీయ పార్టీల నేతల నివాళి

వివరాలు 11లో

నేడు 4 పథకాలు ప్రారంభం

రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు

- సమీక్షించిన సీఎం రేవంత్ రెడ్డి
- వివరాలు వెల్లడించిన మంత్రులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేడు (ఆదివారం) రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు నాలుగు పథకాలు లాంఛనంగా ప్రారంభించబోతున్నట్టు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. లక్షల్లో దరఖాస్తులు వచ్చినందున రేపటి నుంచి మార్చి వరకు లబ్దిదారుల గుర్తింపు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ఈ నాలుగు పథకాలను ఆదివారం నుంచి ప్రతి మండలంలో ఒక గ్రామంలో నూరు శాతం ...2లో

చీనాబ్ బ్రిడ్జిపై వందేభారత్

జమ్మూ కాశ్మీర్ : జమ్మూ కాశ్మీర్‌లోని చీనాబ్ నదిపై నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రైల్వే వంతెన పై వందేభారత్ రైలు తొలి కూత పెట్టింది. ఈ వంతెనపై శనివారం వందేభారత్ రైలు ఫస్ట్ ట్రయల్ రన్స్‌ను నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీ మాతా వైష్ణో దేవి కత్రా స్టేషన్ నుంచి శ్రీనగర్ స్టేషన్ వరకూ ...11లో





గణతంత్రం @ 75

ఎన్ని సవాళ్లు, ఒడిదొడుకులు ఉన్నా ఇప్పటివరకూ దేశ ప్రజలను ఐక్యంగా నిలిపే ప్రయత్నంలో రాజ్యాంగం నిర్వహించిన పాత్ర ఘనమైనది. అనేక అవాంతరాలనూ అధిగమించింది కూడా. కానీ నేడు మత ప్రాతిపదకన ప్రజలను చీల్చే విధానాలు రాజ్యాంగ స్వభావాన్నే దెబ్బతీస్తున్నాయి. అసలు రాజ్యాంగం మీదనే విశ్వసమూ, అమలు చేయాలన్న నిశ్చయం లేని వారుగా పాలకులు ఉండటం నేడు రాజ్యాంగం ఎదుర్కొంటున్న పెద్ద సవాలు. ప్రజల అప్రమత్తత, చైతన్యం మాత్రమే రాజ్యాంగానికి రక్ష.

"భారత ప్రజలమైన మేము, భారతదేశాన్ని సర్వసత్తాక సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా నిర్మించుకోవడానికి, పౌరులందరికీ - సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, భావ ప్రకటన, విశ్వాసం, ఆరాధనల స్వాతంత్ర్యాన్ని, అవకాశాల్లో, అంతస్తుల్లోనూ సమానత్వాన్ని చేకూర్చడానికి, జాతీయ సమైక్యతను సంరక్షిస్తూ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడానికి మాకు మేము సమర్పించుకుంటున్నాము". ఇది రాజ్యాంగ పీఠిక సారాంశం. దీని యొక్క సారాంశంగానే రాజ్యాంగం రూపుదిద్దుకున్నది. అలా రూపుదిద్దుకుని అమలులోకి వచ్చి నేటికి 75 ఏండ్లు నిండుతున్నవి. దాదాపు మూడేండ్లపాటు తీవ్రమైన కృషిచేసి అనేక దేశాల పరిపాలనను, రాజ్యాంగాలను పరిశోధించి ఏర్పాటుచేసుకున్న అతిపెద్ద లిఖిత రాజ్యాంగం మనది. రాజ్యాంగ పరిషత్ అధ్యక్షులుగా డా. బాబూ రాజేంద్ర ప్రసాద్, డ్రాఫ్టింగ్ కమిటీ అధ్యక్షులుగా డా॥ బి.ఆర్.అంబేద్కర్‌లు, మరికొందరు మేధోసంపన్నులు చర్చించి అందించిన మహత్ ప్రణాళిక ఇది. అయితే ఎంతో శ్రమకోర్చి ఇంత పెద్ద రాజ్యాంగాన్ని ప్రజలందరి హక్కులకు, స్వేచ్ఛకు, ప్రజాస్వామిక విధానానికి హామీ ఇస్తూ సమర్పించిన అంబేద్కర్ ఏమన్నారంటే, ఈ రాజ్యాంగం ఘనమైనది, గొప్పదైనదీ అయినప్పటికీ, దీన్ని అమలు చేసే వాళ్లు చెడ్డవారైతే ఎందుకూ పనికిరాదని సెలవిచ్చాడు. ఆ ప్రమాదం 75 ఏండ్ల తర్వాత మరింత పెరిగింది.


రాజ్యాంగ నిర్మాణం కేవలం మేధావుల సృజనాత్మక అంశంగా రూపెత్త లేదు. రాజ్యాలు, సామ్రాజ్యాలు, రాజులు, సామంతులుపోయి బ్రిటీష్‌వారి ఏకచక్రాధిపత్యంలోకి వచ్చాక రెండు వందలేండ్లు సాగిన దోపిడిపై సమైక్యంగా ప్రజల తిరుగుబాటులోంచి స్వాతంత్ర్య పోరాటం నడిచింది. జాతి, మత, కుల, ప్రాంత భేదాల నొదిలి వీరోచిత త్యాగాల ఫలంగా స్వాతంత్ర్యం సిద్ధించింది. ఆనాడు ప్రజలలో ఏర్పడిన ఐక్యత, సమానత, సౌభ్రాతృత్వాల కారణంగా వారి ఆశలు, ఆకాంక్షలు, ఆలోచనల ప్రతిబింబమే మన గణతంత్రం. మరి ప్రజల ఆకాంక్షలు ఏ మేరకు నెరవేరాయి! ఏ దిశగా మన పయనం సాగుతున్నది చర్చించుకోవాల్సిన సందర్భం ఇది. ఈ రాజ్యాంగం ఏర్పడిననాడే, ఈ రాజ్యాంగాన్ని మేము అంగీకరించమని, వ్యతిరేకిస్తూ మాట్లాడినవారు, ఇదే రాజ్యాంగం ప్రకారం ఎన్నికయి ఏలుబడిలో ఉన్నారు. వారి వారసులే మొన్నీమధ్య ఆగస్టు 15ను నిజమైన స్వాతంత్ర్య దినం కాదని, అయోధ్యలో రాముని ప్రతిష్ఠాపన రోజే స్వాతంత్ర్యదినోత్సవమని ప్రకటించాడు. మనుధర్మమే రాజ్యాంగ ధర్మమనీ ఆలోచించేవారి చేతిలో రాజ్యాంగం అమలుకొనసాగటం నేటి విషాదం! 2015లో గణతంత్ర ఉత్సవాలను జరుపుతున్న సందర్భంలో కేంద్ర ప్రభుత్వం ముద్రించిన రాజ్యాంగ ప్రతుల పీఠికలో 'సామ్యవాద', 'లౌకిక' పదాలను తొలగించి అందించారు. అదేమంటే, ఆరంభాన అవిలేవని, మధ్యలో 1976లో 42వ సవరణ ద్వారా చేర్చారని చెప్పారు. కానీ సామ్యవాద, లౌకిక విధానాలతో సాగాలని రాజ్యాంగంలో సారభూతంగా ఆది నుండీ ఉంది. 1973లోనే సుప్రీంకోర్టు ఒక తీర్పులో రాజ్యాంగ స్వరూపాన్ని చెబుతూ లౌకిక ప్రజాస్వామిక, సమానత, స్వేచ్ఛ, సమాఖ్య సమన్యాయాలతో కూడినదని తెలిపారు.

సమన్యాయం సాధించబడలేదు, సామాజిక న్యాయమూలేదు, ఆర్థిక అసమానత పెరిగిపోతున్నది. ఇప్పటికీ ఒక్క శాతం ప్రజల దగ్గర 23శాతం దేశ సంపద ఉంది. 10శాతం ప్రజల దగ్గర 55 శాతం సంపద పోగుబడి ఉందని ప్రభుత్వ రిపోర్టులే చెబుతున్నాయి. ప్రజలందరూ స్వేచ్ఛగా మాట్లాడే హక్కునూ లాగేస్తున్నారు. అధికారానికి వ్యతిరేకంగా మాట్లాడితే దేశ ద్రోహులుగా చిత్రిస్తున్నారు. తినే తిండి, కట్టుకునేబట్ట, పెళ్లి, ఉత్సవం ఏదీ కూడా పౌరులు స్వేచ్ఛగా ఆచరించే వీలు లేకుండా పోయింది. ఇక లౌకికత్వం అనే మాట హేళన చేయబడుతున్నది. మెజారిటీ మతానికి మైనారిటీ మతాల ప్రజలు లోబడి ఉండాలని, లేదంటే చంపుతామని, తరుముతామని బహిరంగంగానే బెదిరిస్తున్నారు. ఇక ప్రజాస్వామ్యమూ పలుచనపడిపోయింది. ఒక ఓటుకు ఒకే విలువ అన్నప్పటికీ ఒక మనిషికి ఒకే విలువ లేదు. ఓటూ సరుకై కొనుగోలుకు గురవుతున్నది. రాజకీయాలు ధనకీయాలయిపోయాయి. అందుకే కుబేరుల బొజ్జలు నింపుతూ, అన్నం పెట్టే రైతన్నలపై కండ్లెర్రజేస్తూ హింసిస్తున్నారు. న్యాయం కావాలన్న గొంతులపై ఉక్కుపాదం మోపుతున్నారు. నిర్బంధాలతో అణచివేతలు చేస్తున్నారు. ఇక సామ్యవాద సమసమాజ భావన తుడిచివేసారు. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం అంగలేస్తున్నది. రాజ్యాంగం కల్పించిన హక్కులు అథఃపాతాళానికి తొక్కి వేయబడుతున్నాయి. కొత్త నేర చట్టాలతో ప్రాథమిక హక్కులే మృగ్యమవుతున్నాయి.

ఎన్ని సవాళ్లు, ఒడిదొడుకులు ఉన్నా ఇప్పటివరకూ దేశ ప్రజలను ఐక్యంగా నిలిపే ప్రయత్నంలో రాజ్యాంగం నిర్వహించిన పాత్ర ఘనమైనది. అనేక అవాంతరాలనూ అధిగమించింది కూడా. కానీ నేడు మత ప్రాతిపదకన ప్రజలను చీల్చే విధానాలు రాజ్యాంగ స్వభావాన్నే దెబ్బతీస్తున్నాయి. అసలు రాజ్యాంగం మీదనే విశ్వసమూ, అమలు చేయాలన్న నిశ్చయం లేని వారుగా పాలకులు ఉండటం నేడు రాజ్యాంగం ఎదుర్కొంటున్న పెద్ద సవాలు. ప్రజల అప్రమత్తత, చైతన్యం మాత్రమే రాజ్యాంగానికి రక్ష.

సంపాదకీయం

దేశానికి రిపబ్లిక్ డే సంకేతాలు



తెలకపల్లి రవి

ఈ రోజు దేశవ్యాపితంగా రిపబ్లిక్ డే.అంటే గణతంత్ర దినోత్సవం.దేశ రాజధానిలో భారత దేశ సైనిక పాటవాన్ని ప్రదర్శించడంతో పాటు రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన శకటాలను కూడా ప్రదర్శిస్తారు.75 ఏండ్ల కిందట భారత రాజ్యాంగాన్ని అమల్లోకి తీసుకొచ్చిన రోజు. వివిధ పత్రికల్లో రాజ్యాంగ రూపకల్పన చరిత్ర, ప్రాథమిక హక్కులు మౌలిక స్వభావం సుప్రీంకోర్టు తీర్పులు తదితర విషయాలపై జాతీయ పత్రికల్లోనూ తెలుగులోనూ చాలా వ్యాసాలు వెలువడ్డాయి. ఈ సందర్భంలో టైమ్స్ ఆఫ్ ఇండియాలో ప్రధాన వ్యాసం ఏడున్నర దశబ్దాల తర్వాత కూడా ముమ్ముందుకు..అనే శీర్షికతో వ్యాసం వెలువడింది. బీజేపీ జాతీయ కార్యదర్శి రాసిన వ్యాసం తెలుగులో వచ్చింది.రాజ్యాంగాన్ని వలసవాద పత్రమని కొంతమంది పేర్కొనడం సరికాదని ఆయన పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలో భారతీయమేదీ లేదని ఆరోపించిన సంస్థ సాక్షాత్తూ ఆరెస్సెస్ మాత్రమేనని ఆ కుదురు నుంచే వచ్చిన నేతలకు తెలియకపోవడం ఆశ్చర్యమే.అప్పట్లో రాజ్యాంగ నిర్మాతలు అమెరికా, బ్రిటన్, కెనడా, స్విడ్జర్లాండ్ వంటి దేశాల రాజ్యాంగాలను కూలంకషంగా అధ్యయనం చేస్తే దానికి మింగుడు పడలేదు. రాజ్యాంగంలో భారతీయతే లేదని దాన్ని ఆమోదించిన రోజునే వారి అధికార పత్రిక 'ఆర్గనైజర్'లో రాశారు. ఆగష్టు 15స్వాతంత్ర దినోత్సవం, జనవరి 26 రిపబ్లిక్ దినోత్సవం రెండే జాతీయ పర్వదినాలుగా జరు గుతూ వచ్చాయి. మోడీ నవంబరు 26న రాజ్యాంగాన్ని రాజ్యాంగ పరిషత్తు ఆమోదించిన రోజు అంటూ దానికి రాజ్యాం గ దినోత్సవం పేరు పెట్టారు. 2015లో అధికారికంగా తీసుకున్న ఈ నిర్ణయం జనవరి 26 రిపబ్లిక్ డే ప్రాధాన్యత తగ్గించేందుకే.

జనవరి 26 ఎందుకు?

1950 జనవరి 26 నుంచి రాజ్యాంగం అమల్లోకి తీసుకురావడం స్పష్టమైన అవగాహనతో జరిగింది. 1930జనవరి 26న పూర్ణస్వరాజ్ దినోత్సవం జరపాలని కాంగ్రెస్ జాతీయోద్యమకాలంలో ఇచ్చిన పిలుపును గుర్తు చేసుకోవడానికి ఈ తేదీని తీసుకున్నారు. కాని కాంగ్రెస్ పూర్ణస్వరాజ్ పిలుపునివ్వడానికి రంగం సిద్ధం చేసింది కమ్యూనిస్టుపార్టీ ఆవిర్భావం. కాంగ్రెస్‌తో విభేదించి స్వరాజ్య పార్టీ పెట్టుకున్న మోతీలాల్ నెహ్రూ ప్రభృతులు పరిమిత ప్రతిపత్తితో అధికారం పంచుకోవడానికి సిద్ధమవుతున్నారు. దేశ ప్రజలకు సమ్మతించదగిన రాజ్యాంగం ఇవ్వాలని 1924లో స్వరాజ్ పార్టీ తీర్మానం చేసింది. 1920లో తాష్కెంట్‌లో భారత కమ్యూనిస్టు పార్టీకి అంకురార్పణ జరిగిననాటి నుంచి సంపూర్ణ స్వరాజ్యం కోరుతూ వచ్చారు. 1921 అహ్మదాబాద్ కాంగ్రెస్ మహాసభలో వారే పూర్తి స్వాతంత్రం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు, మళ్లీ 1927లో మద్రాసు కాంగ్రెస్ మహాసభలో జవహర్‌లాల్ నెహ్రూ పైన చెప్పినట్టు పూర్ణస్వరాజ్ కోసం 1930జనవరి26న పతాకావిష్కరణలు చేయాలని తీర్మానం ప్రవేశపెట్టి నపుడు బలపర్చిన ప్రతినిధి జోగ్లేకర్ కమ్యూనిస్టు నాయకుడే. 1947లో దేశానికి స్వాతంత్ర్యం కూడా ఆ తేదీనే ప్రకటించవచ్చునని మొదట భావించారు.అయితే ఘోరమైన మతకలహాల కల్లోలం రీత్యా కాస్తముందుకు జరిపి ఆగష్టు 15నే ప్రకటించారు. 1948 జనవరి 26న ఈ విషయాలు సభల్లో చెప్పారు కూడా. నిజంగానే 1948 జనవరి 30న గాంధీజీని మతశక్తులు హత్య చేయడంతో ఆ భయాలు నిజమయ్యాయి.

గాంధీజీ హత్య,అంబేద్కర్‌కు అవమానం

1950 జనవరి 26న రాజ్యాంగాన్ని అమలు మొదలు పెట్టేనాటికి దేశం మతకలహాల ముప్పునూ సామ రస్యత లౌకికతత్వం ఆవశ్యకతనూ గుర్తించగలిగింది. గాంధీజీ హత్యకు శిక్ష విధించబడిన గాడ్సేను దేశ భక్తుడుగా చెప్పేవారు. ఆయన గురువైన వీరసావర్కార్‌ను పార్ల మెంటులో ప్రతిష్ఠించినవారు దేశాధిపత్యం చేపట్టిన ఫలితమిది. రాజ్యాంగస్ఫూర్తిపై దాడికి నవంబరు 26 నిర్ణయం తొలిఅడుగు మాత్రమేనని తర్వాత వరుసగా జరుగుతున్న మార్పులు,చర్యలు, తాజాగా తీసుకొచ్చిన జమిలి ఎన్నికల బిల్లులు వంటివన్నీ స్పష్టం చేస్తున్నాయి.

లిఖిత రూపంలో ప్రపంచంలో మరేదేశానికి లేనంత పెద్దది భారత రాజ్యాంగం. దానికోసం జరిగిన లోతైన చర్చల్లో 36 లక్షల పదాలు వున్నాయని రికార్డులు చెబుతున్నాయి.7635 సవరణలను లేదా ప్రతిపాదనల్లో 2473 వివరంగా చర్చించి నిర్ధారణలకు వచ్చారు. 395 అధికరణలు, 8 షెడ్యూళ్లలో వీటిని పొందుపర్చారు. ఆరోగ్యం అంత బాగాలేనప్పటికీ భీమ్‌రావ్ రాంజీ అంబేద్కర్ దానికి తుదిరూపమివ్వడానికి అంకితమయ్యారని రాజ్యాంగ పరిషత్ చైర్మన్ తొలిరాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ అభినందించారు. దాదాపు 300 మంది రాజ్యాంగ పరిషత్ సభ్యులు ఇంచుమించు మూడేండ్లపాటు శ్రమించి, చర్చించి, తర్కించి, వాదించి, శోధించి దాన్ని జాతికి అందించారు. మొదట ఇందుకు సంబంధించిన ఎజెండా ప్రతిపాదిస్తూ జవహర్‌లాల్ నెహ్రూ ఇది మన సంకల్పం అని ప్రతిజ్ఞ అనీ ప్రకటించారు. ఆయనే మళ్లీ తొలి ప్రధానిగా అధికారం స్వీకరిస్తూ ప్రపంచమంతా నిద్రలో వున్న ఈ సమయంలో భారతదేశం స్వాతంత్ర్య యుగోదయంలోకి ప్రవేశిస్తున్నదని ప్రకటించారు. నిరంతర అప్రమత్తతే స్వాతంత్ర్యానికి మూలం అన్నది శాశ్వత సూక్తి. రాజ్యాంగ రూపకల్పనలోనూ ఆమోదించి అమలుకు తేవడంలోనూ స్వాతంత్ర్య యోధులు, న్యాయ కోవిదులు, దేశభక్తులు ఆదర్శంగా పెట్టుకున్న లక్ష్యాలకూ ఈనాటి పరిస్థితికి పొంతన ఏమైనా వున్నదా అని బేరీజు వేసుకోవాలి.ఎందుకంటే రాజ్యాంగం అమలు తీరు నిజమైన కొలబద్ద అని చెప్పిన అంబేద్కర్ బొమ్మ పెట్టుకోవడం కన్నా దేవుడిబొమ్మ పెట్టుకుంటే పుణ్యం వచ్చేదని హోంమంత్రి అమిత్ షా రాజ్యాంగ వార్షికోత్సవ చర్చలోనే అనడం ఇందుకు నిదర్శనం.

స్ఫూర్తికి ఎసరు

'దేశమంటే మనుషులోయ్' అన్నట్టే, రాజ్యాంగమంటే దాని మౌలిక స్వభావమే, ఇచ్చే నిర్దేశమే తప్ప నిర్జీవ నిబంధనలు కాదు. రాజ్యాంగం 368వ అధికరణం పరిస్థితులకు తగినట్టు దాన్ని మార్చుకునే అధికారం ఇస్తున్నదని మొదట పేర్కొన్న 'టైమ్స్' వ్యాసం చెబుతుంది. రాజ్యాంగం మౌలిక స్వభావం సిద్ధాంతం కూడా తర్వాత కాలంలో సుప్రీంకోర్టు ఇచ్చిందే తప్ప అందులోది కాదని ఆ వ్యాసకర్త అంటారు.రాజ్యాంగంలో ఏదీ పరమ పవిత్రం కాదని స్వయంగా రెండోస్థానంలో వున్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధంకర్ ఇటీవల వాక్రుచ్చారు. ఏది ఎలాగైనా మార్చే యోచన ఉన్నట్టయితే ఇక దేశాలకు రాజ్యాంగాల అవసరమే వుండదు.

ఇప్పుడు ఒక అధికార పార్టీ లేదా కూటమి సభలో విశ్వాసం కోల్పోతే, కాదంటే బలాబలాలు మారితే దిగిపోవలసి వుంటుంది.మరెవరూ ముందుకు రాకపోతే సభ రద్దయిపోతుంది. కానీ జమిలి బిల్లు వస్తే ఇదీ వుం డదు. కేంద్రం, రాష్ట్రం, గవర్నర్, రాష్ట్రపతి మధ్య ఏ ప్రభుత్వం, ఏ సభ రద్దవుతుందో, కొనసాగుతుందో తెలియని స్థితి. ఎందుకంటే ప్రభుత్వం పడిపోయినా వెంటనే ఎన్నికలు జరపాల్సిన పనిలేదు.కొత్తగా వచ్చే ప్రభుత్వం మిగిలిన కాలానికి మాత్రమే పనిచేస్తుంది.(ఉప ఎన్నికల్లో మిగిలిన కాలమే వున్నట్టు) అంటే జవాబుదారీతనం ఎటుపోతుంది? కొత్తగా ఎన్నికైనవారి పదవీ కాలం తగ్గించడమంటే ఎవరి తప్పుకు ఎవరిని శిక్షిస్తున్నట్టు?



ఇప్పుడు ప్రధాని చేతుల్లో విపరీతాధికారాలు పోగుపడుతున్న ప్రస్తుత పరిస్థితి పరోక్ష అధ్యక్ష తరహాకు దారితీస్తున్నదనే విమర్శలు వింటూనే వున్నాం. ఇది రిపబ్లిక్ డే నాడు శకటాలను ఇష్టానుసారం తిరస్కరించడంలోనూ కేంద్ర పెత్తనమే గోచరిస్తుంది.జమిలి ఎన్నికల బిల్లు దాన్నే ప్రతిబింబిస్తుంది. పౌరులందరికీ సమాన హక్కులు, ప్రజలచే ఎన్నికవ్వడం,లౌకిక తత్వం,సమాఖ్య తత్వం అన్నవి మన రాజ్యాంగానికి మౌలిక లక్షణాలు. వీటిపై జరుగుతున్న దాడులు అందుకు వ్యతిరేకంగా పోరా టాలు గమనిస్తే 75 ఏండ్ల రిపబ్లిక్ సన్నివేశం కండ్లకు కడుతుంది.

ఒక విధాన చట్రంగా మూలసూత్రాలుగా వాటి పరిధిలోనే వ్యవహరించాలన్నది ఇక్కడ కీలకం. 368 ప్రకారం పార్లమెంటులో బలం వుంది గనక ఏది ఎలాగైనా తలకిందులు చేస్తామంటే చెల్లుబాటు కాదు, కాకూడదు.

స్వభావరీత్యా ప్రజాస్వామికం, రాజరికం రెండు రకాలు (డెమోక్రసీ, మోనార్కీ).పాలనాపరంగా అధ్యక్ష తరహా, పార్లమెంటరీ తరహా(ప్రెసిడెన్సియల్ పార్లమెంటరీ) అధ్యక్ష తరహా,అధ్యక్ష తరహా పార్లమెంటరీ మిశ్రమం, పూర్తి పార్లమెంటరీ తరహా అనే మూడు విధానాలు ప్రపంచంలో వున్నాయి. అధ్యక్ష తరహాలో అన్నీ అధ్యక్షులే శాసిస్తారు. మిశ్రమ తరహాలో ప్రధాని అధ్యక్షుడు(రాష్ట్రపతి) ఉభయులూ పార్లమెంటుకు బాధ్యత వహిస్తారు. మరికొన్ని చోట్ల అధ్యక్షుడే ప్రధానిని ఎంపిక చేస్తూ పాలన చేస్తాడు. మిశ్రమ పద్ధతిలో కొన్నిచోట్ల అధ్యక్షుడు కొన్ని చోట్ల ప్రధాని కీలక పాత్ర వహిస్తారు. మన దేశంలో రాష్ట్రపతి నామమాత్రం కాగా ప్రధాని సలహాపైనే నిర్ణయాలు తీసుకుంటాడు. ఈ విధానాన్ని కూడా ఇష్టప్రకారం మార్చేసే వీలుండదు. మన చుట్టుపక్కల శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ వంటి చోట్ల వీటిని అటూ ఇటూ మార్చిన ఉదాహరణలున్నాయి. వాటిని కోర్టులు కొట్టివేసిన సందర్భాలూ వున్నాయి, రాజకీయ వ్యవస్థ బలహీనంగా వున్నచోట్ల సైనికబలంతో అమలు చేసిన హెచ్చరికలూ వున్నాయి. ఇప్పుడు ప్రధాని చేతుల్లో విపరీతాధికారాలు పోగుపడుతున్న ప్రస్తుత పరిస్థితి పరోక్ష అధ్యక్ష తరహాకు దారితీస్తున్నదనే విమర్శలు వింటూనే వున్నాం. ఇది రిపబ్లిక్ డే నాడు శకటాలను ఇష్టానుసారం తిరస్కరించడంలోనూ కేంద్ర పెత్తనమే గోచరిస్తుంది.జమిలి ఎన్నికల బిల్లు దాన్నే ప్రతిబింబిస్తుంది. పౌరులందరికీ సమాన హక్కులు, ప్రజలచే ఎన్నికవ్వడం,లౌకిక తత్వం,సమాఖ్య తత్వం అన్నవి మన రాజ్యాంగానికి మౌలిక లక్షణాలు. వీటిపై జరుగుతున్న దాడులు అందుకు వ్యతిరేకంగా పోరా టాలు గమనిస్తే 75 ఏండ్ల రిపబ్లిక్ సన్నివేశం కండ్లకు కడుతుంది.

జవాబుదారీతనం మాయం

'రాజ్యాంగాన్ని భారత ప్రజలమైన మేము మాకు ఇచ్చుకుంటున్నాము' అని పేర్కొంటున్నాం. అంటే వ్యవస్థలో జరిగిన దానికి చేసిన దానికి ఎవరో ఒకరు అందరికీ జవాబుదారీగా వుండాలి.అధ్యక్ష తరహా పార్లమెంటరీ తరహా ఏదైనా సరే. మనం తీసుకున్న పార్లమెంటరీ వ్యవస్థలో అందరూ రాజ్యాంగానికి జవాబుదారి. కేంద్రంలో వారు పార్ల మెంటుకు రాష్ట్రాల్లో పాలకులు శాసన సభలకూ జవాబుదారీ. ఓటర్ల ఆమోదంతో ఎన్నికై అధికారం చేపట్టి విధానాలు చట్టాలు రూపొందించేవారు సుప్రీంకోర్టుకు జవాబుదారీ.అంటే వారు చేసిన చట్టాలు రాజ్యాంగ నిబంధనలకు లో బడి వున్నాయా లేదా అని సుప్రీంకోర్టు, హైకోర్టు చెబుతాయి. న్యాయవ్యవస్థ కూడా రాజ్యాంగ పరిధిలో పనిచేయ వలసిందే. ఏ వ్యవస్థ రాజ్యాంగానికి అతీతం కాదు. అయితే జవాబుదారీతనం సమిష్టిగానూ వ్యక్తిగతం గానూ వుంటుంది. ఉదాహరణకు సభల్లో బలాన్ని బట్టి ప్రధాని, ముఖ్యమంత్రి నియామకం జరిగాక మంత్రివర్గం దాని తరపున నాయకులుగా వున్న ప్రధాని లేదా ముఖ్యమంత్రి సభకు బాధ్యత వహించాలి. అంతర్గతంగా ఆయా శాఖలు లేదా విభాగాలు చూసేవారు ముఖ్యమంత్రికి, ప్రధానికి, ప్రభుత్వాలకు బాధ్యత వహించాలి.ఇది విస్తృతమైన విభజన. కానీ రాజధానుల నుంచి ప్రాజెక్టుల వరకూ దేశమంతటా కొనుగోళ్ల నుంచి నిధుల వరకూ ఎన్ని తప్పులు జరిగినా, ఎన్ని కేసులు నడిచినా పూర్తి బాధ్యత ఎవరిదనేది తేల్చడం లేదు. కేంద్ర దర్యాప్తు సంస్థలు కూడా అస్మదీయులు తస్మదీయులనే ప్రాతిపదికన వెళ్లడం కోర్టుల్లోనూ రకరకాల తీర్పులు రావడం జరిగిపోతుంది. అదానీ విద్యుత్ కొనుగోళ్లు,కాళేశ్వరం, పోలవరం, అమరావతి, బీహార్‌లో గుజరాత్‌లో బ్రిడ్జిలు పతనం ఎన్ని సంచలనాత్మక తప్పిదాల్లో బాధ్యత తేల్చారా?గుజరాత్ మారణకాండతో సహా ఎన్నో జరిగిపోయాయి. కానీ పాలకులు ఎవరిపైనా ఏదైనా చర్య చూశామా?

ఇప్పుడు ఒక అధికార పార్టీ లేదా కూటమి సభలో విశ్వాసం కోల్పోతే, కాదంటే బలాబలాలు మారితే దిగిపోవలసి వుంటుంది.మరెవరూ ముందుకు రాకపోతే సభ రద్దయిపోతుంది. కానీ జమిలి బిల్లు వస్తే ఇదీ వుం డదు. కేంద్రం, రాష్ట్రం, గవర్నర్, రాష్ట్రపతి మధ్య ఏ ప్రభుత్వం, ఏ సభ రద్దవుతుందో, కొనసాగుతుందో తెలియని స్థితి. ఎందుకంటే ప్రభుత్వం పడిపోయినా వెంటనే ఎన్నికలు జరపాల్సిన పనిలేదు.కొత్తగా వచ్చే ప్రభుత్వం మిగిలిన కాలానికి మాత్రమే పనిచేస్తుంది.(ఉప ఎన్నికల్లో మిగిలిన కాలమే వున్నట్టు) అంటే జవాబుదారీతనం ఎటుపోతుంది? కొత్తగా ఎన్నికైనవారి పదవీ కాలం తగ్గించడమంటే ఎవరి తప్పుకు ఎవరిని శిక్షిస్తున్నట్టు? పెద్దనోట్ల రద్దు వంటి నిర్ణయాలు, భారీ కుంభకోణాలు,లక్షల కోట్ల ఎగవేతలు, ప్రజల ఆస్తులు కట్టబెట్టడాలు - వీటికి పాలకుల బాధ్యత ఏమై పోతున్నట్టు? సార్వభౌమత్వాన్ని కాపాడవలసిన కేంద్రపాలకులు అమెరికా వంటి దేశాల ఒత్తిడికి లోబడిపోతే పార్లమెంటుకు కూడా జవాబుదారీతనం ఎక్కడ మిగిలేట్టు? తమ రాజకీయ అవసరాల కోసం దుస్సాహస నిర్ణయాలు తీసుకుంటే ఎక్కడ చర్చ జరిగేట్టు? అలాగే అధికారాన్ని నిరంకుశంగా వినియోగించి ప్రజల హక్కులు హరిస్తే ఎక్కడ విచారించేట్టు? ఇవన్నీ 75ఏండ్ల అనుభవం ముందుకు తెస్తున్న కీలక సవాళ్లు. వాటికి జవాబులు వెతకాల్సింది పోయి, ఉన్న హక్కులను కూడా తొలగించడం, వ్యవస్థలను తలకిందులు చేసి వ్యక్తుల పెత్త నాలు రుద్దడం అనుమతించ రానిది. ట్రంప్ ప్రమాణ స్వీకారంలో ఎలన్‌మస్క్ చక్రం తిప్పినట్టే ఇక్కడ పాలకుల నీడన అదానీలు, అంబానీలు, ఇంకా రాష్ట్రాల కుబేరులు ధనాన్ని, మతాన్ని జోడించి స్వారీ చేస్తుంటే ఇక జవాబుదారీ తనం, రాజ్యాంగ విలువలు ఎటుపోయేట్టు? ఆగష్టు 15న జెండా ఎగరేస్తారు.అంటే ఒక ఎత్తుకు చేరుస్తారు. జనవరి 26న పైనకట్టి వున్న జెండా ఆవిష్కరిస్తారు. అంటే స్వేచ్ఛగా ఎగిరేలా చేస్తారు. తెచ్చుకున్న స్వాతంత్ర్యాన్ని సరిగ్గా కాపాడుకోవడమే ఇందులో సందేశం. ■

ట్రంప: ట్రంపస్య.. ట్రంపోభ్య:

ట్రంపు భలే ఇంపు అన్నాడొక మిత్రుడు. వెంటనే, కాదు కాదు ట్రంపు ఓ కంపు అన్నది ఓ స్నేహితురాలు. కానే కాదు ట్రంపు మాట వినసొంపు అన్నాడో పెద్దమనిషి.. లేదు లేదు ట్రంపు ఏమంత ఇంపైన పదం కాదని మరో పండితురాలు అన్నది. ఈ డైలాగులన్నీ పక్కనే ఉన్నా మాట్లాడుకునేవాళ్లకు తెలియకుండా వింటోంది పిపీలకం అనే మాద్రన్ చీమ. సహజంగానే దానికి ఎన్నో అనుమానా లొచ్చాయి. రావిశాస్త్రి గారి కథలోలాగ తానూ బయలుదేరి మాంచి తెలివి గలవారిని కలిసి ఇంతకీ ఈ ట్రంపు నిజంగా ఇంపు, కంపు, సొంపునా లేక ఇవేవీ కాని మరో మనిషా అని తెలుసుకోడానికి అక్కడినుండి జనంపై, ప్రపంచంపై పడింది చీమ.




జంధ్యాల రఘుబాబు
9849753298

మొదట దువ్వాడ జగన్నాథం సినిమా డైలాగులు రాసినతని దగ్గరికి పోయింది పిపీలకం. ఆయన వెంటనే తన డైలాగు ట్రంప: ట్రంపస్య ట్రంపోభ్య:... అన్నాడు. ఈ పదాలకు అర్థమేమిటన్నది పిపీలకం. నేను బిజీగా ఉన్నాను మళ్లీ రమ్మన్నాడాయన. డ్రీం రియలిజంలో లాగ కలనో, నిజమో తెలియకుండానే చీమ తనకిష్టమైన వాళ్లదగ్గరికి అలవోకగా పోతోంది. అలా ఇంగ్లీషు రచయిత, నాటకకర్త షేక్స్పియర్ దగ్గరికి పోయింది. ట్రంపు గురించి అడిగింది, మీకేమైనా తెలిస్తే చెప్పమంది. ఆయనొక్కటే మాట చెప్పాడు. ట్రంపు మిత్రులెవరో చెప్పు నేను ట్రంపు గురించి చెబుతాను అన్నాడు. ఆయన ప్రమాణ స్వీకారానికి హాజరై వచ్చిన వాళ్లెవరో ముందు కనుక్కో అన్నాడు. చీమ వెంటనే ట్రంపు మిత్రులెవరు అని కనుక్కోవడానికి బయలుదేరింది. ఆయన మిత్రుల్ని వరుసగా కలుస్తోంది. ఒక మిత్రుడేమో ట్రంపంటే అమెరికా ప్రెసిడెంటు అంటే ప్రపంచంలో బాగా ప్రాచుర్యమున్న, బలవంతుడైన వ్యక్తి అన్నాడు.

ప్రపంచంలో బలవంతుడైన వ్యక్తి ఎలాగవుతాడు? ఒక్క బాక్సింగు క్రీడాకారిణిని లేదా క్రీడాకారుణ్ణి కొట్టగలడా అని ఆరా తీసింది.కొట్టలేడని చెప్పారు చాలామంది. మరి ప్రపంచంలో అందరికంటే ఎలా బలవంతుడవుతాడు అమెరికా ప్రెసిడెంటు, అది ట్రంపు కావచ్చు ఇంకెవరైనా కావచ్చు అనేసరికి అసలు అమెరికా అధ్యక్షుడంటే ప్రపంచ పోలీసు నీకేం తెలుసు?అని ఇంకొకరన్నారు. మరి మామూలు సూటు బూటు వేసుకున్నాడు కదా పోలీసెలా అవుతాడు వాళ్ల యూనిఫాం కూడా వేసుకోలేదు కదా అంది పిపీలకం. ఓసి పిచ్చి పిపీలకమా అదంతే! ప్రపంచ పోలీసు అలాగే ఉంటాడు మరి. చేతిలో లాఠీ పెట్టుకొని ఉంటాడా ఏమన్నా? అవసరమొచ్చినప్పుడు తన లాఠీ లాంటి ఆధిపత్యం చూపిస్తాడు అదే అందులో ఉన్న తమాషా అన్నారింకొకరు.

అసలు ఈ రాష్ట్రంలో, ఈదేశంలో కాదు నేను సీదా అమెరికాకే పోయి ట్రంపుగారి ఆఫీసులో ఏమేమి జరుగుతాయో చూసిరావడం మేలు అనుకొని పిపీలకం రాజీవ్‌గాంధీ ఎయిర్‌పోర్టుకు బయలుదేరింది. ఎటువంటి పాసుపోర్టు, వీసా కనీసం టికెట్టు కూడా లేకుండానే విమానమెక్కేసింది. విమానంలో పోతున్న భారతీయులు అక్కడ పౌరసత్వం ఉన్నోళ్లు, ఇప్పుడు తీసుకుందామని ప్రయత్నాలు చేస్తున్నవాళ్లు మాట్లాడుకునే మాటలు మన పిపీలకం గారి చెవిలో పడ్డాయి. తన దేశ పౌరల క్షేమమే తనకు ముఖ్యం అని ట్రంపు మాటలున్న వీడియో చూస్తున్నాడు ఒక యువకుడు. పక్కనే ఇంకో యువతి, ఇద్దరూ భార్యాభర్తలు అక్కడ ఒకరికి ఉద్యోగముంది ఇంకొకరికి ప్రయత్నం చేద్దామని పోతున్నారు. తెలుగులో మాట్లాడుతుండడం విని పిపీలకానికి ఆశ్చర్యమేసింది, అరే వీళ్ళు తెలుగోళ్ళు కదా ఇంగ్లీషులో కదా మాట్లాడాల్సింది అనుకుంది కూడా. పక్కనోళ్లకు వినబడకుండా అలా తెలుగులో మాట్లాడుతున్నారని తరువాత అర్థమయింది. ఇప్పుడు ట్రంపు చేస్తున్న పనులకు, మాట్లాడుతున్న మాటలకు ఎక్కువగా





భయపడు తున్నది భారతీయులే అని అర్థమయింది. ఇంతలో దానికి ఆకలిగా అనిపించింది. విమానంలో పిల్లలు తింటూ పడేసిన కేకుపొడి, ఇంకా అలాంటివే దొరికితే తిని పడుకుంది పిపీలకం. వాషింగ్టన్ వచ్చిందని అందరూ దిగిపోతున్నారు.

మెల్లగా అందరూ దిగిపోయినాక తానూ దిగింది పిపీలకం. తననెవరైనా చూస్తున్నారేమోనని మొదట అనుమానపడింది. ఎవరిపనుల్లో వాళ్లున్నారు. అక్కడి చీమలు కూడా తనని చూసినట్టు అనిపించింది కాని అవి పెద్దగా పట్టించుకోలేదు. ట్రంపు పాలనలో తమకేమైనా మేలు జరుగుతుందని అనుకుంటున్నారా అని వాటిని అడిగింది పిపీలకం వచ్చీరాని ఇంగ్లీషులో. ఎవరొస్తే ఏమన్నట్టు మాట్లాడాయి అవికూడా. సరేననుకుని మెల్లగా ప్రెసిడెంటు ఉండే స్వేతసౌధం వైపు పోయింది. అక్కడ చీమలతో ఇంటర్వ్యూ చేసి కొన్ని వివరాలు రాబట్టింది. విలేకరులతో ట్రంపుగారు ఏర్పాటు చేసిన ఇష్టాగోష్టి అది. అందరికీ వాళ్ళ టిఫిన్లు ఇచ్చారు. వాళ్లు తినేలోపు వైట్‌హవుస్ వంటశాలలో తనకు నచ్చినవి తినొచ్చింది పిపీలకం. విలేకరులు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానాలిస్తున్నాడు ట్రంపు. ఈదేశంలో పుట్టినంత మాత్రాన ఇక్కడి పౌరసత్వం రాదని ఖరాకండిగా చెబుతున్నాడు. అలా చేస్తే మన దేశానికి నష్టం కదా అన్న ఒక ప్రశ్నకు ముందు నాదేశ పౌరుల్ని కాపాడుకోవడం నా విధి అంటున్నాడు. ఫలానా తేదీ తరువాత పుట్టేటోళ్లకు పౌరసత్వం రాదంటున్నాడు. మొదట సరైన పత్రాల్లేని ఐదువందల విదేశీ పౌరుల్ని వాళ్ల వాళ్ల దేశాలకు పంపేశానన్నాడు. ఇలా చేస్తే వాళ్లు చేసే పనులు అంత తక్కువ జీతాలకు ఇతరులు చేయరు కదా అని ఒక విలేకరి అడిగాడు. నువ్వు బైడెన్ మనిషివా? అన్నాడు ట్రంపు. ఆ నోటి కంపు భరించలేక ఊరకున్నాడు ఆ విలేకరి. దానికీ మార్గం చూపు తానన్నాడు. ఆ సమావేశం తరువాత పెద్ద పెద్ద కంపెనీల సీయీవోలతో సమావేశమయ్యాడు అధ్యక్షుడు. అక్కడికీ పోయింది మన పిపీలకం. అక్కడ వాళ్లు నిర్దేశించినవి తన సహాయకుడు అన్నీ రాసుకుంటున్నాడు. త్వరలో ఇవన్నీ చేస్తానని చెబుతున్నాడు వాళ్లకి. అమెరికాలో కొన్ని రాష్ట్రాలకు కూడా పోయింది పిపీలకం. అన్నిదేశాల వాళ్ల ఇండ్లకూ పిలవని పేరంటంలా పోయి అక్కడక్కడ కొన్ని విషయాలు కనుక్కుంది. అయినా తృప్తి కలుగలేదు దానికి.

ఓరోజు ట్యాంకుబండు దగ్గర ఓ పెద్దాయన కూచొని ఉన్నాడు. ఆయన్నడిగితే ఏమైనా తెలుస్తుందేమోనని మెల్లగా కదిలించింది. నువ్వు రావి శాస్త్రి పిపీలకానివా అన్నాడాయన. నేను కొత్త తరం పిపీలకాన్ని, ఐనా నాకూ కొన్ని అనుమానాలున్నాయి అని అమెరికా అధ్యక్షుడి గురించిన విషయం అడిగింది. చూడూ సీదా ఉస్మానియా యూనివర్సిటీకి పో. అక్కడ అపర్ణ అనే విద్యార్థిని అమెరికా అధ్యక్షులపై పరిశోధన చేస్తోంది.ఆమెనే తీరుస్తుంది నీ అనుమానాలు అన్నాడు. సరేనని అపర్ణను కలిసింది పిపీలకం. తనకున్న అనుమానాలన్నీ అడిగింది. ఇంతలేవు నీవు అనుకోకుండా పిపీలకం గారూ అని మొదలు పెట్టింది అపర్ణ.

సూటు బూట్లు, మంచి తిండి, వైట్ హవుస్ నివాసం, మంచి గుర్తింపు, ప్రథమ పౌరుడు భార్యకు ప్రథమ పౌరురాలు, చార్టరుడు విమానాలు, మంచి కార్లు ఇలా అన్నీ ఉంటాయి అధ్యక్షుల వారికి. పెద్ద బుష్షును ఒకరు ఎదిరిస్తే చిన్న బుష్షు తరువాత చంపుతాడు. ఏ అధ్యక్షుడైనా ఏమున్నది గర్వకారణం అన్నట్టుగా రీగన్ కాదు, ఒబామా కాదు ఇంకెవరైనా తమ దేశంలో ఉన్న పెట్టుబడిదారులే ఆ దేశాన్ని, తద్వారా ప్రపంచాన్ని కంట్రోలు చేసేది. అంతెందుకు ఏయే అధ్యక్షుడు ఉండంగా ఏయే యుద్ధాలు చేశాడు, చేయించాడు లేకుంటే ఆయుధాలందించాడు? ఒక్క అధ్యక్షుడైనా ఒక యుద్ధాన్ని ఆపాడా? ఇప్పుడు జరుగుతున్న హమాస్-ఇజ్రాయిల్ యుద్ధమే తీసుకో అధ్యక్షుడు ఏవైపున్నాడు. ఇప్పుడు కొత్త ప్రెసిడెంటు వచ్చాడు కదా అంతకుముందాయన మొదలుపెట్టిన వాటిని ఆపుతాడా? కాబట్టి పిపీలకం గారూ, తోలుబొమ్మలాట చూశారా అలాగే ఈ అధ్యక్షుడి ఆట ఆడించేది వేరే వాళ్లు. ముందు అది తెలుసుకోండి.

పిపీలకానికి మనసు తేలికపడిందిప్పుడు. హాయిగా తన చిన్ని చిన్ని ఊపిరితిత్తులతో గాలి తీసుకుంది. అమెరికా అధ్యక్షుడంటే ఓ మిలిటరీ ఉద్యోగం అనుకుంటూ ఇంటికి పోయింది. ఇంట్లో కుటుంబ సభ్యులు ఎదురుచూస్తుంటారు వాళ్లకు విషయాలు చెప్పాలని కూడా అనుకుంది. ■

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సాధారణ ప్రసవాలు చేయాలి

డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ



మందులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

నవతెలంగాణ - తిమ్మాపూర్ : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సాధారణ ప్రసవాలు చేయాలని, అలాగే వాటి సంఖ్యను పెంచాలని డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ మండల వైద్యాధికారి డాక్టర్ ప్రణవ్‌ను ఆదేశించారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం డిఐఓ డాక్టర్ సాజిదతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో గల లేబర్ రూమ్, ఫార్మసీ, ఐఎల్ ఆర్ డీప్ ఫ్రీజర్, అవుట్ పేషెంట్ విభాగాలను పరిశీలించారు. రోజువారీగా ఆసుపత్రికి ఎంతమంది రోగులు వస్తున్నారని ఆరా తీశారు. అలాగే ఫార్మసీలో గల మందుల ఎక్స్పైరీ డేట్ లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ ప్రణవ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం



నవతెలంగాణ - కరీంనగర్ : తెలంగాణ గిరిజన సంక్షేమ బాలుర డిగ్రీ కళాశాల, కరీంనగర్‌లో గణిత-గణాంక శాస్త్ర శాఖ ఎఫ్‌డీపీ (ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ యు.ఉమేశ్ కుమార్, గౌరవ అతిథిగా బీఓఎస్ ఛైర్మెన్ డాక్టర్ ఎమ్.రాఘవేందర్‌శర్మ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వేణుగోపాల రావు అధ్యక్షత వహించగా పారిశ్రామిక నిపుణులు ఎం.ఆదిత్య, కళాశాల గణాంక శాస్త్ర శాఖాధ్యక్షులు డాక్టర్ ఎం.ఉదయ్ శంకర్ బోధకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ డిగ్రీ కళాశాలల గణాంక శాస్త్ర అధ్యాపకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో అవినీతి మరకలు

- ఎమ్మెల్యే గంగుల వర్సెస్ మేయర్ సునిల్‌రావుగా హీటెక్కిన పొలిటికల్ వార్
- రూ.కోట్ల నిధులు పక్కదారి పట్టించారంటూ ఒకరిపైనొకరు ఆరోపణలు
- ఇన్నాళ్లూ కలిసే పని చేసినా.. ఏనాడూ బహిర్గతంకాని విబేధాలు
- మేయర్ పార్టీ వీడటంతో బయటపడ్డ వైనం
- గంగులది... కమీషన్ల చాటు అవినీతి రాజకీయమేనంటూ మేయర్ వ్యాఖ్య
- నీ అవినీతిపైనే విచారణ చేయిస్తామంటూ ఎమ్మెల్యే గంగుల కౌంటర్
- స్మార్ట్‌సిటీ నిధుల దుర్వినియోగంపై ఏసీబీ తలుపు తట్టిన బీఆర్ఎస్ కార్పొరేటర్
- రెండు రోజులుగా రసవత్తరంగా మారిన కరీంనగర్ పొలిటికల్ సర్కిల్



పదేండ్ల అధికార పదవీకాలంలో బీఆర్ఎస్ పార్టీ.. కరీం'నగరం'లో ఓ వెలుగువెలిగింది. స్థానిక ఎమ్మెల్యే 'గంగుల' ఏకంగా నాలుగుసార్లు గెలిచిన హైట్రిక్ విన్నర్‌గా రికార్డు సృష్టించారు. ఇదే సమయంలో పదేండ్లు కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌నూ అదే పార్టీ నేతలూ ఏలారు. గతంలో ఆ పార్టీకి చెందిన సర్దార్‌రవీందర్‌సింగ్ మేయర్‌గా పనిచేయగా.. తరువాత వచ్చిన ఎన్నికల్లో వై.సునిల్‌రావు ఆ బాధ్యతలు నిర్వర్తించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే, మేయర్ పదవులతో వెలుగొందిన ఇద్దరు నేతల వైభవం కాస్త... ఇప్పుడు సునిల్‌రావు పార్టీ విడిన క్షణాన అవినీతి మరకల ఊబిలో చిక్కుకుంది. 'కమీషన్ల చాటున అవినీతి రాజకీయమే చేశారు' అంటూ ఎమ్మెల్యే గంగులను తీవ్రస్థాయిలో మేయర్ విమర్శిస్తే.. 'దొడ్డిదారిన పార్టీలో చేరి మేయర్ పదవి అడ్డంపెట్టుకుని అడ్డగోలుగా స్మార్ట్‌సిటీ నిధులు దోచుకున్నాడు' అంటూ ఎమ్మెల్యే దుమ్మెత్తిపోశారు. దీంతో ఎమ్మెల్యే వర్సెస్ మేయర్‌గా మారిన పొలిటికల్ వార్ కరీంనగర్ రాజకీయముఖచిత్రాన్ని హీటెక్కిస్తోంది.

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

'కరీంనగర్ నగరంలో జరిగిన అభివృద్ధి పనుల్లో పర్సెంటీజల పర్వం కొనసాగిందని, ఎమ్మెల్యే గంగుల కమీషన్లు తీసుకున్నారని అందుకు సంబంధించి చిట్టా అంతా తన దగ్గర ఉందంటూ మేయర్ సునిల్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్ర సహాయ మంత్రి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరిన ఆయన పేల్చిన మాటలతూటాలు ఇప్పుడు కరీంనగర్‌లో సరికొత్త చర్చకు దారి తీశాయి. ఇప్పటికే కరీంనగర్ స్మార్ట్‌సిటీకి రూ.900కోట్లమేర పనులు సాగాయి. ఈ పనులన్నింటిలోనూ కమీషన్ల వరద పారిందన్న విషయం ఇప్పుడు ఇద్దరు నేతల మాటల మధ్య వెలుగుజూస్తున్నాయి. అయితే అన్నీ తానై చూసుకుని కమీషన్ల వాటా కిందిస్థాయివరకూ చేరకుండా ఒక్కడే తీసుకున్నాడంటూ బీఆర్ఎస్ కార్పొరేటర్లు విమర్శలు చేస్తుండటం గమనార్హం. సునిల్‌రావుయే అవినీతి తిమింగలం అని ఆయనపై బీఆర్ఎస్‌నగర పార్టీ అధ్యక్షులు, డిప్యూటీ మేయర్ భర్త చల్లా హరిశంకర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మేయర్ వ్యాఖ్యలపై స్పందించిన ఎమ్మెల్యే గంగుల 'అధికార యావతో ఏ పార్టీ అధికారంలో ఉంటే అక్కడ దొడ్డిదారిన వెళ్తాడంటూ మేయర్‌ను ఉద్దేశించి మాట్లాడారు. రెండు దశాబ్ధాలు కాంగ్రెస్ చేసిన వెన్నుపోటు రాజకీయాల కారణంగానే ఆయన్ను ఆపార్టీ తీసుకోలేదని, ప్రత్యామ్నాయంగా బీజేపీ పంచన చేరాడంటూ చెప్పుకొచ్చారు. మేయర్‌గా తమ పార్టీలోనే ఉండటం, ఆయనపై పలుమార్లు ఫిర్యాదులు వచ్చినా పెద్దగా దృష్టిసారించలేదని, ఇప్పుడు ఆయన కపటవైఖరి బయటపడిందని అన్నారు. స్మార్ట్‌సిటీ నిధుల ఖర్చు, ఆయనపై వచ్చిన అవినీతి విమర్శలపైనా విచారణకు వెళ్తామంటూ ఘాటుగా స్పందించారు.

ఏసీబీ తలుపు తట్టిన బీఆర్ఎస్ కార్పొరేటర్

కరీంనగర్‌మున్సిపల్‌కార్పొరేషన్ మేయర్ సునిల్‌రావు బీజేపీ కండువా కప్పుకోగానే ఆయనపై గతంలో అవినీతి ఆరోపణలు చేసిన కార్పొరేటర్ కమల్‌జిత్‌కౌర్, ఆ పార్టీ నాయకుడు సర్దార్ సోహన్‌సింగ్ హైదరాబాద్‌లో ఏసీబీ డైరెక్టర్‌ను కలిశారు. మేయర్‌పైనా, స్మార్ట్‌సిటీ నిధుల దుర్వినియోగంపైనా విచారణ చేయాలని ఫిర్యాదు చేశారు. కార్పొరేషన్‌లోనే ఖర్చు చేయాల్సిన స్మార్ట్‌సిటీ నిధులను రజ్వీచమన్ చౌరస్తా, బొమ్మకల్‌చౌరస్తాలో వినియోగించారని తెలిపారు. కార్పొరేషన్‌లోని మీటింగ్ హాల్, మున్సిపల్ కార్యాలయాన్ని తిర్చిదిద్దేందుకు వెచ్చించిన నిధుల్లోనూ అవినీతి చోటుచేసుకుందని, జంక్షన్ల సుందరీకరణ కోసం ఖర్చు చేసిన నిధుల్లోనూ అవకతవకలు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నట్టు సమాచారం.

నాడు రవీందర్‌సింగ్.. నేడు సునిల్‌రావు...

పదేండ్ల బీఆర్ఎస్ అధికార పదవీకాలంలో రెండుమార్లు కరీంనగర్ మున్సిపల్‌కార్పొరేషన్‌ను ఆ పార్టీ నేతలే ఏలారు. తొలిదఫాలో మేయర్‌గా సర్దార్ రవీందర్‌సింగ్ పని చేశారు. ఆయన పదవీకాలం ముగిసే సమయానికి ఆయనకు, ఎమ్మెల్యేగంగులకు మధ్య పొరపొచ్చాలు బహిర్గతమయ్యాయి. ఏకంగా కరీంనగర్ ఎమ్మెల్యే టికెట్‌పై సర్దార్ దృష్టిసారించారన్న కారణంగా ఇరువురి మధ్య గ్యాప్ వచ్చింది. తరువాత వచ్చిన మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ సునిల్‌రావుకు మేయర్ బాధ్యతలు కట్టబెట్టింది. అయితే ఆయన కూడా పదవీకాలం ముగిసే చివరి రోజుల్లో ఎమ్మెల్యే గంగులపైనే తీవ్ర విమర్శలు చేస్తూ బీజేపీలో చేరారు. ఎమ్మెల్యే వర్సెస్‌గా 'అప్పుడు సర్దార్.. ఇప్పుడు సునిల్‌రావు'గా మారిందన్న చర్చ కరీంనగర్‌వాసుల్లో వ్యక్తమవుతోంది.

దోపిడి, పీడనకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి



నవతెలంగాణ - కరీంనగర్

పేదలు, బడుగు బలహీన వర్గాల పక్షాన నికరంగా నిలుస్తూ దోపిడీకి, పీడనకు వ్యతిరేకంగా అసమానతలు లేని సమాజం కోసం ఉద్యమిస్తామని సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు రాష్ట్ర నాలుగో మహాసభల ప్రారంభ సూచికగా జిల్లా పార్టీ కార్యాలయం ముకుందలాల్ మిశ్రా భవన్ ఎదురుగా పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మూడు సంవత్సరాల కాలంలో పార్టీ నిర్వహించిన ఆందోళన, పోరాటాలు సాధించిన విజయాలను సమీక్షించుకొని ఈ మహాసభల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి రాబోయే మూడు సంవత్సరాల కాలానికి ఉద్యమ కార్యాచరణ రూపొందించుకుంటామన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రయివేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు నిరంతరం ఉద్యమించిన చరిత్ర సీపీఐ(ఎం)దే అని అన్నారు. కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన, మహిళల హక్కుల సాధనకు అను నిత్యం పోరాటం చేస్తున్నామన్నారు. శాస్త్రీయ భావజాలాన్ని పెంపొందిస్తూనే మతోన్మాద భావాజాలానికి వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేస్తున్నామన్నారు. దేశభక్తి ముసుగులో ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్ సంస్థలకు ధారదత్తం చేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి రావడం కోసం అడ్డగోలు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన ప్రతి సందర్భంలో హామీల అమలు కోసం ప్రభుత్వాల మెడలు వంచి విజయాలు సాధించామని అన్నారు. సంగారెడ్డి పట్టణంలో జనవరి 25 నుంచి 28 వరకు నాలుగు రోజుల పాటు మహాసభలు జరుగుతాయన్నారు. రానున్నది పూర్తిగా పోరాట కాలమని, భవిష్యత్తు ప్రజా ఉద్యమాలకు ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వర్ణ వెంకటరెడ్డి, గిట్ల ముకుంద రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎడ్ల రమేష్, జి.రాజేశం, డి.నరేష్ పటేల్, కోనేటి నాగరాణి, నాయకులు తిప్పారపు సురేష్, జీ.తిరుపతి, గజ్జల శ్రీకాంత్, వినయ్, ఇసాక్, రోహిత్ పాల్గొన్నారు.

బస్‌డిపో ఎదుట సీపీఐ ధర్నా



నవతెలంగాణ - కరీంనగర్

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆర్టీసీని నిర్వీర్యం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, అలా చేస్తే సీపీఐ చూస్తూ ఊరుకోదని ఆ పార్టీ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ పేరుతో కరీంనగర్ టు డిపోను జేబీఎం సంస్థకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం కరీంనగర్ టు డిపో ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రి వెంకటస్వామి మాట్లాడారు. ఆర్టీసీని నిర్వీర్యం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతున్నట్లుగా ఉందని, డిపోలను ప్రయివేట్ సంస్థలకు అప్పగించి వాటి నిర్వహణ బాధ్యతలను మెగా, జేబీఎం సంస్థలకు ఇప్పటికే అప్పచెప్పిందని వాటిని తక్షణమే వెనక్కి తీసుకొని ఆర్టీసీ సంస్థ పరిధిలోనే నిర్వహణ జరగాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, టేకుమల్ల సమ్మయ్య పాల్గొన్నారు.

ఉల్లంపల్లికి బస్సొచ్చింది..

- 25 ఏళ్ల తర్వాత పునరుద్ధరణ

- బంటుపల్లి, మడద, శ్రీరాములపల్లి గ్రామలకూ మేలు



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న కంది తిరుపతిరెడ్డి

నవతెలంగాణ - చిగురుమామిడి

సుమారు పాతికేళ్ల తర్వాత చిగురుమామిడి మండలంలోని ఉల్లంపల్లికి ఆర్టీసీ బస్సు వచ్చింది. గతంలో హుస్నాబాద్ నుంచి కరీంనగర్ వెళ్లే బస్సును ఈ గ్రామం మీదుగా నడిపించిన ఆర్టీసీ.. రోడ్డు సౌకర్యం సరిగాలేకనో.. డీజిల్ ఆటోల రాకతో బస్సును రద్దు చేసింది. అప్పటి నుంచి ఉల్లంపల్లితోపాటు సమీపంలోని బంటుపల్లి, మడద, శ్రీరాములపల్లి గ్రామస్తులు అటు హుస్నాబాద్, ఇటు కరీంనగర్ వెళ్లేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యార్థులు చదువుకునేందుకు.. ఉద్యోగులు కార్యాలయాలకు వెళ్లాలన్నా.. ప్రైవేటు వాహనాను ఆశ్రయించేవారు. గ్రామ ప్రజలు, స్థానిక ప్రజా ప్రతినిధులు హుస్నాబాద్ ఎమ్మెల్యే, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సంప్రదించారు. వారి సమస్య తెలుసుకున్న మంత్రి ఉల్లంపల్లి గ్రామానికి బస్సును పునరుద్ధరించారు. శనివారం గ్రామానికి బస్సు రావడంతో గ్రామస్తుల 25 ఏళ్ల కల నెరవేరినట్లయ్యింది. బస్సు ఉదయం 8.30గంటలకు, మధ్యాహ్నం రెండు గంటలకు, సాయంత్రం ఐదున్నర గంటలకు రానుంది. గ్రామానికి బస్సు రావడంతో గ్రామస్తులు పండుగను తలపించేలా వేడుక చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కానవేని శివకుమార్ అధ్వర్యంలో బస్సుకు కొబ్బరి ఆకులతో తోరణాలు కట్టి, పూలమాలలతో అలంకరించి స్వాగతం పలికారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ బంక చందు హాజరయ్యారు. పచ్చ జెండా ఊపి బస్సును ప్రారంభించారు. బస్సు సౌకర్యం కల్పించిన మంత్రి పొన్న ప్రభాకర్‌గౌడ్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హుస్నాబాద్ నియోజకవర్గం స్పోర్ట్స్ ఇన్చార్జి వెన్న రాజు, మాజీ ఎంపీటీసీ రాగుల రమేష్, నాయకులు రణధీర్‌గౌడ్, కొత్తపల్లి సత్యనారాయణ, సుదగోని రాజుగౌడ్, కానవేణి మల్లయ్య, కానవేణి ఉదయ, కొండ కాశీవిశ్వనాథం, కొండ జగన్, కోలా చంద్రమోహన్, జేరిపోతుల రాజు, డ్రైవర్ వెంకట్రాజం పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని ప్రజలే తరిమి కొడుతున్నారు

కాంగ్రెస్ ఇన్‌చార్జి ప్రణవ్‌బాబు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్‌బాబు

నవతెలంగాణ - జమ్మికుంట

హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని ప్రజలే తరిమి కొడుతున్నారని, కాంగ్రెస్ కార్యకర్తలు జోలికి వస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్‌బాబు అన్నారు. శనివారం పట్టణంలోని వినాయక గార్డెన్‌లో జమ్మికుంట మున్సిపల్ కౌన్సిలర్ల పదవీకాలం ముగియడంతో వారందరినీ శాలువతో ప్రణవ్ బాబు ఘనంగా సన్మానించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్లు ఆత్మీయ బంధు రైతు భరోసా రేషన్ కార్డులు అర్హులైన వారందరికీ అందుతాయని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. ప్రజలకు మంచి చేస్తా అంటే కౌశిక్‌రెడ్డి ఆగం అవుతున్నాడని ఎద్దేవ చేశారు. హుజురాబాద్ నియోజకవర్గంలో 3500 ఇండ్లు మంజూరు అయ్యాయని తెలిపారు. రైతు రుణమాఫీ మార్చిలోగా తప్పనిసరి చేస్తామన్నారు. 10కోట్ల రూపాయలతో నియోజకవర్గ అభివృద్ధి జరుగుతుందన్నారు. జమ్మికుంట మార్కెట్ చైర్‌పర్సన్‌గా పుల్లూరి స్వప్న త్వరలో ప్రమాణస్వీకారం చేస్తారన్నారు. ఇల్లందకుంట, దుబ్బ మల్లన్న ఆలయాల కమిటీల ప్రమాణ స్వీకారం కూడా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పొనగంటి మల్లయ్య, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్నకోటి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పూదరి రేణుకశివకుమార్, పుల్లూరి సదానందం, సారంగంపాణి పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలి

- ఇండియన్ సైకియాట్రిక్ సమ్మిట్‌లో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

నవతెలంగాణ - మానకొండూర్

మానసిక ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన పెంపొందించినప్పుడే మార్పు సాధ్యమని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో నిర్వహించిన ఇండియన్ సైకియాట్రిక్ సమ్మిట్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మనిషి మానసిక స్థితిపై ఒత్తిళ్లు తీవ్ర ప్రభావం చూపిస్తాయని, ప్రస్తుత జీవన శైలిలో మానసిక ఒత్తిడి, డిప్రెషన్ వంటి సమస్యలు నిత్యకృత్యంగా మారాయన్నారు. సమాజంలో రోజు రోజుకు తీవ్రతరమవుతున్న మానసిక సమస్యలపైన, మానసిక ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మానసిక ఆరోగ్య రంగంలో కొత్త ఆవిష్కరణలకు, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ఇలాంటి సమ్మిట్‌లు దోహదపడాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్య నిపుణులు, సైకియాట్రిస్టులు పాల్గొన్నారు.

మేయర్‌వి వెన్నుపోటు రాజకీయాలు..

అధికారం కోసమే బీజేపీ కండువా కప్పుకున్నాడు

గంగులపై ఆరోపణలు చేస్తే ఊరుకోబోం

బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్



నవతెలంగాణ - కరీంనగర్

కరీంనగర్ మేయర్ సునీల్‌రావు కేవలం అధికారయావతోనే బీజేపీ కండువా కప్పుకున్నారని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆరోపించారు. శనివారం నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి బీఆర్ఎస్ కార్పొరేటర్లతో కలిసి ఆయన మాట్లాడారు. అవినీతి తిమింగలం సునీల్‌రావు బీజేపీలో చేరడంతో పార్టీకి పట్టిన శని వదిలిపోయిందని అన్నారు. గతంలో జగపతిరావు, ఎమ్మెస్సార్, జీవన్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌ను ఇప్పుడు కేసీఆర్, వినోద్ కుమార్, గంగుల కమలాకర్‌కు నమ్మకద్రోహం చేశారని, త్వరలోనే బండి సంజయ్‌ను కూడా వెన్నుపోటు పొడుస్తాడని ఆరోపించారు. మచ్చలేని నాయకుడు గంగుల కమలాకర్ అని.. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారని తమ నాయకుడుపై ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. మేయర్‌గా కాంట్రాక్టర్లు, కన్స్ట్రక్షన్ కంపెనీలు, రియల్ ఎస్టేట్ వారివద్ద కమీషన్లు దండుకున్నారని ఆరోపించారు. గంగుల కమలాకర్‌పై చేసిన ఆరోపణలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ కార్పొరేటర్ రాజేందర్‌రావు మాట్లాడుతూ మేయర్ పదవి గంగుల కమలాకర్ సహకారంతో దొరికిందని, పార్టీని నమ్మి అడుగు పెట్టిన వారిని మోసం చేయడమే ఆయనకు చరిత్ర అన్నారు. సునీల్‌రావు అవినీతి గురించి మాట్లాడడం హాస్యాస్పదమని అన్నారు. బీఆర్ఎస్ కార్పొరేటర్ గందే మాధవి మాట్లాడుతూ సునీల్‌రావు ఐదు సంవత్సరాలుగా మోసగాడిగా మాతో ఉన్నాడన్నారు. బండి సంజయ్‌ని తిట్టిన ఈయన ఇప్పుడు ఆయన పంచన చేరడం ఘోరం అన్నారు. కార్పొరేటర్ దిండిగాల మహేష్ మాట్లాడుతు. సునీల్‌రావు పార్టీ మారితే కనీసం నలుగురు కార్పొరేటర్లు కూడా అతనితో వెళ్లలేదన్నారు. బీజేపీకి వెళ్లి గంగుల కమలాకర్‌పై బురదజల్లే ప్రయత్నం చేసి మరింత దిగజారాడ అన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు బోనాల శ్రీకాంత్, జంగిలి సాగర్, ఎడ్ల సరిత అశోక్, గందె మాధవిమహేష్, కోలమాలతి సంపత్, కచ్చు రవి, ఐలేందర్ యాదవ్, కో ఆప్షన్ నెంబర్, మాజీ కార్పొరేటర్ ఏవి రమణ, గడ్డం శాంత్‌రెడ్డి, జల్లోజు శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు, డివిజన్ ఇన్‌చార్జులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాగేశ్వరిలో ఘనంగా ప్రెషర్స్ డే వేడుకలు



నవతెలంగాణ - తిమ్మాపూర్

మండలంలోని వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లోని సమావేశ మందిరంలో ఎంసీఏ కోర్సులో నూతనంగా చేరిన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఇగ్నైట్-2025 పేరుతో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు ఈ కార్యక్రమానికి కళాశాల జనరల్ సెక్రెటరీ డాక్టర్ గంద్ర శ్రీనివాస్ రెడ్డి హాజరై మాట్లాడారు ఎంసీఏ విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకొని ఉద్యోగ అవకాశాలు పొందాలని సూచించారు. ఎంపీటీఈఎల్ ద్వారా వివిధ కోర్సులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, ఎంసీఏ విభాగాధిపతి డాక్టర్ బాపూజీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

నోవెల్ల-2025..

వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు నోవెల్ల-2025 పేరుతో ప్రథమ సంవత్సర విద్యార్థులకు ప్రిన్సెస్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల జనరల్ సెక్రెటరీ డాక్టర్ ఘనర శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు క్రీడలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రెటరీ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్లు ప్రకాష్ రెడ్డి, వినోద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్. శ్రీనివాస్, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ హరి ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) మహాసభలను విజయవంతం చేయాలి

జిల్లా కమిటీ సభ్యురాలు కోనేటి నాగమణి

నవతెలంగాణ - కరీంనగర్ : సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు కోనేటి నాగమణి అన్నారు. కరీంనగర్‌లోని కోతిరాంపూర్‌లో గల పోచమ్మవాడలో మహిళా శాఖ ఆధ్వర్యంలో సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా పార్టీ జెండాను కోనేటి నాగమణి ఆవిష్కరించారు. ఈ.రజిత, సిహెచ్.రోజా, పి.దేవేంద్ర, అరుణ, ఎం.శాంతవ్వ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం




నవతెలంగాణ - చొప్పదండి

చొప్పదండి పట్టణంలోని పలు వార్డులలో సీసీరోడ్లు, డ్రైనేజ్ పనులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శంకుస్థాపన చేశారు. అంతకుముందు పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ గుర్రం నీరజ అధ్యక్షతన చొప్పదండి మున్సిపల్ మొదటి పాలకవర్గ సభ్యుల పదవి విరమణ సందర్భంగా ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ కొత్తూరి మహేష్, వైస్‌చైర్మన్ మునిగాల రాజేందర్, కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాసరెడ్డి, పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, ముద్దసాని రంగన్న, మార్కెట్ డైరెక్టర్ జక్కుల అనిల్ కుమార్, ఆకుల సురేష్, కట్టెకోల లక్ష్మణ్ , రావల్లి ఐలయ్య, గుంటి స్వరూప, సిబ్బంది పాల్గొన్నారు.

బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల సమ్మయ్య



నవతెలంగాణ - గంగాధర

ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న బీడీ కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల సమ్మయ్య డిమాండ్ చేశారు. గంగాధర మండల కేంద్రంలో శనివారం బీడీ కార్మికులతో కలిసి బీడీ కార్మికుల సమస్యలపై ఈ నెల 30, 31 వ తేదీల్లో జరిగే ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. టేకుమల సమ్మయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని బీడీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో ఈ నెల 30, 31 తేదీల్లో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. బీడీ కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్, జిల్లా నాయకుడు పవన్, బీడీ సంఘం జిల్లా కన్వీనర్ వేముల శంకరమ్మ, మహిళా బీడీ కార్మిక నాయకురాళ్లు కట్ల వసంత, శవంతులు లక్ష్మి , పడాల రేణుక, తాళ్ల అనిత, బల్లాల లక్ష్మి , జంగం లక్ష్మి, అల్లం పుష్ప, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు,పెన్నులు పంపిణీ

నవతెలంగాణ - వీణవంక : వీణవంక మండలం బొంతుపల్లి గ్రామానికి చెందిన కీ.శేలు జున్నూతుల కౌసల్య స్మారకార్థం భర్త జున్నూతుల నారాయణరెడ్డి, వారి కుమారుడు జున్నూతుల రాఘవరెడ్డి శనివారం ఎలుబాక, గంగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వారి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

ఉపన్యాస, వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ - చొప్పదండి : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఓటర్ డే సందర్భంగా ప్రిన్సిపాల్ శరత్‌బాబు ఓటు ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఉపన్యాసం, వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, బహుమతులను అందజేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ సబితా రాణి, వైస్ ప్రిన్సిపాల్ చంద్ర ప్రకాష్ పాల్గొన్నారు.

అంబారిపేట్ పార్క్‌ను సందర్శించిన ఎమ్మెల్సీ

నవతెలంగాణ- జగిత్యాల



జగిత్యాల రూరల్ మండలం అంబారిపేట పార్క్‌ను పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి అటవీ శాఖ జగిత్యాల రేంజ్ ఆఫీసర్ పద్మారావు స్వాగతం పలికారు. నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్సీ పార్కులో తిరిగి పలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రధానంగా అంబారి పేట్ రైతులకు ఏలాంటి ఆంక్షలు పెట్టొద్దన్నారు.అంబారి పేట్ రైతుల పొలాలకు దారి ఇదేనని చెబుతూ రైతులు పొలం దగ్గరికి వెళ్తే టికెట్ లాంటి ఆంక్షలు విధించరాదన్నారు.అలాగే పార్కులో ఎంట్రీ, ఎగ్జిట్ రిజిస్టర్ లో ఆధారాలు గల ప్రూఫ్ లాంటి జాగ్రత్తలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే పార్కులో సెక్యూరిటీ ఉంటుందని జీవన్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్, బీట్ ఆఫీసర్ శ్రీనివాస్,కౌన్సిలర్లు దుర్గయ్య, హనుమండ్ల జయశ్రీ, నక్క జీవన్,ఆసియా సుల్తానా, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కేపీఎల్‌లో జోరుగా దోసిలి ఫౌండేషన్ జట్టు

నవతెలంగాణ-మేడిపల్లి



కోరుట్లలో జరుగుతున్న ప్రీమియర్ లీగ్‌లో దోసిలి ఫౌండేషన్ జట్టు (డీఎఫ్ లయన్స్ మేడిపల్లి) ప్రతిభ కనబర్చారు. టోర్నమెంట్‌లో వరుసగా రెండవ విజయంతో గ్రూప్‌లో టేబుల్ టాపర్‌గా నిలిచింది. ఈ మ్యాచ్‌లో ఆల్ రౌండ్ ప్రతిభతో జట్టుగా సమిష్టి విజయం సాధించారు. మాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా శ్రీహరి నిలిచాడు. జట్టు బౌలర్‌లు మహీవాస్, శ్రీహరి, తిరుపతి , వంశీ, శివ కుమార్ లు సమిష్టిగా రాణించి ఛేషింగ్ టీం ను నిలువరించారు. జట్టులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆటగాళ్ల శ్రీహరి, మహీవస్, తిరుపతి, ప్రవీణ్‌లకు జట్టు స్పాన్సర్‌లు టీ పీసీసీ గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేష్‌రెడ్డి , మేడిపల్లి మాజీ సర్పంచ్ బొంగోని రాజా గౌడ్, మేడిపల్లి కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, ఏఎంసి చైర్మన్ మాదం వినోద్ యాదవ్, మన్నెగూడెం మాజీ సర్పంచ్ తేలు నరేష్, వెంకట్రావు పేట్ మాజీ సర్పంచ్ అంగడి ఆనంద్ నగదు బహుమతులు అందచేశారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-మేడిపల్లి



భీమారం మండలం రాజలింగంపేట్ గ్రామానికి చెందిన గుగ్గిళ్ళ గంగారం(52) తాండ్రియాల్ ఎక్స్ రోడ్డు వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, టీపీసీసీ గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేష్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని నేరుగా పరామర్శించారు. వారి వెంట నాయకులు తేలు నరేష్, నీరటి మల్లేశం, యూత్ నాయకులు చెక్కపల్లి సంజీవ్ ఉన్నారు.

నిరుపయోగంగా అంబులెన్స్

నవతెలంగాణ-మేడిపల్లి



ఉమ్మడి మేడిపల్లి మండలంలోని మేడిపల్లి, భీమారం, గోవిందారం, మన్నెగూడెం, పోరుమళ్ళ గ్రామాలలో వైద్య సేవలు అందించడానికి 24 గంటలు అత్యవసర పరిస్థితుల్లో రోగులను గమ్యాన్ని చేరవేర్చడానికి ప్రతిమ ఫౌండేషన్ కరీంనగర్ వారి సౌజన్యంతో ఉచిత సేవ అంబులెన్స్‌లను ప్రముఖ రేడియాలజిస్ట్ డాక్టర్ చెన్నమనేని వికాస్‌రావు అందించారు. ప్రస్తుతం అంబులెన్స్ చెరువు సమీపంలో నిరుపయోగంగా పడి ఉంది.

పోషించని కొడుకులకు, కూతుర్లకు కౌన్సిలింగ్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

కన్న తల్లిదండ్రులను పోషించక నిరాధరిస్తున్న కొడుకులు, కూతుర్లకు, వారి కోడళ్లకు తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో అసోసి యేషన్ ప్రతినిధులు కౌన్సిలింగ్ నిర్వహించారు. తాము తమ తల్లిదండ్రులను పోషిస్తూ, బాగోగులు చేసుకోవడానికి సమ్మతించి ఒప్పంద పత్రం రాసిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ కార్యాలయంలో వృద్ధ తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు కొడుకులు, కూతుర్లకు, వారి కోడళ్లకు అవగాహన కల్పించారు.

కొండగట్టు ఆలయ కార్యనిర్వాహణ అధికారిగా కృష్ణప్రసాద్

నవతెలంగాణ- మల్యాల



మండలంలోని కొండగట్టు ఆలయ కార్యనిర్వాహణ అధికారిగా దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉప కమిషనర్ సర్వీసెస్ కృష్ణప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు.

వర్షకొండ పాఠశాలలో క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం



మండలంలోని వర్షకొండ మండల ప్రాథమిక పాఠశాలలో 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు పూర్వ విద్యార్థి అయిన టువంటి సల్వాల శంకర్ తన సొంత ఖర్చులతో క్యాలెండర్‌ను అందజేశారు. ప్రధానోపాధ్యా యులు అచ్చ విజయ భాస్కర్ క్యాలెండర్ దాతశంకర్‌ను శాల్వాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రమేష్, కృష్ణం రాజు, నవత, భారతిరాణి పాల్గొన్నారు.

మాజీ జడ్పీటీసీ అంతిమయాత్రలో పాల్గొన్న ప్రభుత్వ విప్

నవతెలంగాణ-పెగడపల్లి



మండల కేంద్రానికి చెందిన మాజీ జడ్పీటీసీ గజ్జల వసంత శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. శనివారం పెగడపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన మాజీ జడ్పీటీసీ సంత అంతిమ యాత్రలో ప్రజాసంఘాల నాయకులతో కలిసి ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరై కుటుంబ సభ్యులకు పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, వర్ణ నిర్మూలన జాతీయ అధ్యక్షుడు ఆమె భర్త గజ్జల స్వామి, ప్రజా సంఘాలు జేఏసీ చైర్మన్ గజ్జల కాంతం, బొల్లి స్వామి, జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోసం ఆర్డీఓకి వినతి

దప్పులతో ఊరేగింపు నిర్వహించిన మాదిగలు

నవతెలంగాణ-మెట్‌పల్లి

దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు మేరకు వర్గీకరణ చేపట్టాలని కోరుతూ మెట్‌పల్లి డివిజన్ మాదిగ దండోరా సంఘం ఆధ్వర్యంలో డప్పులతో ఊరేగింపు నిర్వహించి ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ కోసం వెలువరించిన తీర్పు ఉత్తర్వులు ప్రకారం ఈ విద్యా సంవత్సరం నుండి రాష్ట్రంలోని అన్ని శాఖలలో రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ వర్గీకరణ సంపూర్ణంగా పూర్తి చేసి దళిత జాతిలో వెనుకబడిన మాదిగ, మాదిగ ఉప కులాలకు న్యాయం చేయలన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంఘాల అధ్యక్షులు ఉల్లెందుల గంగారం, శశికుమార్, బర్ల రమేష్, పాలెం రాజయ్య , బర్ల లక్ష్మణ్, లింగంపల్లి సంజీవ్, బర్ల దివాకర్, బర్ల రవి, సాకలి సందీప్, లంక శ్రీకాంత్, లంక జనార్ధన్, సురిగిరాల చిన్న రాజం, హనుమంతు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడి జన్మదిన వేడుకల్లో అడ్లూరి

నవతెలంగాణ-ఎండపల్లి



కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి మండల అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఎండపల్లి మండలంలోని రాజరంపల్లి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ప్రభుత్వ విప్ అడ్లూరు లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మల రమణారెడ్డి ,మారపల్లి రవీందర్ రెడ్డి, మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో ప్రత్యేక అధికారుల పాలన?

- నేటితో ముగియనున్న పాలకవర్గాల పదవీకాలం
- ఐదేళ్ల అభివృద్ధిపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు
- చాలా సమస్యలకు పరిష్కారం లభించని వైనం !

నవతెలంగాణ-జగిత్యాలటౌన్



పురపాలికల పగ్గాలు ఇక ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లనున్నాయి. మున్సిపల్ పాలకవర్గాల పదవీ కాలం నేటి (26 జనవరి)తో ముగియనుండగా ఆ దిశగా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. జగిత్యాల జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్ పల్లిలతో పాటు నూతనంగా ఏర్పడిన రాయికల్, ధర్మపురి 5 పురపాలికలకు 2020 జనవరిలో ఎన్నికలు జరిగాయి. అదే నెల 27న పాలకవర్గాలు కొలువు దీరాయి. ఈ నెల26న పురపాలక సభ్యుల పదవీకాలం జెండా వందనంతో ముగుస్తుండగా ఇప్పట్లో ఎన్నికలు జరిగే అవకాశం లేదని స్పష్టమవుతోంది. ఇప్పటికే గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌ల సభ్యుల పదవీకాలం ముగిసి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్న విషయం తెలిసిందే.

పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరిగిన తర్వాతే మున్సిపాలిటీలకు నిర్వహిస్తారు. దీనికి కనీసం ఆరు నెలల సమయం పట్టే అవకాశ ముండటంతో అప్పటి వరకు పురల్లో ప్రత్యేకాధికారుల పాలన తప్పనిసరి కానుంది. రాష్ట్రంలో 2019 జులై 2న పురపాలిక పాలకవర్గాల పదవీ కాలం ముగిసినా.. అప్పటి ప్రభుత్వం కొత్త మున్సిపల్ చట్టం తీసుకురావడం, ఓటర్ల గణన, వార్డుల విభజన, రిజర్వేషన్ల అమలు ప్రక్రియ పూర్తి చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించింది. అప్పుడు కూడా ప్రత్యేకాధికారులను నియమించి ఆరు నెలల పాటు పాలన కొనసాగించింది.

అయిదేళ్ల పాలన ఇలా..

జిల్లాలోని మున్సిపాలిటీల్లో అన్ని మున్సిపాలిటీలను బీఆర్ఎస్ కైవసం చేసుకున్నప్పటికీ ఆ అయిదేళ్ల పాలనలో చెప్పుకోదగ్గ ప్రగతి జరగలేదనే స్పష్టం అవుతుంది. 2020లో కరోనా కారణంగా ఏడాదిన్నర కాలంలో అభివృద్ధి నిలిచి పోయింది. అనంతరం పురపాలికల్లో సమీకృత భవనాలు, డంపింగ్ యార్డులు, మురుగు కాలువలు, సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన పూర్తి స్థాయిలో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులు రాకపోవడంతో అసంపూర్తిగానే మిగిలాయి.

పట్టణ ప్రగతి కింద ప్రతినెల నిధులు రావడంతో త్వరితగతిన బిల్లులు విడుదలవుతాయని భావించి కౌన్సిలర్లు గుత్తేదారులుగా అవతారమెత్తి పనులు చేశారు. మరికొందరు బినామీలతో, చైర్మన్లు కూడా బినామీల పేరిట పనులు చేశారు. 2023 డిసెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా.. పట్టణ ప్రగతి నిధులు జాడ లేదు. ఏడాది నుంచి పనులు ఎక్కడిక్కడే నిలిచిపోయాయి. విలీన గ్రామాలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదు. ఫలితంగా బిల్లుల చెల్లింపులు నిలిచిపోయి పనులు దక్కించుకున్న గుత్తేదారులు కొన్ని చోట్ల చేతు లెత్తేశారు. టెండర్లు పిలిచినా ముందుకు రావడం లేదు. ప్రజా ప్రతినిధులు బిల్లుల కోసం అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో అయోమయంలో పడ్డారు.

చరిత్ర పుటల్లోకి జగిత్యాల మున్సిపాలిటీ..?

ఎన్నో దశాబ్దాల చరిత్ర కలిగిన జగిత్యాల మున్సిపాలిటీ గత ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్ర స్థాయిలో అభాసు పాలు అయిందని చెప్పాలి. జగిత్యాల మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి దాదాపుగా ఐదు సంవత్సరాల క్రితం వరకు సుమారు మున్సిపాలిటీ చైర్మన్/ చైర్‌పర్సన్‌గా ఐదేళ్లు ఒక్కరే కొనసాగగా గత పాలకవర్గంలో ఇద్దరు మహిళలు చైర్ పర్సన్‌లుగా కొనసాగారు. సుమారు సంవత్సర కాలం పాటు వైస్ చైర్మన్ ఇన్చార్జి చైర్మన్‌గా కొనసాగడం గమనార్హం. వీరిలో మొదటగా మున్సిపల్ చైర్ పర్సన్ పదవి బాధ్యతలు చేపట్టిన మహిళ బీఆర్ఎస్‌కు చెందినవారు కాగా వివిధ కారణాలతో ఆమె రాజీనామా చేసి ఇతర పార్టీలోకి వెళ్లారు. అనంతరం సుమారు సంవత్సర కాలం పాటు వైస్ చైర్మన్‌నే ఇన్‌చార్జి చైర్మన్‌గా కొనసాగించారు. జగిత్యాల మున్సిపాలిటీలో 48 మంది కౌన్సిలర్లు ఉండగా కొందరు చైర్మన్ పదవి కోసం తీవ్రంగానే ప్రయత్నించి విఫలమయ్యారని చెప్పాలి. చివరగా కొన్ని నెలల క్రితం బీఆర్ఎస్‌కు చెందిన మహిళా కౌన్సిలర్ ఇతర పార్టీ కౌన్సిలర్ల మద్దతుతో విప్‌ను ధిక్కరించి చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ అనుసంధానంగా కొనసాగారు. ఈ ఐదేళ్ల కాలంలో మున్సిపల్ కమిషనర్‌గా కూడా పలువురు పనిచేయడం చరిత్ర పుటల్లో లిఖించదగినదనే చెప్పవచ్చు. అధికార పక్షానికి చెందిన వారికి సహకరించడం లేదనే కారణంతో పలువురు మున్సిపల్ కమిషనర్‌లపై ఫిర్యాదు చేయడం ఆ పాలకవర్గానికలకే దక్కిందని చెప్పవచ్చు.

మధ్యలో కొంతమంది పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించినా కూడా అక్కడున్న రాజకీయ ఒత్తిడిల నేపథ్యంలో వారు కూడా విధుల నుంచి తప్పుకున్నారని మున్సిపాలిటీ ప్రజలు చర్చిం చుకుంటున్నారు. ఏది ఏమైనా ఈ ఐదు సంవత్సరాల కాలంలో పట్టణంలో ఎంత మేరకు అభివృద్ధి జరిగిందని పరిశీలించిన, గత మున్సిపల్ ఎన్నికల్లో నాయకులు ఇచ్చిన హామీలు ఏ మేరకు అమలయ్యాయని చూసిన అవన్నీ పూర్తి కాలేదనేది నగ్నసత్యం. ఎన్నో హామీలతో అధికారంలోకి వచ్చిన అప్పటి బీఆర్ఎస్ చాలా హామీలను నెరవేర్చలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎన్నో సంవత్సరాల నుండి యావర్ రోడ్ విస్తరణ హామీగానే మిగిలిపోయింది తప్పితే ఆ హామీ నెరవేరలేదు. ఇలా మున్సిపాలిటీలో చాలావరకు హామీలు హామీలుగానే మిగిలిపోయాయి. భవిష్యత్తులో ఎంతమంది కౌన్సిలర్లు మళ్ళీ ఎన్నికల్లో గెలుపొందుతారనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.

ప్రలోభాలకు లోను కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలి

మున్సిపల్ చైర్మన్ మోర హనుమాండ్లు

నవతెలంగాణ-రాయికల్





పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఎన్నికల విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ ఎం.ఏ ఖయ్యూం, మున్సిపల్ చైర్మన్ మోర హనుమండ్లు హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో ఓటర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీపతి రాఘవులు, కౌన్సిలర్ మ్యాకల అనురాధ,ఉపాధ్యాయులు పొన్నం రమేష్, రవీందర్, మల్లేశం, సత్యనారాయణ, గంగ జమున, నాగరాజు, తిరుమల, గంగాధర్, వనిత, గంగాధర్, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని డబ్బా గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణంలో పంచాయతీ కార్యదర్శి రవళి ఆధ్వర్యంలో గ్రామస్తులులతో ప్రతిజ్ఞ చేశారు. ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో డబ్బా కాంగ్రెస్ యువ నాయకులు దేశెట్టి జీవన్, మాజీ వీడీసీ చైర్మన్ బైన నడిపి మల్లయ్య, అంగన్వాడీ కార్యకర్త సంజీవరాణి, భూస రమేష్, డాక్టర్ శ్రీధర్, రాడే మల్లేష్, జగ్గన్న శంకర్ గంగాధర్, భూమన్న, కారోబార్ శీను పాల్గొన్నారు.

వెల్గటూర్: మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో జిల్లా పరిషత్ హై స్కూల్, శ్రీ చైతన్య, బ్రిలియంట్ స్కూల్ విద్యార్థులు పాల్గొని ఓటు హక్కు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బోనగిరి ప్రభాకర్, డిప్యూటీ తహసీల్దార్, కట్టా గంగాధర్, ఆర్‌ఐలు రాజేశ్వరి, రాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జగిత్యాల: స్థానిక ఎస్ఎస్‌వి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఓటు హక్కు వినియోగంపై ఓటర్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్వి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గోపు మునిందర్‌రెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సత్యప్రసాద్ సూచనల మేరకు "స్వీప్" ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీలో శనివారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. నర్సింగ్ కళాశాలలో రంగోలి ముగ్గుల పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత పాల్గొని గెలుపొందిన విద్యార్థినులకు సర్టిఫికేట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వీప్ జిల్లా నోడల్ అధికారి దేవేందర్ రెడ్డి, సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ ఎండి. హకీమ్, ఈడిఎం మమత మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శిల్ప, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జి. లిల్లిమేరీ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ



నవతెలంగాణ-జగిత్యాలటౌన్

పట్టణంలోని 41, 44, 9వ వార్డులలో టీయుటీఎఫ్ ఐడిసి నిధులు రూ.90 లక్షలతో అభివద్ధి పనులకు ఆయా వార్డుల్లో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ శనివారం భూమిపూజ చేశారు. అనంతరం 9వ వార్డులో టీటీడీ ద్వారా మంజూరైన రూ.10 లక్షల నిధులతో భజన మందిరం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, కమిషనర్ చిరంజీవి, కౌన్సిలర్ లు కప్పల శ్రీకాంత్, వోద్ది శ్రీలత రామ్మోహన్ రావు, రామాలయం మాజీ చైర్మెన్ నరేష్ పాల్గొన్నారు.

పూలే దంపతుల సేవలు చిరస్మరణీయం

అంటరాని తనం, బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధన, మహిళోద్ధరణ, విద్యను అందిం చేందుకు పూలే దంపతులు కృషి చిరస్మరణీయమని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పూలే పార్కులో మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే దంపతుల విగ్రహాలను ఎమ్మెల్యే ఆవిష్క రించారు. ఈ కార్యక్రమంలో టీబీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హరి అశోక్, మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ వొద్ది శ్రీలత, మాజీ మున్సిపల్ చైర్మెన గిరి నాగ భూషణం పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పీఆర్టీయూ వినతి

ఉపాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాన్ని టీచర్స్ భవన్ ఆవరణలో ఏర్పాటు చేయాలని పీఆర్టీయూ టీఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోయిని పెల్లి ఆనంద్ రావు, యాల్ల అమర్నాథ్‌రెడ్డి ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు.



గ్రామ సభలతో కాలయాపన

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

నవతెలంగాణ-జగిత్యాల

రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన కోసమే గ్రామ సభలు నిర్వహిస్తుందని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజాపాలన అని 6 గ్యారంటీలు అమలు చేస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం మాయ మాటలతో ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. జగిత్యాల రూరల్ మండలం కన్నపూర్ గ్రామంలో 60వేల లోపు ఉన్న రైతులకు రుణమాఫీ ఇంకా కాలేదని, ఇంకా చాలా గ్రామాల్లో రైతులు రుణమాఫీ కోసం నిరీక్షిస్తున్నారన్నారు. శుక్రవారం జరిగిన ఆత్మీయ సమావేశంలో బీఆర్ఎస్ బి ఫామ్ మీద గెలిచిన కౌన్సిలర్లు ఒక్కరు కూడా కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధి జరిగిందని చెప్పకపోవడం సిగ్గు చేటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గట్టు సతీష్, అల్లాల ఆనంద్‌రావు, వొళ్లెం మల్లేశం, తుమ్మ గంగాధర్,ఆయిల్నేని ఆనంద్‌రావు, మజాహిర్ రిజ్వాన్, వొళ్ళాల గంగాధర్, చింతల గంగాధర్, సాగి సత్యంరావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దావ వసంత సురేష్

ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపికైన సీఐ నిరంజన్‌రెడ్డి

నవతెలంగాణ - మెట్‌పల్లి



మెట్‌పల్లి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ విధులు నిర్వహిస్తున్న నిరంజన్‌రెడ్డిని కేంద్ర ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మక ఇండియన్ పోలీస్ మెడల్ అవార్డు వరించింది.1989 సంవత్సరంలో కానిస్టేబుల్‌గా జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో విధుల్లో చేరిన ఆయన, 1992లో హెడ్ కానిస్టేబుల్‌గా అగ్జిలరీ ప్రమోషన్ పొందారు. 1994లో ముఖ్యమంత్రి సేవ పథకంకు ఎంపికవగా, 2000లో ఏఎస్ఐగా పదోన్నతి పొందారు. 2012లో ఎస్ఐగా పదోన్నతి పొందిన ఆయన అయిదు వేల మంది విద్యార్థులతో నవంబర్ 14న బాలల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం, 2014లో మెట్ పల్లి మండలం ఆత్మకూర్ గ్రామం మేఘ మెడికల్ క్యాంపు నిర్వహించారు. 2016లో కథలాపూర్ మండలంలో నకిలీ డాక్టర్ల అరెస్టు, అదే మండలం తాండ్రియల్ గ్రామానికి చెందిన జీవిత ఖైదీ పడి ముంబాయి జైలు నుండి తప్పించుకొని తిరుగుతున్న ఖైదీనీ పట్టుకొని మహారాష్ట్ర పోలీసులకు అప్పగించిన కేసులో ముంబాయి డిజీపి నుండి రివార్డు అందుకున్నారు. 2023లో సీఐగా పదోన్నతి పొంది, 2025 ఇండియన్ పోలీస్ మెడల్‌కి ఎంపిక అయ్యారు. ముఖ్యమంత్రి సేవాపథకం, 54 క్యాస్ రివార్డులు, 49 జిఎస్‌ఈ లు,32 ప్రశంస పత్రాలను తన ఉద్యోగ నిర్వహణ కాలంలో అందుకొన్నారు. 2025 జనవరి 26కి ప్రతిష్టాత్మక ఇండియన్ పోలీస్ మెడల్ రావడం పట్ల పలువురు ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

గణతంత్ర వేడుకలపై సీఎస్ వీడియో కాన్ఫరెన్స్

నవతెలంగాణ- జగిత్యాల: ప్రతి మండలంలోని ఒక గ్రామంలో 4 పథకాల ప్రారంభ కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమార్ ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లోని సంచివాలయం నుంచి కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామ, వార్డు సభలను సమర్థవంతంగా నిర్వహించి నందుకు అధికారులకు ముందుగా అభినందనలు తెలిపారు. గణతంత్ర దినోత్సవం నుంచి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డుల జారీ పథకాలను లాంఛనంగా ప్రతి మండలంలోని ఒక గ్రామంలో ప్రారంభించాలని ఆదేశించారు. ప్రతి మండలంలో 250 నుంచి 400 వరకు ఇండ్లు ఉన్న గ్రామాలను స్థానిక ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ఈ గ్రామాలను ఎంపిక చేయాలని అన్నారు. ప్రజా పాలన ప్రారంభించే గ్రామాల జాబితా, గ్రామాలలో 4 పథకాల లబ్ధిదారుల వివరాలను నిర్దిత నమునాలలో పంపాలని కలెక్టర్లకు సిఎస్ సూచించారు. జనవరి 26న ఎంపిక చేసిన గ్రామాలలో మధ్యాహ్నం ఒంటి గంటకు 4 పథకాలను అధికారికంగా ప్రారంభించాలని అన్నారు ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి.ఎస్ లత గౌతమ్‌రెడ్డి జగిత్యాల కోరుట్ల మెట్‌పెల్లి, ఆర్డీవోలు, మధు సుధను, జీవాకర్‌రెడ్డి, శ్రీనివాస్, డిఆర్డిఓ, రఘు వరుణ్ పాల్గొన్నారు.

వెల్గటూర్ యువతి బండారి సాహితి ప్రతిభకు శభాష్



నవతెలంగాణ-వెల్గటూర్ :తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సేవల కమిషన్ (తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్) నిర్వహించిన సాధారణ నియామకాల్లో వెల్గటూర్ గ్రామానికి చెందిన బండారి సాహితి తన ప్రతిభతో అందరి మన్ననలు పొందింది. ఇటీవలే (గ్రూప్-4) పరీక్షలో ఉద్యోగం పొంది కింద స్థాయి సహాయకులు (జూనియర్ అసిస్టెంట్) నియామక పత్రం స్వీకరించిన సాహితి, నెల రోజులు గడవకముందే మరో అద్భుత విజయాన్ని సాధించింది.

పెద్దపల్లి జిల్లాలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా గ్రూప్ -4 ఉద్యోగ నియామక పత్రం అందుకున్న సాహితి, ఆ విజయాన్ని చిరస్మరణీయంగా మార్చుకుంది. ఇప్పుడు తెలంగాణ పబ్లిక్ సేవల కమిషన్ నిర్వహించిన నిర్మాణ ఇంజినీరింగ్ విభాగ పరీక్షలో కింద స్థాయి నిర్మాణ ఇంజనీరు (జూనియర్ సివిల్ ఇంజనీర్)గా ఎంపికై మరింత ప్రతిభ చాటుకుంది. బాసర భారతీయ సాంకేతిక సంస్థ (ఐఐటీ)లో నిర్మాణ ఇంజినీరింగ్ పూర్తి చేసిన సాహితి, తన కృషి, పట్టుదలతో మొదటి ప్రయత్నంలోనే సమూహం-4 ఉద్యోగం సాధించింది. తక్కువ సమయంలోనే మరో అవకాశాన్ని సొంతం చేసుకొని గ్రామస్తులు, కుటుంబ సభ్యులను గర్వపడేలా చేసింది. చిన్న వయసులోనే రెండు విజయాలు సాధించడం సాహితి కృషి, పట్టుదల, అంకితభావానికి నిదర్శనం.

సాహితి విజయం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు ఆనందంతో ఉప్పొంగి, ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నారు. యువతకు ఆదర్శంగా నిలుస్తున్న సాహితి, తన ప్రతిభతో తెలంగాణ గర్వకారణంగా మారింది. "కష్టానికి ఫలితం తప్పక ఉంటుంది" అనే విష యాన్ని సాహితి తన విజయాలతో నిరూపించింది.

మానవత్వం చాటుకున్న ఆటో డ్రైవర్

నవతెలంగాణ- జగిత్యాల: జగిత్యాల కొత్త బస్టాండ్‌లో ఆటో నడుపుతూ తమ వృత్తిని కొనసాగిస్తున్న సలీమ్ కిరాయి దొరకగా మెట్‌పల్లికి తిరిగి జగిత్యాల వస్తుండగా మెట్‌పల్లికి చెందిన పాటిగంటి దివ్య కోరుట్ల వెళ్లేందుకు ఆటో ఎక్కింది. కోరుట్లలో దిగే సమయంలో యువతి ఫోన్ ఆటోలో మర్చిపోయింది. సదరు ఆటో డ్రైవర్ జగిత్యాల చేరుకొని ఆటో క్లీన్ చేస్తుండగా ఫోన్ కనిపించడంతో వెంటనే జగిత్యాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. ట్రాఫిక్ పోలీసులు బాధితురాలిని పిలిపించి ఫోన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ, ఏఎస్ఐ, కానిస్టేబుల్, చింత సుదీర్, షకీల్ బాయ్, భాశెట్టి రమేష్,కిరణ్ సింగ్, మోసిన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి క్రీడా పోటీలు

నవతెలంగాణ- జగిత్యాల: పట్టణంలోని స్వామి వివేకానంద మినీ స్టేడియంలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ మీట్ శనివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా యూత్ ఆఫీసర్ రాంబాబు పాల్గొని, ఫైనల్స్ మ్యాచ్ ప్రారంభించారు. పోటీల అనంతరం గెలుపొందిన విజేతలుగా జిల్లా యూత్ ఆఫీసర్ రాంబాబు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లాస్థాయి మొదటి స్థానంలో వెల్గటూర్, రెండవ స్థానంలో మల్లన్నపేట్ నిలిచాయి. జిల్లాస్థాయి కబడ్డీ విభాగంలో బీర్పూర్ మొదటి స్థానంలో, పెగడపల్లి రెండో స్థానంలో నిలువగా మహిళల విభాగంలో కబడ్డీ మొదటి స్థానం తాటిపల్లి, రెండో స్థానం జగిత్యాల్, నిలిచాయి.

పేదల చదువుల కోసం పరితపించిన మహానుభావుడు వెంకటరామిరెడ్డి

నవతెలంగాణ - మెట్‌పల్లి: పట్టణంలోని మార్కెట్ కమిటీ ముందు ప్రధాన రహదారిపై రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మార్కెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి పాల్గొన్నారు. పేద ప్రజల చదువుల కోసం పరితపించిన మహానుభావుడు రాజా బహదూర్ వెంకటరామారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షులు కొప్పెర వెంకటరెడ్డి, అల్లూరి మహేందర్‌రెడ్డి, మారు సాయిరెడ్డి, కొమ్ముల రాజుపాల్‌రెడ్డి, డాక్టర్లు, న్యాయవాదులు, పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నవతెలంగాణ-ఎండపల్లి :రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన ఎండపల్లి మండలంలోని కొండాపూర్‌లో శనివారం జరిగింది. వెల్గటూరు ఎస్ఐ ఆర్. ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎండపల్లి మండల కేంద్రానికి చెందిన సూర ఉదయ్ కిరణ్ (24) ఈనెల 21న స్నేహితుడు కనుకుట్ల రవితేజతో ద్విచక్ర వాహనంపై కొండాపూరు వెళుతుండగా వాహనం అదుపుతప్పి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఓటు వినియోగంపై విద్యార్థుల ర్యాలీ

నవతెలంగాణ - ముస్తాబాద్ :

జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అధికారులు ఓటు హక్కు కలిగివున్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సురేష్ మాట్లాడుతూ ఓటు ఉన్న ప్రతి ఒక్కరు ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకొని దేశ భవిష్యత్తుకు కృషి చేయాలన్నారు. ఓటు ఒక వజ్రాయుధమని, బుల్లెట్ కన్నా బ్యాలెట్ చాలా గొప్పదని, దేశంలో అవినీతిపరుల రాజకీయ నాయకుల ఆట కట్టించడానికి ఓటు హక్కు వజ్రాయుధమన్నారు. ముఖ్యంగా పట్టణాలలో కొంతమంది ఓటు హక్కును వినియోగించుకోవడంలేదని అలా చేయడం సరికాదన్నారు. 18సంవత్సరాల యువతి యువకులు ఓటు హక్కును నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బీరయ్య, ఈవో రమేష్, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఫోటో నెంబర్ 1 ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు అధికారులు.

పురపాలికల్లో ప్రత్యేక పాలన

నేటితో ముగియనున్న పదవీ కాలం
జిల్లా కలెక్టర్‌కే పాలనా పగ్గాలు!


సిరిసిల్ల పురపాలక సంఘం

పుర ఎన్నికల నిర్వహణకు మరింత సమయం ఉండటం ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారి గడువు పూర్తి అవుతుండడంతో ప్రత్యేక అధికారులు పాలక సంస్థల్లో కొలువుదీరనున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పురపాలక సంఘాలు గడిచిన ఐదేళ్ల పాటు పాలనను అందించాయి. కాగా నిర్ణీత వ్యవధిలోనే ఎన్నికలను నిర్వహించాల్సి ఉండగా ముందు గ్రామపంచాయతీ ఎన్నికలు ఉండడంతో కొంత జాప్యం జరిగే అవకాశం ఉంది. దీంతో పురపాలక సంస్థల్లో ఎన్నికలు నిర్వహించి అధికార బాధ్యతలు వారు చేపట్టే వరకు పాలనను కొనసాగించేందుకు ప్రత్యేక అధికారులు తెర ముందుకు వస్తున్నారు. ప్రభుత్వం అందించే ఆదేశాలతో అన్నిచోట్ల వీరి నియామకాలు నేడు పూర్తయ్యే వీలుంది. దీంతో వెంటనే సంబంధిత ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన స్థానాల్లో పరిపాలన బాధ్యతల్ని స్వీకరించనున్నారు .

మాజీలుగా ప్రజాప్రతినిధులు...

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల ,వేములవాడ పట్టణాల్లో పురపాలక సంఘం కు సంబంధించి ఐదేళ్ల కిందటి నుంచి తమదైన పాలనా ముద్రను వేసిన చైర్ పర్సన్, కౌన్సిలర్లు ఇక మాజీలుగా మారనున్నారు. ఆదివారంతో వీరి బాధ్యతలు తీరిపోవడంతో కొత్తగా ఎన్నికయ్యే ప్రజాప్రతినిధులు కుర్చీలో కూర్చునే వరకు జిల్లా స్థాయిలోని అధికారులు బాధ్యతలు నిర్వహించనున్నారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో పర్యవేక్షణ పై అధికారులు దృష్టి సారించనున్నారు. సిరిసిల్ల పురపాలక సంఘంలో జిల్లా కలెక్టర్, వేములవాడ పురపాలక సంఘంలో అదనపు కలెక్టర్ ప్రత్యేక అధికారి బాధ్యతల్ని నిర్వర్తించే వీలుంది. దీనికి అవసరమైన కసరత్తును కొనసాగిస్తున్నారు. రూపొందించిన అధికారుల జాబితాను ఉన్నతాధికారులకు పంపించి ఆమోదముద్ర రాగానే అధికార బాధ్యతల్ని చేపట్టేలా ప్రక్రియ శరవేగంగా సాగుతుంది .

సవాలుగానే బాధ్యతలు...

ప్రత్యేక అధికారుల పాలన అనగానే ఒక్కసారిగా అందరిలోనూ పట్టణాల్లో అందే సేవలపైనే ఆసక్తి కనిపిస్తోంది. కొత్తగా బాధ్యతలు స్వీకరించే అధికారులు విధులపై ప్రత్యేక దృష్టిని సారించాల్సి ఉంటుంది. జూన్, జూలై మాసాల్లో ఎన్నికలను నిర్వహించేందుకు రాష్ట్రస్థాయిలో కసరత్తు ఊపందుకోవడంతో ఎన్నికలు పూర్తయ్యే వరకు సుమారుగా ఐదు మాసాల పాటు ప్రత్యేక అధికారుల పాలన కనిపించనుంది. గతంలో ఉన్న అనుభవం దృష్ట్యా ప్రత్యేక అధికారుల పాలనలో సరిగ్గా పనులు జరగలేదని విమర్శలు ఉన్నాయి. మరోవైపు బాధ్యతల విషయంలోనూ, నిర్ణయాలు తీసుకునే క్రమంలోనూ, పాలకవర్గాలు లేనిలోటు స్పష్టంగా కనిపించే వీలుంది. ప్రస్తుతం కీలకమైన పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సమస్యల విషయంలో అధికారులు పూర్తిస్థాయి చొరవను చూపించాల్సి ఉంటుంది.

ఇక అభివృద్ధి పనుల విషయంలో ప్రజాప్రతినిధులు తీసుకున్నంత చొరవను అధికారులు తీసుకునే విషయంలో స్పష్టమైన వ్యత్యాసం అనిపిస్తుందా అనే చర్చ సాగుతోంది. పాలకవర్గాలు తరచూ నిర్వహించే సాధారణ సమావేశాలు ఇకమీద కనిపించవు. ఇలాంటి సమావేశాల్లో అన్ని వార్డుల నుంచి అవసరమైన వానిని ఎన్నికైన ప్రజాప్రతినిధులు వినిపించడం వాటిని పరిష్కరించే దిశగా ప్రయత్నాలు చేయడం లాంటి చొరవలు గతంలో కనిపించేవి. ఇకమీదట అధికారులు అన్ని వార్డుల్లో వీక్షణను పెంచాల్సి వస్తుంది. తమ దృష్టికి వచ్చిన సమస్యలపైనే దృష్టిని కేంద్రీకరిస్తారు. అన్నిటికన్నా ముఖ్యంగా నిధుల వినియోగం విషయంలో ఇబ్బంది కనిపిస్తుంది. పాలకవర్గాలు లేని సమయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు సరిగ్గా రాకపోవడంతో పాటు పాలనాపరంగా కొన్ని ఇక్కట్లు ఎదురవుతాయి. ముఖ్యంగా వ్యాధులు ప్రబలే కాలంలో అధికారులు పట్టణాల్లో పర్యవేక్షణను పెంచడం బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తించడం సవాలు గానే మారనుందా అనే సందేహం ప్రజల్లో వినిపిస్తుంది.

> రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పురపాలక సంస్థల పాలకవర్గాల పదవీకాలం నేటితో (ఆదివారం) ముగియనుంది. దీంతో సోమవారం నుండి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభం కానుంది. ఐదేళ్ల పదవీకాలం పూర్తి కావడంతో, ఎన్నికలు జరిగే వరకు పాలనా బాధ్యతలను అధికారులకు అప్పగించడం అనివార్యమైంది.
> - నవతెలంగాణ, సిరిసిల్ల


సిరిసిల్ల పట్టణం

గణతంత్ర దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఏర్పాట్లను పరిశీలించిన అదనపు అదనపు కలెక్టర్

నవతెలంగాణ - సిరిసిల్ల :

గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అన్నారు. ఈ నెల 26న పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ పరిశీలించారు. అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ గణతంత్ర వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. డయాస్ , ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు, సౌండ్ సిస్టం, స్వాతంత్ర సమర యోధులకు అధికారులకు, సిబ్బందికి, ప్రజలకు అవసరమైన మేలు కుర్చీలు, త్రాగునీటి సరఫరా వంటి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేశామని అన్నారు. జనవరి 26 న ఉదయం 9 గంటలకు జిల్లా కలెక్టర్ గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని, అనంతరం ప్రజా ప్రభుత్వంలో ప్రజల సంక్షేమ అభివద్ధి కోసం చేస్తున్న పనులను వివరిస్తూ కలెక్టర్ సందేశాన్ని అందిస్తారని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు అనంతరం విధులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు పంపిణీ కార్యక్రమం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్డీవో సిరిసిల్ల రాధాబాయి మున్సిపల్ కమిషనర్ లావణ్య డీపిఆర్ఓ వి శ్రీధర్ సిరిసిల్ల తహసీల్దార్ ఉమారాణి సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ కిమ్యా నాయక్

మార్ట్‌లో రేట్ల మాయ

- ఎమ్మార్పీ ధర రకంటే ఎక్కువ విక్రయం
- మోసపోతున్న వినియోగదారులు
- దృష్టి సారించని లీగల్ మెట్రాలజీ అధికారులు

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ : మార్ట్‌ల్లో తక్కువ ధరలకు వస్తువులు దొరుకుతాయన్న కస్టమర్ల నమ్మకం వమ్ము చేస్తూ ఎమ్మార్పీ ధర కన్నా ఎక్కువ వసూలు చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. సిరిసిల్ల పట్టణంలో ఏర్పాటుచేసిన రిలయన్స్ మార్ట్‌కి శ్రీకాంత్ అనే వ్యక్తి నిత్యవసర సరుకులు కొనేందుకు వెళ్లాడు. తను తీసుకున్న వస్తువుల్లో ఫ్లోర్ క్లీనర్ బాటిల్‌పై ధర రూ.110 ఉండగా బిల్‌లో రూ.120.54 వేశారు. బిల్లు చూసిన వినియోగదారుడు కంగు తిన్నాడు. బాటిల్‌పై ఉన్న ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువ ఎందుకు వేశారని ప్రశ్నించగా నిర్లక్ష్యపు సమాధానం చెప్పినట్లు వినియోగదారుడు వాపోయాడు. అధిక ధరలకు విక్రయిస్తూ మోసాలకు పాల్పడుతున్న మార్ట్‌ల్లో, దుకాణాల్లో సంబంధిత అధికారులు దృష్టి సారించాలని కోరారు. కాగా బిల్ చూసి వినియోగదారుడు జరిగిన మోసాన్ని గ్రహించాడు. ఈ లెక్కన బిల్ చూడకుండా మోసపోతున్న వినయోగదారులు ఎంతో మంది ఉండొచ్చు.



కనెక్ట్ డయాగ్నొస్టిక్ సిబ్బంది

ఉచిత రక్త నిర్ధారణ పరీక్షలు

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ : సిరిసిల్ల పట్టణంలోని 17వ వార్డులో కనెక్ట్ డయాగ్నొస్టిక్ సహకారంతో కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజ పూర్ణచందర్ ఆధ్వర్యంలో ఉచిత రక్త పరీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉచిత పరీక్ష శిబిరానికి స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. బీపీ, డయాబెటిస్, కొలెస్ట్రాల్ తదితర పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శంకర్, ప్రసాద్, కనెక్ట్ డయాగ్నొస్టిక్ నిర్వాహకులు నాయక్ ఉన్నారు.

విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేత

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ :

సిరిసిల్ల పట్టణం సుందరయ్య నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శనివారం ఉచితంగా యూనిఫామ్స్ అందజేశారు. పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది బి రవీందర్ రావు చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేస్తున్న న్యాయవాది రవీందర్‌రావు

మున్సిపల్ సాధారణ సమావేశం

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ :

సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ జిందం కళ అధ్యక్షతన శనివారం జరిగింది. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ప్రజా అవసరాల దృష్ట్యా సమావేశంలో 8అంశాలను ప్రవేశ పెట్టగా, ఆమోదించినట్లు తెలిపారు. పట్టణాభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ కోరకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఐదు సంవత్సరాలు విజయవంతంగా పదవీకాలం పూర్తి చేసుకుంటున్నా సందర్భంగా ఎమ్మెల్యే కేటీఆర్, పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ లావణ్య, వార్డు కౌన్సిలర్స్, కో-ఆప్షన్ సభ్యులు, టౌన్ ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్పర్సన్ జిందం కళ

గంజాయి విక్రేత అరెస్టు

నవతెలంగాణ - గంభీరావుపేట : గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించిన ఘటన గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం కరీంనగర్ జిల్లా లోని గంగాధర మండలం ముప్పిడి పల్లి గ్రామానికి చెందిన కల్లపల్లి శ్రీనివాస్(24) గత నేల క్రితం బల్లర్షా మహారాష్ట్రలోని గుర్తు తెలియని వ్యక్తుల వద్ద గంజాయిని తీసుకొని అందులో కొంత మేర తాగి మిగిలిన గంజాయిని అధిక ధరకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఐతే గంభీరావుపేట మండల పరిధిలోని నాగంపేట కమాన్ వద్దకు గంజాయి విక్రయించేందుకు వస్తున్నాడనే విశ్వసనీయ సమాచారము మేరకు ఎస్సై శ్రీకాంత్ తన బృందంతో నిఘా పెట్టగా నాగంపేట కమాన్ వద్ద ఆ వ్యక్తి బస్సు నుంచి దిగి అనుమానాస్పదంగా కనిపించడంతో ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా గంజాయిని విక్రయించేందుకు వచ్చినట్లు తెలపడంతో 110గ్రాముల గంజాయి స్వాధీనపరచుకొని ఆ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎవరైనా గంజాయి తాగినా విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడిగా యూసుఫ్ తొలగింపు

ఉత్తర్వులు జారీ చేసిన ఐ అండ్ పీఆర్ కమిషనర్

నవతెలంగాణ - సిరిసిల్ల :

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ నుంచి సిఫార్సు చేయబడిన, రాజన్న సిరిసిల్ల జిల్లా అక్రిడిటేషన్ కమిటీ (2022-2024) సభ్యుడిగా ఉన్న యూసఫ్ అలియాస్ యూసూబ్‌ను అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడిగా తొలగిస్తూ ఐ అండ్ పీఆర్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడిగా ఉన్న యూసఫ్ అలియాస్ యూసూబ్‌పై పలు ఆరోపణలు, ఫిర్యాదులు, కేసులు నమోదుకాగా, పోలీసులు విచారణ చేపట్టి పూర్తి వివరాలు ఐ అండ్ పీఆర్ కమిషనర్‌కు పంపించారు. దీంతో జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడిగా ఉన్న యూసఫ్ అలియాస్ యూసూబ్‌ను తొలగిస్తూ ఐ అండ్ పీ ఆర్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ పంపిణీ

నవతెలంగాణ - ముస్తాబాద్ :

మండలంలోని రాంరెడ్డిపల్లె గ్రామానికి చెందిన పల్లె ఎల్లవ్వ అనే మహిళకు సీఎం ఆర్ఎఫ్ చెక్కును అందజేసిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా బాల్ రెడ్డి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తూ ఉంటే బీఆర్ఎస్ నాయకులు నోటికి ఎంత వస్తే ఎంత కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తుందని ఇలా చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి పట్టణ అధ్యక్షులు గజ్జెల రాజు నామాపూర్ గ్రామ శాఖ అధ్యక్షులు గన్నే భానురెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తాళ్ల విజయ్ రెడ్డి సీనియర్ నాయకులు ఉచ్చిడి బాల్ రెడ్డి అన్నం శ్రీధర్ రెడ్డి మామిండ్ల ఆంజనేయులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

- రౌడీ షీటర్స్, హిస్టరీ షీటర్స్, సస్పెక్ట్స్‌లపై నిరంతర నిఘా
- పాత నేరస్తులు సత్ప్రవర్తనతో జీవితాలను సరిదిద్దుకోవాలి
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

నవతెలంగాణ - సిరిసిల్ల :

జిల్లాలో రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లు, సస్పెక్ట్‌లపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్లో సిరిసిల్ల సబ్ డివిజన్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలోని వివిధ రకాల నేరాల్లో నిందితులుగా ఉండి రౌడీ షీట్లు, హిస్టరీ షీట్లు, సస్పెక్ట్స్‌గా ఉన్న వారికి కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించి సత్ప్రవర్తనతో జీవితాలను సరిదిద్దుకోవాలే తప్ప తరచు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వివిధ పోలీస్ స్టేషన్లలో నేరాల్లో నిందితులుగా ఉండి షీట్లు తెరువబడిన నేరచరితులు విధిగా పోలీసులు తెలిపిన సమయాల్లో పోలీస్ స్టేషన్ హాజరు కావాలని లేకుంటే వారిని బైండోవర్ చేస్తామన్నారు. రౌడీ, హిస్టరీ షీట్స్ ఉన్నవారిపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేరాలకు దూరంగా ఉండటంతో పాటు సత్ప్రవర్తనతో మెదులుతున్న వారిని గుర్తించి వారిపై ఉన్న షీట్స్‌ను తొలగిస్తామని తెలిపారు. రౌడీ, హిస్టరీ అనుమానాస్పద, అల్లర్లలో ప్రమేయం ఉన్నవారిని ప్రతి నెలా పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని, శాంతియుత వాతావరణానికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐలు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, రామ్మోహన్, శ్రీకాంత్, రమాకాంత్, గణేష్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.



పాత నేరస్తులతో జరిపిన కౌన్సిలింగ్ లో ఎస్పీ

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

ప్రతిజ్ఞ చేయిస్తున్నజిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ అఖిల్ మహజన్

నవతెలంగాణ - సిరిసిల్ల : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధమని,ఓటు హక్కును వినియోగించుకోవడం మన అందరి బాధ్యత అని జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ అన్నారు.జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అధికారులు,సిబ్బందితో కలసి ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. దేశంలో18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని,ప్రతి ఎన్నికలలో తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని సూచించారు.ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా రాజ్యాంగ స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయ వచ్చన్నారు. ప్రజలను చైతన్యం చేయడం, వారికి ఓటు విలువ గురించి అవగాహన కల్పించడం ద్వారా ప్రజలంతా ఓటర్లుగా నమోదు చేసుకునేలా కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ మురళి కృష్ణ, ఆర్.ఐ లు మధుకర్, రమేష్,సి.ఐ మధుకర్,ఎస్.ఐ లు,పోలీస్ కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రంగిలో దొంగల బీభత్సం

నవతెలంగాణ - రుద్రంగి :

మండలకేంద్రనికి చెందిన అవునూరి వజ్రవ్వ ముదిరాజ్ సంఘంలో అద్దెకు ఉంటూ కూలిపని చెలుకుంటూ జీవిస్తుంది. రోజువారీ లాగానే కూలి పనికి వెళ్లి వజ్రవ్వ ఇంటికి వచ్చే సరికి తాళం పగలకొట్టి ఉండడంతో చుట్టుపక్కల వారిని పిలిచి తన ఇంట్లో దొంగలు పడ్డట్టుగా చెప్పి రోదించింది. తర్వాత పోలీసులకు సమాచారం అందించింది. తాను కష్టపడి సంపాదించిన రూ.10వేలు చోరీకి గురైనట్టు తెలిపింది. ఈ ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.


వజ్రవ్వను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఏఎస్ఐ

ట్రాక్టర్ యూనియన్ కార్యవర్గం

నవతెలంగాణ - చందుర్తి :

మండలంలోని మూడపల్లి గ్రామంలో శనివారం ట్రాక్టర్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంటి నవీన్‌ను ఏక గ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా అరవింద్, కోశాధికారి ఆంజి, క్యాషియర్ తిరుపతి రెడ్డి, సలహా దారుడు భాస్కర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

నేడే... 'సాగు' కే సాయం..!

కొండలు, గుట్టలు, స్థిరాస్తి లేఅవుట్లు, సాగు యోగ్యతలేని భూములకు ఇక నుంచి సాయం తొలగిపోనుంది. వ్యవసాయ సాగు భూములకే పెట్టుబడి సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు యోగ్యతలేని భూములపై సర్వే నిర్వహించారు. 21 నుంచి 24తేదీ వరకు గ్రామసభలు నిర్వహించి అందులోనే వాటిని నిర్ధారించారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా నిర్వహించి యోగ్యతలేని భూముల వివరాలను పూర్తిగా తెలుసుకున్నారు. నేటి నుంచి రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మరోపక్క ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో జిల్లాలో ఎన్ని ఎకరాలకు రైతుభరోసా తొలగిపోతుందోననే ఉత్కంఠ నెలకొంది. ఇన్నాండ్లు సాగుకు యోగ్యం లేని భూములకు సైతం పొందిన సాయం ఇక నుంచి దూరం కానుంది. ఫలితంగా ప్రభుత్వ సొమ్ము దుబారా కాకుండా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. - నవతెలంగాణ, తంగళ్ళపల్లి

- కొండలు, గుట్టలు, స్థిరాస్తి లేఅవుట్లకు కట్
- యోగ్యతలేని భూములపై సర్వే పూర్తి..
- గ్రామసభలలో నిర్ధారించిన ప్రజలు, అధికారులు..
- నేటి నుంచి రైతుల ఖాతాల్లోకి భరోసా నిధులు



వ్యవసాయం మీద ఆధారపడి జీవనం సాగించే రైతులకు పెట్టుబడి భారం కాకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది. గత ప్రభుత్వం రైతుబంధు పేరిట ఎకరానికి రూ.5వేల చొప్పున ఖరీఫ్, రబీ సీజన్లకు రెండు విడతల్లో రూ.10వేల సాయం అందించింది. వీటికి తోడు సాగుకు యోగ్యతలేని భూములకు సైతం పట్టాలు కలిగి ఉంటే ఈ సాయం వర్తింపజేసింది. దీంతో ప్రభుత్వ సొమ్ము చాలా వరకు దుబారా అవుతుందని ప్రజలు, రైతుల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుబంధు పథకంపై పునః సమీక్షించింది. మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటుచేసి క్షేత్రస్థాయిలో రైతుల నుంచి అభిప్రాయాన్ని సేకరించింది. సాగుకు యోగ్యతలేని భూములకు ఈ సాయం ఇవ్వకూడదని ప్రజల నుంచి సైతం వినతులు వెల్లువెత్తాయి. తాజాగా ప్రభుత్వం రైతుబంధు పేరును రైతు భరోసాగా పేరు మార్చి సాయం అందించాలని నిర్ణయించింది. కేవలం సాగు భూములతో పాటు ఆర్ ఓఎఫ్ ఆర్ పట్టాలు కలిగిన వారికి ఈ సాయం వర్తింపజేయాలని నిర్ణయానికి రావడంతో పాటు ఈ పథకానికి సంబంధించిన విధి విధానాలు ఖరారు చేసింది.

ఆ భూములకు తొలగింపు..!

రైతుభరోసా పథకానికి ఇన్నాండ్లు ఓ ప్రామాణికం అంటూ లేకుండా పోయింది. సాగుతో పాటు కొండలు, గుట్టలు, స్థిరాస్తి లేఅవుట్లు, పరిశ్రమలు, గోదాములు, మైనింగ్ భూములు కలిగి పట్టాలు ఉన్న ప్రతి భూమికి పెట్టుబడి సాయం జమఅయ్యేది. దీంతో జిల్లాలో రూ.వందల కోట్ల ప్రజాధనం వధా అయిందనే అభిప్రాయం సర్వత్రా వినిపించింది. తాజాగా ఇలాంటి భూములన్నింటికీ రైతుభరోసా సాయం నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1లక్షా 21వేల494 మంది రైతులకు గాను రూ.128.73కోట్లు ప్రతి ఏటా పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందించింది. తాజా నిర్ణయంతో ఇందులో ఎందరు రైతులకు సంబంధించి భూములకు ఎంత మేర నిధులు కట్ అవుతాయోనని నేటితో తేలిపోనుంది. ఈ పథకం వర్తింపు కోసం గ్రామాల్లో అధికారులు సర్వే నిర్వహించి అనంతరం గ్రామాల్లో గ్రామ సభల ద్వారా లబ్ధిదారుల రైతులను ఎంపిక చేశారు. ముఖ్యంగా ప్రభుత్వం ఇచ్చే సాయాన్ని రూ.12వేలకు పెంచడంతో రూ.6వేల చొప్పున రెండు విడతల్లో అందించాలని భావిస్తోంది. నేటి గణతంత్ర్య దినోత్సం సందర్భంగా ఈ పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఓటు హక్కు వినియోగం బాధ్యత

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

నవతెలంగాణ - సిరిసిల్ల :

ఓటు హక్కు వినియోగించుకోవడం అందరి బాధ్యత కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ షుర్ అనే థీమ్ తో 15వ జాతీయ ఓటర్ దినోత్సవ వేడుకలను జిల్లా సమీకత కార్యాలయాల సముదాయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఉద్యోగులు భారతదేశ పౌరులమయిన మేము, ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, మనదేశ ప్రజాస్వామ్య సాంప్రదాయాలను, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతామనీ, మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ప్రతీ ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని ఇందుమూలంగా ప్రతిజ్ఞ చేస్తున్నామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. భారత ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఓటర్ నమోదు పెంపు, ఎథికల్ ఓటింగ్‌పై అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటర్ దినోత్సవంగా వేడుకలు నిర్వహిస్తామని, ఈ సంవత్సరం నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్ అనే థీమ్‌తో వేడుకలు జరుగుతున్నాయని వివరించారు.


ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

విద్యార్థులకు బహుమతులు..

జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా పలు విద్యా సంస్థల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు కలెక్టర్, అదనపు కలెక్టర్ పంపిణీ చేశారు. వ్యాస రచన పోటీల్లో ఈ చైతన్య, కే నికిత, జీ హరిక, సీహెచ్ రోహిత్, సాయి కృష్ణ, కే రాం చరణ్, ఈ ప్రేమ్ కుమార్ విజేతలుగా నిలువగా, బహుమతులు అందజేసి, అభినందించారు. ఎక్కువ సార్లు ఓటు హక్కు వినియోగించుకున్న ఎలగందుల బుచ్చయ్య, రడేంశ్ భారతి, అలాగే ట్రాన్స్ జెండర్ కౌసల్యను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ శాలువాతో సన్మానించారు.

నూతన ఓటర్లకు కార్డుల అందజేత..

నూతనంగా ఓటరు గా నమోదు అయిన సుద్దాల హర్షవర్ధన్, సుంకనపల్లి స్వాతి, జక్కని ధనుష్, దూడం అఖిల, తోట ప్రసన్నాంభికకు నూతన ఎపిక్ కార్డులు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అందజేసి, అభినందించారు. కార్యక్రమాల్లో జడ్పీ సీఈవో వినోద్, ఎస్డీసీ, సిరిసిల్ల ఇన్చార్జి ఆర్డీవో రాధా భాయ్ ఆయా శాఖల ఉన్నతాధికారులు, ఉద్యోగులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో ర్యాలీ...

జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కు వినియోగం పై అవగాహన కల్పించారు. ముందుగా ప్రతిజ్ఞ చేశారు. ర్యాలీలో ఎస్డీసీ, సిరిసిల్ల ఇన్చార్జి ఆర్డీవో రాధా భాయ్, తహసిల్దార్ ఉమారాణి, అధికారులు, సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన



నవతెలంగాణ-గోదావరిఖని:
విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తూ గోదావరి ఖని మండల్ లీగల్ సర్వీసు అథారిటీ వారి ఆధ్వర్యంలో పట్టణంలోని మార్కండేయ కాలనీలోని నారాయణ పాఠశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ డిస్టిక్ అండ్ సెషన్స్ జడ్జి టి.శ్రీనివాస రావు ముఖ్య అతిథిగా హాజరై నారాయణ పాఠశాలలో హాజరైన విద్యార్థినీ, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు చట్టాలపై అవగాహన కల్పించారు. జీవితంలో విద్యార్థి దశ చాలా కీలకమైందని, ఈ దశలో క్రమశిక్షణతో మెలిగి, మంచిగా చదువుకొని తల్లిదండ్రులకి, స్కూల్‌కి, సమాజానికి మంచి పేరు తీసుకు రావాలని సూచిం చారు. కార్యక్రమంలో నారాయణ హైస్కూల్ ప్రిన్సిపల్ రజనీ, సీనియల్ న్యాయవాదులు గుడికందుల భూమయ్య, సోషల్ వర్కర్ (ఎంఎల్ఎస్‌సి) మిట్టపల్లి శంకర్, డీన్ గర్రెపల్లి ఆంజనేయులు, తదితరులున్నారు.

అత్తింటి వేధింపులు తట్టుకోలేకపోతున్నా..

ఆత్మహత్య చేసుకుంటున్నా..

- ఆడపడుచు కుటుంబమే కారణం
- ఫోన్‌లో సెల్ఫీ వీడియో తీసి బలవన్మరణానికి యత్నించిన యువతి



సెల్ఫీ వీడియోలో మాట్లాడుతున్న సౌజన్య

నవతెలంగాణ-యైటింక్లైన్ కాలనీ :

నీ భర్త చనిపోయాడు..నా కొడుకే పోయాక నీకు ఇక్కడ ఏం పని.. నువ్వు ఈ ఇంటి నుంచి వెళ్లిపో.. నీకు ఒక్క పైసా కూడా ఇచ్చేది లేది.. మేం సంపాదించుకున్న డబ్బులు నీకు, నీ బిడ్డకు ఎలా ఇస్తాం అని బంగారం, భూమి కాగితాలు లాక్కొని అత్తా.. నీ బిడ్డతో ఇక్కడి నుంచి వెళ్లకపోతే మీ ఇద్దర్ని మేమే చంపేస్తాం, నీ తల్లి గారి కుటుంబాన్ని అంతం చేయడంతో పాటు నీ అన్న ఎస్పై ఉద్యోగాన్ని కూడా ఊడబికిస్తాం.. అంటూ అడపడుచు, ఆమె భర్త.. అతికిరాతకంగా బెదిరింపులకు గురిచేస్తుండడంతో తట్టుకోలేని ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించింది. భర్త చనిపోయి పుట్టెడు దుఃఖంలో తన పదేళ్ల బిడ్డతో అత్తగారింటి వద్ద బిక్కుబిక్కుమంటు గడుపుతున్న నిస్సాహకురాలిపై అత్తా, ఆడపడుచు, ఆమె భర్త వికృత చేష్టలు అత్యంత పాశవికంగా మారడంతో ఆత్మహత్యే శరణ్యం మని సెల్ఫీ వీడియో తీసుకుంటూ నిద్రమాత్రలు మింగి బలవన్మరణానికి పాల్పడింది. ప్రస్తుతం ఆమె గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చావు బతుకుల మధ్య కొట్టు మిట్టాడుతోంది...

మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన ఆవుల భీమయ్య, విజయ దంపతుల కూతురు సౌజన్యను 8 ఇంక్లైన్ కాలనీకి చెందిన తోకల మల్లయ్య, శోభా రాణి దంపతుల కుమారుడు తోకల అనురాగ్‌కు ఇచ్చి 2014 సెప్టెంబరులో వివాహం జరిపించారు. మల్లయ్య సింగరేణి ఉద్యోగం చేస్తుండగా ఆ ఉద్యోగం అనురాగ్‌కు వస్తుంది అని చెప్పడంతో సౌజన్య తల్లిదండ్రులు రూ.10 లక్షల కట్నంతో పాటు అన్ని లాంచనాలు ఇచ్చి వైభవంగా పెళ్లి చేశారు. అనంతరం వీరికి పాప జన్మించగా ఇప్పుడు ఆమె వయస్సు పదేళ్లు. మల్లయ్య 2023 మెడికల్ అన్‌ఫిట్ కావడంతో అనురాగ్‌కు ఉద్యోగం ఇచ్చేందుకు అంతా సిద్ధం చేశారు. ఉద్యోగ మొదటి కౌన్సిలింగ్ పూర్తయిన తర్వాత 2023 ఆగస్టు 28 న అనురాగ్ హార్ట్ ఎటాక్‌తో ఆకస్మిక మృతి చెందాడు. అనురాగ్ సౌజన్య దంపతులకు పదేళ్ల కుమార్తె ఉండడంతో వారిద్దరి భవిష్యత్ రీత్యా ఆ ఉద్యోగాన్ని సౌజన్యకు ఇవ్వాలని



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సౌజన్య

అనురాగ్ తండ్రి మల్లయ్య, అతనితో పాటు ఆ కుటుంబ సభ్యులంతా నిర్ణయించుకున్నారు. కానీ సౌజన్య అడపడుచు ఆరెపల్లి స్వాతి, ఆమె భర్త రాజేశం ఆ ఉద్యోగం తమకే ఇవ్వాలని గొడవకు దిగారు. సౌజన్యకు ఎంతోకొంత నగదు ఇచ్చి ఇంటినుంచి పంపేయాలని మల్లయ్య, శోభారాణితో వాగ్వాదానికి దిగారు. సౌజన్యను ఇక్కడి నుంచి వెళ్లగొడితే ఉద్యోగం తమకే దక్కుతుందన్న కుట్రతో నిత్యం రాత్రుళ్లు సౌజన్య పడక గది వద్దకు వచ్చి రాజేశం విపరీతంగా తిట్టడంతో పాటు ఆమెకు అనేక రకాల అక్రమసంబంధాలు అంటగడుతూ భయాందోళనకు గురిచేసేవాడు. దీంతో పాటు అత్తా, ఆడపడుచుల హీనమైన మాటలతో నిత్యం సౌజన్యను వేధిస్తున్నారు. తన భర్త పేరు మీద ఉన్న భూమి కాగితాలతో పాటు పెళ్లి సమయంలో పెట్టిన బంగారు నగలు, ఇతర విలువైన వస్తువులను లాక్కొని నీకు ఏమి ఇచ్చేది లేదు నీవు ఈ ఇంటి నుంచి వెళ్లిపోవాలని వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో పాటు సౌజన్యకు ఇస్తామన్న ఉద్యోగాన్ని కూడా ఆమెకు తెలియకుండా ఆడపడుచు ఆరెపల్లి స్వాతికి ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఉద్యోగం రాక, తనకు ఎలాంటి ఆసరా లేక బతికేది ఎలా అని తీవ్రమైన మనోవేధనకు గురైన సౌజన్య సౌజన్యం శుక్రవారం రాత్రి తన గోడును సెల్ఫీ వీడియోలో వెల్లబోసుకుంటూ నిద్ర గోలీలు మింగింది. అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆమెను గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది.

4 నెలల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేసినా..

అత్తా, ఆడపడుచు, ఆమె భర్త వికృత చేష్టలు, వేధింపులు తట్టుకోలేని సౌజన్య 4 నెలల క్రితమే పోలీసులను ఆశ్రయించింది. హాజీపూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. అనంతరం పెద్ద మనుషుల సమక్షంలో రాజీ కుదర్చుకుంటామని చెప్పి శోభరాణి, ఆమె కూతురు, అల్లుడు తప్పించుకున్నారు. అనంతరం పెద్ద మనుషుల మధ్య మాట్లాడేది ఏం లేదు. నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో కానీ ఇంట్లో ఉండకూడదు అని వేధింపులను మరింత ఎక్కువ చేశారు. తిరిగి సౌజన్య పోలీసులను ఆశ్రయించినా కనీసం విచక్షణ లేకుండా ఇదే విధంగా చెప్పి తప్పించుకున్నారు.

రాజకీయ నాయకుల అండతో..

8 ఇంక్లైన్ కాలనీలో ఉండే ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకుడి అండతో రాజేశం, ఆమె భార్య స్వాతి, అత్త శోభారాణి సౌజన్యకు న్యాయం జరగకుండా అడ్డుకుంటున్నారు. ఈ నాయకుడి అండతోనే అత్తమామ, అడపడుచు ఆమె భర్త రెచ్చిపోతున్నారని సౌజన్య సంబంధికులు ఆరోపిస్తున్నారు. సింగరేణి ఉద్యోగం అనురాగ్ కుటుంబానికి చెందాల్సి ఉండగా ఆ నాయకుడే సింగరేణి అధికారులను ప్రలోభానికి గురిచేస్తూ పావులు కదుపుతున్నాడని ఆరోపణలు ఉన్నాయి. నాయకుడంటే మంచి చెడుల విచక్షణ చేసి ఇరువర్గాలకు సమ్మతించేలా న్యాయం చేయాలి కానీ బాధితులకే అన్యాయం చేసేలా వ్యవహరించకూడదని దీనిపై 8 ఇంక్లైన్ కాలనీ స్థానికులు చర్చించు కుంటున్నారు.

ఆర్జీ-1లో ఉత్తమ ఉద్యోగుల ఎంపిక

నవతెలంగాణ-గోదావరిఖని:
గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సింగరేణి ఆర్జీ-1లో ఉత్తమ ఉద్యోగులను ఏరియా యాజమాన్యం ఎంపిక చేసింది. ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారిలలో జీడీకే 1,3వ గని సపోర్ట్‌మెన్ గన్నర్ల చంద్రయ్య, ఎలక్ట్రిషియన్ బొమ్మక జగదీష్, జీడీకే 2, 2ఏ ఎస్‌డీఎల్, ఎల్‌హెచ్‌డీ ఆపరేటర్ మాటూరి యాదయ్య, ఫిట్టర్ ఎండి.యాకుబ్ పాషా, జీడీకే 11వ గని జంబో డ్రిల్ ఆపరేటర్ లక్కం రాజు, ఫిట్టర్ బండారి శ్రీనివాస్, ఓసిపి 5 ఉద్యోగి కల్లెబోయిన శ్రీనివాస్, జనరల్ మజ్దూర్ నల్లి రాజేశం ఉన్నారు. 26న సింగరేణి ఆర్జీ-1 ఆధ్వర్యంలో స్థానిక జవహార్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ముఖ్య అతిథి ఏరియా జీఎం డి.లలిత్ కుమార్ చేతుల మీదుగా ఘనంగా సన్మానించ నున్నట్లు తెలిపారు.

రూ.3కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అభివృద్ధి పనులను ప్రారంభించిన రామగుండం ఎమ్మెల్యే



నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం కార్పొరేషన్ 31వ డివిజన్‌లో 3 కోట్లతో సీతాన గర్‌లో రోడ్డు వాటర్ యుజిడి, వినాయక మండపం దగ్గర యుజిడి, రోడ్డు, మల్లికార్జున్ నగర్‌లో బ్రిడ్జి, అంబేద్కర్ నగర్‌లో అంబేద్కర్ భవన్, రెల్లి వాడలో యుజిడి అభివృద్ధి పనులను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అదనపు కలెక్టర్, రామగుండం నగర ఇన్‌ఛార్జి కమిషనర్ అరుణశ్రీ, మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, ఎమ్మెల్యే సతీమణి మనాలీ ఠాకూర్, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ మహాంకాళి స్వామితో శనివారం కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా రామగుండంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధి కృషి చేయడం జరుగుతుందని అన్నారు. సంక్షేమ పథకాల విషయంలో ఎవరు కూడా అధైర్య పడవద్దని, ప్రజా పాలనలో ప్రతీ ఒక్క అర్హునికి పథకాలు అందుతాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నాలుగు పథకాలు రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డు అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలని సదుద్దేశంతో గ్రామ సభలు పెట్టడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్, యువ నాయకులు నెలకంటి రాము, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలున్నారు.

రైతుల ప్రయోజనాల కోసం కృషి

ఎమ్మెల్యే విజయ రమణారావు

నవ తెలంగాణ-ఎలిగేడు:
గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు అందుబాటులో ఉంటూ వారి ప్రయోజనాల కోసం కృషి చేస్తానని పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. శనివారం మండ లంలోని లాలపల్లిలో ఎలిగేడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో జరిగిన 134వ సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎలిగేడు మండల కేంద్రంలో 1954 లో స్థాపించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రైతులకు సేవలందిస్తూ అభివృద్ధిలో ముందుకు సాగుతుందన్నారు. 2011లో ఎలిగేడు లో ప్రాథమిక సహకార సంఘం నూతన భవనం, గోదాములను నిర్మించుకొని 12 గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను నెలకొల్పిందన్నారు. ఎలాంటి అవినీతికి తావు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తూ రైతులకు మద్దతు ధర అందిస్తోందన్నారు. ఈ సొసైటీ ఆధ్వర్యంలో 4 గోదాములు నిర్మించుకోవడం శుభ పరిణామని వాటిని నిర్లక్ష్యం చేయకుండా రైతులకు ఉపయోగపడే ఎరువులు, విత్తనాలను అందుబాటులో తెచ్చి తక్కువ ధరకు అందిస్తే ఖర్చులు తగ్గి రైతులకు లాభసా టిగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి శ్రీ మాల, అసిస్టెంట్ రిజిస్టార్ వెంకటేశ్వర్లు, సింగిల్ విండో అధ్యక్షులు గోపు విజయభాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి, పాల్గొన్నారు.

రామగుండం అభివృద్ధికి కృషి చేస్తా...

ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మేయర్, కార్పొరేటర్లు

నవతెలంగాణ -కోల్‌సిటి
రామగుండం కార్పొరేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. రామగుండం కార్పొరేషన్ పాలక వర్గం ఆదివారంతో ముగుస్తుండగా, శనివారం నిర్వహించిన చివరి కౌన్సిల్ మీటింగ్‌కు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్పొరేషన్‌కు పాలకవర్గం ఉన్నా లేకపోయినా అన్ని డివిజన్ల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతానని తెలిపారు. గత బీఆర్ఎస్ పాలనలో రామగుండం కార్పొరేషన్లో అభివృద్ధి కుంటు పడిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే సుమారు రూ.300 కోట్ల నిధులు తీసుకువచ్చి వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టినట్టు చెప్పారు. గతంలో సింగరేణి సీఎస్ఆర్ నిధులు పక్క జిల్లాలకు తరలించారని, కానీ నేడు సింగరేణి నిధులను పూర్తిగా ఈ ప్రాంతంలోనే ఖర్చు చేసేలా చర్యలు తీసుకుంటున్నానని తెలిపారు. అలాగే ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ సంస్థల సంపూర్ణ సహకా రంతో అభివృద్ధి చేపట్టనున్నామని తెలిపారు.రాబోయే నెల రోజుల్లో రుడా ఏర్పాటు కావడం జరుగు తుందని, తద్వారా కాంట్రాక్టు కార్మికులకు మరింత మేలు జరుగుతుందన్నారు. కౌన్సిల్ మీటింగ్‌కు అధ్యక్షత వహించిన మేయర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ గడచిన ఐదు సంవత్సరాల కాలంలో ప్రగతి సాధన కోసం శక్తి వంచన లేకుండా కృషి చేశామని చెప్పారు. ఆరంభంలో కార్పొరేషన్‌లో నెలకొన్న నిధుల కొరత, కరోనా ప్రభావం కారణంగా అభివృద్ధి పనుల నిర్వహణలో కొంత అవరోధం ఏర్పడినట్లు పేర్కొన్నారు. కౌన్సిల్ మీటింగ్‌లో చర్చించకుండా పలు సందర్భాల్లో అధికారులు ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం పట్ల మేయర్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. పలువురు డివిజన్ల కార్పొరేటర్లు మాట్లాడుతూ ఐదేళ్ల అనుభవాలను, అనుభూతులను పంచుకున్నారు. తమకు కార్పొరేటర్గా అవకాశం కల్పించిన డివిజన్ ప్రజలకు, అభివృద్ధికి సహకరించిన పాలకులకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.పరిపాలన ఆమోదం నిమిత్తం సమావేశంలో ప్రవేశపెట్టిన నాలుగు ఎజెండా అంశాలకు కౌన్సిల్ ఆమోదం అభించింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్, కమిషనర్ జె.అరుణశ్రీ, సింగరేణి జీఎం డి.లలిత్ కుమార్, ఎలక్ట్రిసిటి ఏడీఈ వెంకటేశ్వర్లు, మున్సిపల్ ఈఈ రామన్, ఇతర ఆఫీసర్లు పాల్గొన్నారు.

4 నూతన పథకాల ప్రారంభానికి పకడ్బందీ ఏర్పాట్లు

- రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి
- పండగ వాతావరణం లాంచింగ్ కార్యక్రమం నిర్వహించాలి



నవతెలంగాణ-పెద్దపల్లి
4 నూతన పథకాల ప్రారంభానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి అన్నారు.శనివారం రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి నూతన పథకాల లాంచ్ ఏర్పాట్ల పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ వేణుతో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ గ్రామ, వార్డు సభలను సమర్థవంతంగా నిర్వహించినందుకు అధికారులకు ముందుగా అభినందనలు తెలిపారు. గణతంత్ర దినోత్సవం నుంచి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డుల జారీ పథకాలను లాంఛనంగా ప్రతి మండలంలోని ఒక గ్రామంలో ప్రారంభించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. ప్రతి మండలంలో 250 నుంచి 400 వరకు ఇండ్లు ఉన్న గ్రామాలను స్థానిక ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ఈ గ్రామాలను ఎంపిక చేయాలని అన్నారు. ప్రజా పాలన ప్రారంభించే గ్రామాల జాబితా, గ్రామాలలో 4 పథకాల లబ్ధిదారుల వివరాలను నిర్ణీతసమయంలో పంపాలని కలెక్టర్లకు సిఎస్ తెలిపారు.జనవరి 26న ఎంపిక చేసిన గ్రామాలలో మధ్యాహ్నం ఒంటి గంటకు 4 పథకాలను అధికారికంగా ప్రారంభించాలని అన్నారు. మండల ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగాలని, 4 పథకాలకు సంబంధించి సదురు గ్రామాల్లో అర్హులైన వారందరికీ లబ్ధి చేకూరేలా చూడాలని అన్నారు. ప్రతి మండలంలో 4 పథకాల లాంచింగ్ కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, ఎక్కడ ఎటువంటి గందరగోళం జరిగేందుకు వీలులేదని, ప్రభుత్వ పథకాలు అర్హులైన చివరి లబ్ధిదారుడు వరకు చేరుతాయనే విశ్వాసాన్ని ప్రజలలో కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు మండల ప్రత్యేక అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత ప్రమాణాలను పాటించాలి

అదనపు కలెక్టర్ డి.వేణు

నవతెలంగాణ-పెద్దపల్లి
రోడ్డు పై ప్రయాణించే ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అదనపు కలెక్టర్ డి.వేణు అన్నారు.శనివారం అదనపు కలెక్టర్ డి.వేణు సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన రోడ్డు భద్రత వారోత్సవాలు కార్యక్రమంలో ఆర్.టి.ఓ టి.రంగా రావు తో కలిసి పాల్గొన్నారు.అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రమాణాలకు సంబంధించి సుప్రీంకోర్టు నుంచి కూడా మార్గదర్శకాలు ఉన్నాయని, ద్విచక్ర వాహనదారుల హెల్మెట్ ధరించడం, కార్లలో ప్రయాణించే సమయంలో సీట్ బెల్ట్ పెట్టుకోవడం చాలా ముఖ్యమని అన్నారు. రోడ్డు భద్రత ప్రమాణాల పట్ల ప్రజల నిర్లక్ష్య ధోరణి వీడాలని అన్నారు. ప్రతి సంవత్సరం దేశంలో జరిగే లక్షా 70 వేల ప్రమాదాలలో లక్షా 30 వేల ప్రమాదాలు రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించడం వల్ల నివారించవచ్చని అన్నారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం వల్ల దురదృష్టవశాత్తు ప్రమాదాలు జరిగినా ప్రాణాలు కాపాడుకోవచ్చు అని అన్నారు. రోడ్డు పై ప్రమాదాలు క్షణ కాలంలో జరుగుతాయని, వీటిలో చనిపోయే వారిలో 75 శాతం పైగా కుటుంబ పోషకులే ఉంటున్నారని, మన నిర్లక్ష్యం వల్ల మన కుటుంబాలు నష్టపోతున్నారని, ప్రతి ఒక్కరు రొడ్డు భద్రతా ప్రమాణాల పాటించాలని అన్నారు. రోడ్డు పై మనం బాధ్యతతో వ్యవహరించాలని అన్నారు. టి జంక్షన్ దగ్గర ఊర్లలో నుంచి మెయిన్ రోడ్డు కు వచ్చే సమయంలో ఒకటి రెండు సార్లు రొడ్డుకు ఇరు వైపులా చూసుకోవాలని, ఇతర వాహనాలనం ఓవర్ టేక్ చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని అన్నారు.అనంతరం అదనపు కలెక్టర్ అధికారులు సిబ్బంది చే రోడ్డు భద్రత ప్రమాణాల ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎం. మధు, సంబంధిత ఆర్.టి.ఓ సిబ్బంది, పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఎలిగేడు:
మండలంలోని నర్సాపూర్, లాలపల్లి గ్రామాల్లో శనివారం పలు అభివృద్ధి పనులను పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రారంభించారు. నర్సాపూర్‌లో రూ.20 లక్షలతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులను, రూ.14.50 లక్షలతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాం భవనాన్ని ప్రారంభించారు లాలపల్లిలో రూ.20లక్షలతో చేపట్టిన అంతర్గత రహదారి నిర్మాణ పనులను, రూ 19 లక్షలతో నిర్మించిన సహకార సంఘం గోదామును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి అన్న ప్రసన్న, జిల్లా సహకార అధికారి శ్రీమాల, మండల వైద్యాధికారి నిస్సీ క్రిస్టిన, సింగిల్ విండో అధ్యక్షులు గోపు విజయభాస్కర్ రెడ్డి, పాల్గొన్నారు.

ఓటర్లు ప్రలోభాలకు లొంగొద్దు

ప్రజాస్వామ్య దేశంలో ఓటే ఆయుధం



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

నవతెలంగాణ-రామగుండం
రాజకీయ పార్టీల నాయకులు పెట్టే ప్రలోభాలకు ఓటర్లు లొంగకూడదని, ప్రజాస్వామ్యంలో ఓటే ఆయుధమని ఆ హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు, అంతర్గాం తహసీల్దార్ తూము రవీందర్ అన్నారు. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా అంతర్గాం మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద పాఠశాల విద్యార్థులు, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని ఓటరు అవగాహన చేపట్టారు. ఒక్కసారి ఓటును అమ్ముకుంటే ఐదేళ్ల పాటు బానిసల్లగా ఉండాల్సిన పరిస్థితి ఎదురవుతుందని దీనిని ఓటర్లు గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సతీష్ రావు, సీనియర్ అసిస్టెంట్ సమ్మయ్య, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, గిర్ధవార్లు శ్రీమన్, రమేష్,రెవెన్యూ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కోల్‌సిటీ:
జాతీయ ఓటర్ల దినోత్సవంలో భాగంగా గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్,ఎన్‌సీసీ, పొలిటికల్ సైన్స్ విభాగాలు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వ ర్యంలో ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జై కిషన్ ఓఝా, మున్సిపల్ కార్పొరేషన్ బీఎల్‌వో సూపర్‌వైజర్ సుమలత మాట్లాడతూ 18 సంవత్సరాలు దాటిన పౌరులందరూ ఓటరుగా నమోదు చేసుకొని, సక్రమంగా ఓటు ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్‌సీసీ కెడేట్స్, విద్యార్థులు, బోధనా, బోధనేతర సిబ్బంది ఓటరు ప్రతిజ్ఞ చేశారు.

నవతెలంగాణ-మంథని
ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అమూల్యమైనదని మంథని ఆర్డీవో సురేష్ అన్నారు.శనివారం మంథని పట్టణం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల (బాలురు) యందు ప్రిన్సిపల్ శ్రీనాథ్ అధ్యక్షతన 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంథని ఆర్డీవో సురేష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు అత్యంత ప్రాధాన్యత ఉందని,ఓటు హక్కును అందరూ బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా ప్రశాంతమైన వాతావరణంలో అధికార మార్పిడి జరుగుతుందని అయన వివరించారు. ఈ కార్యక్రమంలో మంథని తహసీల్దార్ రాజయ్య,డిప్యూటీ తహసీల్దార్ గిరి, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ రాంబాబు,సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ సరిత, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ రమేష్, గురుకుల పాఠశాల/ కళాశాల సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పరిశీలన



నవతెలంగాణ-రామగిరి
నేడు స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్న 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను శనివారం రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు పరిశీలించారు.వేడుకలలో భాగంగా నిర్వహించనున్న పరేడ్, ఉత్తమ ఉద్యోగుల సన్మానం, సాంస్కృతిక కార్యక్రమాల కోసం సివిల్, సెక్యూరిటీ, ఎలక్ట్రికల్, పర్సనల్ విభాగాల ఆధ్వర్యంలో చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ-2 జీఎం గుంజపడుగు రఘుపతి, సివిల్ డిజీఎం రాజేంద్ర కుమార్, పర్సనల్ మేనేజర్ బి.సుదర్శనం, ఏరియా సెక్యూరిటి ఆఫీసర్ షబ్బీరొద్దీన్, ఫారెస్ట్ ఆఫీసర్ కళ్యాణ్, అధికారులు గుర్రం శ్రీహరి, కోల శ్రీనివాస్, పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్

టూ టౌన్ సీఐ ఎన్.ప్రసాద్ రావు

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ
నేరాలను నియంత్రించడానికే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని టూ టౌన్ సీఐ ఎన్ ప్రసాద రావు తెలిపారు.రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేకే నగర్ లో శనివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు కార్డెన్ సెర్చ్ కొనసాగింది.సీఐ ఆధ్వర్యంలో 30 మంది పోలీసులు బృందాలుగా ఏర్పడి ఇళ్లను సోదా చేశారు.ఈ తనిఖీలో ఎలాంటి పత్రాలు లేని ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.అనంతరంసైబర్ నేరాల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని 2 టౌన్ సీఐ.2 లింగమూర్తి, కమాన్‌పూర్‌మ ఎస్సైలు ప్రసాద్, రవళి,ఏఎస్ఐ కలీల్,హెడ్ కానిస్టేబుళ్ల కృష్ణారెడ్డి,సంతోష్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులతో ముఖాముఖి

నవ తెలంగాణ-రామగిరి
జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులతో సింగరేణి సంస్థ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ, జీఎం గుండా శ్రీనివాస్ శనివారం ముఖాముఖి నిర్వహించారు. కళాశాల ఆవరణలోని సెమినార్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ ఎనిపిఎల్లో వేల కోర్సులు ఉంటాయని, దీని సర్టిఫికెట్‌కు ఎంతో విలువ ఉందని తెలిపారు. గేట్ ప్రయోజనాలను వివరించారు. డెటా స్ట్రక్చర్, అల్గొరిథమ్ కోడింగ్ సిస్టమ్స్, గూగుల్ సమ్మర్ ఆఫ్ కోడ్, స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం రోజున జెండా ఎగురేసే విధానం అంశాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సాల్ రమణ, ఫిజికల్ డైరెక్టర్లు పింగిళి కృష్ణారెడ్డి, సునీల్కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగుల పెన్షన్ సమస్యను పరిష్కరించండి

నవతెలంగాణ-గోదావరిఖని:
సింగరేణిలో 11వ వేజ్ బోర్డులో రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన సవరించిన పెన్షన్, పెరిగిన ఏరియర్స్ చెల్లించాలని, అదేవిధంగా వితంతు పెన్షన్ పొందేందుకు పెండింగ్‌లో ఉన్న పెన్షన్ పేమెంట్ ఆర్డర్ కాపీలు వెంటనే ఇవ్వాలని గోదావరిఖని సిపిఎంఎఫ్ కమిషనర్ పచౌరీని ఏఐటియుసి కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి శనివారం ఫోన్‌లో సంప్రదించి కోరారు. రిటైర్డ్ ఉద్యోగులు 2900 మంది వరకు ఉన్నారని, వారికి ఫిబ్రవరిలో పెరిగిన పెన్షన్ ఏరియర్స్‌తోపాటు సవరించిన పెన్షన్ చెల్లించేందుకు ప్రయత్నం చేస్తున్నామని ఆయన తెలిపారని స్వామి పేర్కొన్నారు. అదేవిధంగా రిటైర్డ్ ఉద్యోగులు మరణించిన వారి భార్యలకు పెన్షన్ పొందేందుకు పెండింగ్‌లో ఉన్న పెన్షన్ పేమెంట్ ఆర్డర్ కాపీలు ఇంత వరకు ఇవ్వలేదని, దీని వల్ల వారు సకాలంలో పెన్షన్ పొందలేక పోతున్నారని, వారు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని తెలుపగా, వాటిని కూడా ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారని స్వామి తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కరీంనగర్ - జగిత్యాల
ఆదివారం | జనవరి 26, 2025 | www.navatelangana.com

సాగునీరు రావడంలేదని రైతుల ఆందోళన

నవతెలంగాణ - తిమ్మాపూర్


ఆందోళన చేస్తున్న రైతులు

తమ పంట పొలాలకు సాగునీరు రావడంలేదని మండలంలోని మక్తపల్లి రైతులు డి ఫోర్ ఉపకాల్వ వద్ద ఆందోళనకు దిగారు. రైతులు సాగుచేసిన వరి పంటకు గత వారం రోజులుగా సాగు నీరు రాకపోవడంతో పంట ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమ వరి పంటలకు సాగునీరు ఇవ్వాలని కోరారు. ఓ రైతు కాల్వలో మట్టి పోయడంతో నీరు ఒకేవైపు వెళ తుండటంతో ఈ పరిస్థితి నెలపొంది తెలిపారు. మాజీ సర్పంచ్ గాండ్ల శ్రీనివాస్, పెంట చంద్రయ్య, పెంట రాజయ్య, పెంట వేణుగోపాల్, పెంట శీను, పెంట సాగర్, సంపత్ రెడ్డి, రైతులు ఉన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు విలువైంది

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

నవతెలంగాణ - చొప్పదండి


విద్యార్థితో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. చొప్పదండి నియోజకవర్గ కేంద్రంలో రెవెన్యూ అధికారులు జాతీయ ఓటర్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. అంతకుముందు రెవెన్యూ అధికారులు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, మార్కెట్ చైర్మన్ కొత్తూరి మహేష్, వైస్ చైర్మన్ మునిగాల రాజేందర్, తహసీల్దార్ పి.నవీన్ కుమార్, ఎంపీడీవో వేణుగోపాలరావు, ఎంఈఓ దీక్షితులు శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు వైద్యుల రాజిరెడ్డి, ఆర్ఐలు త్రిపాల్‌సింగ్, మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాసరెడ్డి, పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, రాపెల్లి అయిలయ్య, గుంటి స్వరూప పాల్గొన్నారు.

మండల కేంద్రంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు ఎలక్షన్ విధానంపై అవగాహన కల్పించడానికి మాక్ పోలింగ్ నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ అమిరిశెట్టి రత్నాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ గుండేటి వెంకటరమణ, డైరెక్టర్ పంతగాని అనిల్ కుమార్, వెంగళ హరిప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - వీణవంక



వీణవంక మండల కేంద్రంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. తహసీల్దార్ గుర్రం శ్రీనివాస్ మాట్లాడుతు అవగాహన కల్పించారు. ఎంపీడీవో మెరుగు శ్రీధర్, ఎంఈఓ శోభారాణి, ఎస్సై తోట తిరుపతి, హెచ్ఎం పులి అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

నవతెలంగాణ - గంగాధర

ఓటుహక్కు వినియోగంతో ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని గంగాధర ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాంజనేయులు సూచించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గంగాధర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించి అవగాహన కల్పించారు. అనంతరం చౌరస్తా కూడలిలో ర్యాలీ నిర్వహించి విద్యార్థులు ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సురేష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ - తిమ్మాపూర్

మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో నేషనల్ ఓటర్స్ డే సందర్భంగా పిల్లలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వనజ, ఉపాధ్యాయులు ఓటు యొక్క ప్రాధాన్యతను విద్యార్థులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజి, అశోక్, డాక్టర్ బాలాజీ సార్, సోఫియా ఉన్నారు.

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ అధ్యక్షతన జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఓటు ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఏంబాడీ రవి, రవీందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ - తిమ్మాపూర్ : నిరుపేద ఆడపడుచులకు రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణలక్ష్మి పథకం ద్వారా ఆర్థికంగా అండగా నిలుస్తోందని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఎల్ఎండీ కాలనీలోని క్యాంపు కార్యాలయం (ప్రజాభవన్)లో తిమ్మాపూర్ మండలానికి చెందిన 28 మందికి కళ్యాణలక్ష్మి పథకం చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఆర్థిక పరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ఎటువంటి వెనుకంజ లేకుండా పని చేస్తున్నామని తెలిపారు. నాయబ్ తహసీల్దార్ బి.రాకేశ్, కాంగ్రెస్ తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధోని లక్ష్మీనారాయణగౌడ్, గోపు మల్లారెడ్డి, బండారు రమేశ్, చింతల లక్ష్మారెడ్డి, గవ్వ రాజేందర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, గొట్టిముక్కుల సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా దూల జ్యోతి

నవతెలంగాణ - తిమ్మాపూర్



మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన దూల జ్యోతి మహిళా కాంగ్రెస్ కమిటీ కరీంనగర్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన శాలువాతో సత్కరించారు. తన నియామకానికి సహకరించిన తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్-ఎల్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి గవ్వ రాజేందర్‌రెడ్డి, నాయకులు ఇనుకొండ వీరచంద్రారెడ్డి, గొట్టేముక్కల సంపత్‌రెడ్డి, బండారి రమేష్, తిరుపతి, అశోక్ పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందన

నవతెలంగాణ - తిమ్మాపూర్ : మండలంలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి సముద్రాల ప్రభాస్ జాతీయస్థాయిలో ఇటీవల లక్నోలో నిర్వహించిన అండర్- 19 క్రికెట్ పోటీలలో తెలంగాణ రాష్ట్ర తరపున ప్రాతినిధ్యం వహించారు. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్, హిమాచల్ ప్రదేశ్ జట్లతో జరిగిన మ్యాచ్‌లలో ప్రతిభ కనబరిచి అండర్ 19 జాతీయ స్థాయి జట్టుకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ వెంకటరమణ తెలిపారు. అలాగే వైజ్ కిడ్ పోటీలలో సింగిరెడ్డి కార్తీక్ రెడ్డి అనే పదవ తరగతి విద్యార్థి ఆరో స్థానంలో నిలిచి రూ.2వేల నగదుతో పాటు, ప్రశంస పత్రాన్ని పొందినట్లు చెప్పారు. కాగా ఇద్దరు విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ, ఉపాధ్యాయులు శనివారం అభినందించారు.

వాగేశ్వరిలో ఉచిత కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ - తిమ్మాపూర్ : మండలంలోని వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఎన్ఎస్-ఎస్ విభాగం కరీంనగర్ శరత్ మాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రికి చెందిన దిలీప్, హర్షవర్ధన్, రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 350 మంది విద్యార్థులకు, కళాశాల సిబ్బందికి కంటి పరీక్షలు చేశారు. అనంతరం కళాశాల చైర్మన్ డాక్టర్ గంద్ర శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... ఉచిత కంటి వైద్య పరీక్షలు చేయించడంలో చొరవ చూపిన శరత్ మాక్స్ విజన్ యాజమాన్యానికి కళాశాల చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సంయుక్త కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్లు వినోద్, ప్రకాష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ రామకృష్ణ, విభాగాధిపతి డాక్టర్ శ్రావణ్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రేఖా ఠాకూర్ పాల్గొన్నారు.

బోరు మోటార్లకు మరమ్మతులు

నవతెలంగాణ - తిమ్మాపూర్ : మండలంలోని మొగిలిపాలెం గ్రామంలో నాలుగో వార్డ్, ఎనిమిదో వార్డులో బోర్లు కాలిపోయి నీరులేక ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని స్థానిక నాయకులు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రావుల రమేష్‌కు చెపాపరు. వెంటనే స్పందించిన రావుల రమేష్ బోర్ మోటార్లకు మరమ్మతులు చేయించారు. ప్రజలు సంతోషం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రావుల రమేష్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పెట్టం రమేష్, వరుకోలు సమ్మయ్య, కొమ్మెర వెంకట్‌రెడ్డి, కొమ్మెర సంజీవరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు బోరు మోటర్ అందజేత

నవతెలంగాణ - తిమ్మాపూర్ : మండలంలోని రామకృష్ణ కాలనీ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో బోరు మోటార్ చెడిపోవడంతో నీళ్ల లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్న విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ లీడర్, గ్రామ రెడ్డి సంఘం అధ్యక్షుడు దావు సంపత్ రెడ్డి తన సొంత ఖర్చులతో నూతన మోటార్ అందించి శనివారం బిగించారు. కార్యక్రమంలో నాయకులు మాచర్ల అంజయ్య గౌడ్, శ్రీనివాస్ గౌడ్, అనిల్ గౌడ్, శ్రీనివాస్, వెంకట్రావు పాల్గొన్నారు.

తప్పుదోవకు తెరలేపాడు..

నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

నవతెలంగాణ - కరీంనగర్


మాట్లాడుతున్న కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

జండాలు పక్కకు పెడుదాం.. అభివృద్ధి జెండా పడుదాం.. అన్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్ నగర ప్రజలను తప్పుదోవకు తెరలేపాడని శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మెన్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి నరేందర్‌రెడ్డి బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై మండిపడ్డారు. హౌసింగ్ బోర్డ్ కాలనీలో శుక్రవారం నిర్వహించిన అభివృద్ధి సభలో జెండాలను పక్కనపెట్టి అభివృద్ధి ఎజెండాగా పని చేస్తామని చెప్పిన సంజయ్, బీజేపీ ఎన్నికల ప్రచార సభ మాదిరిగా నగరంలో ఫ్లెక్సీలు కట్టి, హోర్డింగులతో నింపడమే నిదర్శనం అన్నారు. ఎంపీగా ఉన్నప్పుడు బండి సంజయ్‌కి అభివృద్ధి గుర్తుకు రాలేదని స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆకస్మాత్తుగా నగర ప్రజలపై సవతి తల్లి ప్రేమను మొలకపోసినట్టు ఇప్పుడు ఆకస్మాత్తుగా జ్ఞానోదయం కలగడం హాస్యాస్పదమన్నారు. సభ సక్సెస్ అయిన సంజయ్ సఫలం కాలేదని చెప్పారు. సుమారు 800 కోట్ల రూపాయలతో స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులు జరగగా ఇందులో కేంద్రం వాటా 50శాతం, రాష్ట్ర ప్రభుత్వ వాటా 50 శాతం ఉంటుందని తెలిపారు. కేవలం కేంద్ర ప్రభుత్వ నిధులతోనే స్మార్ట్ సిటీ అభివృద్ధి జరిగినట్టు ప్రజలను కేంద్రమంత్రిగా ఉన్న బండి సంజయ్ మభ్యపెట్టడం సిగ్గుచేటు అన్నారు. కేంద్ర మంత్రిగా ఉన్న సంజయ్‌కి ఇప్పటికైనా చిత్తశుద్ధి ఉంటే ఒక్క పనైనా కరెక్ట్‌గా చేసి పూర్తి చేయాలని సవాల్ విసిరారు. 800 కోట్లలో 400 కోట్లు రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్య వాటా లేదా? అని ప్రశ్నించారు. మొన్నటికి మొన్న స్మార్ట్ సిటీ పనులను వేగవంతం చేయడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా డబ్బులను విడుదల చేసిన విషయాన్ని నరేందర్ రెడ్డి గుర్తు చేశారు. ప్రోటోకాల్ అంశంలో అధికారుల నిర్లక్ష్య వైఖరి నిర్మిత పనికి రాదని చేయి మాదే కన్ను మాదే కనుక ఇది మరోసారి పునరావృతం కాకుండా జిల్లా అధికార యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, ఇది సున్నితమైన హెచ్చరికగా భావించాలన్నారు. ఎవరో చెప్పారని రాష్ట్ర మంత్రుల విషయంలో, ప్రోటోకాల్ అంశంలో జిల్లా అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం సరికాదన్నారు. 10 ఏండ్లుగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు కూలీలకు భరోసాను, అప్పుడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి సంక్షేమ పథకాలకు దరఖాస్తులు స్వీకరిస్తుండడంతో ప్రజలు పెద్దఎత్తున గ్రామసభలకు హాజరవుతున్నారని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ చేయూత పథకాలకు దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియని అన్నారు. సమావేశంలో గుండటి శ్రీనివాస్‌రెడ్డి, మామిడి సత్యనారాయణరెడ్డి, నర్సిరెడ్డి, తమ్మిడి ఎజ్రా, కుర్ర పోచయ,కీర్తి కుమార్, కొట్టె ప్రభాకర్, అజయ్, మసుమ్, ఖలీల్, బారీ, బషీర్, సాయిరాం, అస్తపురం తిరుమల, ఊరడి లత, షబానా, రజితరెడ్డి, జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల సందర్భంగా జెండా ఆవిష్కరణ


జమ్మికుంట : జెండా ఆవిష్కరణ చేస్తున్న శీలం అశోక్

నవతెలంగాణ - జమ్మికుంట

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల ప్రారంభం సందర్భంగా పార్టీ జెండాను మండల కార్యదర్శి శీలం అశోక్ జమ్మికుంట పట్టణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శీలం అశోక్ మాట్లాడుతూ.. భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు 4వ మహాసభలు సంగారెడ్డి పట్టణంలో ఈ నెల 25నుండి 28వరకు 4రోజుల పాటు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు జక్కుల రమేష్, వడ్లూరి కిషోర్, నాయకులు సిరికొండ మదనయ్య, మారెపల్లి కిరణ్, కల్లూరి శీను, పుల్ల కర్ణాకర్, సుంకర కుమార్, కేసారి రమేష్, వేషాల రమేష్, సుభాష్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.


ఇల్లందకుంట : జెండాను ఆవిష్కరిస్తున్న మండల కార్యదర్శి

నవతెలంగాణ - ఇల్లందకుంట

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల సందర్భంగా మండల కార్యదర్శి రాము శనివారం మండల కేంద్రంలో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ సీపీఐ(ఎం) 4వ మహాసభలు సంగారెడ్డి పట్టణంలో జనవరి 25 నుంచి 28 వరకు 4రోజుల పాటు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు తిప్పరబోయిన శ్రీకాంత్, కొత్తూరి మల్లయ్య, గ్యారంపల్లి సంతోష్, రాజేందర్ పాల్గొన్నారు.

మున్సిపల్ పాలకవర్గానికి వీడ్కోలు



నవతెలంగాణ - హుజురాబాద్ : హుజురాబాద్ మున్సిపల్ పాలకవర్గ పదవీ కాలం పూర్తి కావడంతో శనివారం మున్సిపల్ కార్యాలయం లో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సమక్షంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పురపాలక చైర్ పర్సన్ గందె రాధిక, కౌన్సిలర్లను సభ్యులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సల్వాది సమ్మయ్య, మేనేజర్ ఆర్.భూపాల్‌రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ జి.సాంబరాజు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అశ్వినీగాంధీ, జూనియర్ అకౌంట్స్ అధికారి జి.సంధ్యారాణి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రషీద్ పాల్గొన్నారు.

'ఓట్ల కోసమే ఇందిరమ్మ ఇండ్ల జాబితా ప్రకటన'

నవతెలంగాణ - మానకొండూర్ : పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల్లో సభలు పెట్టి ప్రజలను మరోసారి మోసం చేయడానికి ప్రయత్నిస్తుందని, ఇందిరమ్మ ఇండ్ల జాబితా అందుకే ప్రకటించారని బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రాల వెంకట్‌రెడ్డి ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షుడు కంది రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి అడ్డగోలు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. మాజీ మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్, నాయకులు వృషకోయిల రమేష్, శీలం కుమార్ యాదవ్, పోచంపల్లి శ్రీనివాస్, గాడిచర్ల భూమయ్య పాల్గొన్నారు.

అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

నవతెలంగాణ - చొప్పదండి : భారత రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆర్నకొండలో సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బిజెపి మండల అధ్యక్షుడు మొగిలి మహేష్ ఆధ్వర్యంలో ఎస్సీ బస్తీలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. జిల్లా ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి ఎర్రోళ్ల ప్రశాంత్, బిజెపి నాయకులు మొగిలి సారయ్య, సింగిరెడ్డి భూంరెడ్డి, జాతర్ల శ్రీనివాస్, సాదుల రమేష్, వెంకటస్వామి, జక్కుల అంజయ్య పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

నవతెలంగాణ - గంగాధర : గంగాధర మండలం మధురానగర్ చౌరస్తా సమీపంలోని ఓ మామిడి తోటలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మధురానగర్ చౌరస్తా సమీపంలోని ఓ మామిడితోటలో 8మంది వ్యక్తులు పేకాట ఆడుతుండగా రూ.20వేలా 500 నగదు, 4 బైకులు, 7 సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వారిని న్యాయస్థానంలో హాజరు పరుస్తామని ఎస్ఐ తెలిపారు.

వడ్డెర ఓబన్న విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ



నవతెలంగాణ - రామడుగు : మండల కేంద్రంలో వడ్డెర ఓబన్న విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శనివారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ బొమ్మరవేని తిరుమలతిరుపతి ముదిరాజ్, బీసీసెల్ జిల్లా చైర్మన్ పులి అంజనేయులుగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ జవ్వాజి హరీష్, కాంగ్రెస్ నాయకులు, బొమ్మరవేణి తిరుపతి ముదిరాజ్, పంజాల శ్రీనివాస్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలలో జిల్లా స్థాయికి చొప్పదండి విద్యార్థులు

నవతెలంగాణ - చొప్పదండి : జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజాస్వామ్యం ఓటరు భాగస్వామ్యం అనే అంశంపై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చొప్పదండి ఆర్నకొండ, కేజీబీవీ విద్యార్థులు, వ్యాసరచన, వ్యక్తిత్వ పోటీలలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి జిల్లాస్థాయికి ఎంపికైనట్లుగా ఎంఈఓ దీక్షితులు శ్రీనివాస్ తెలిపారు. జిల్లా ఆడిటోరియంలో జిల్లా రెవెన్యూ అధికారి పవన్ కుమార్, మెప్మా పీడీ వేణుమాధవ్ చేతుల మీదుగా ఎంపికైన విద్యార్థులు సాయి కీర్తన, రిత్విక్‌కు సర్టిఫికెట్లను అందజేశారు. వారిని ఎంఈఓతోపాటు ప్రధానోపాధ్యాయుడు వైద్యుల రాజిరెడ్డి అభినందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ - శంకరపట్నం : శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామంలో శనివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపగోని బసవయ్యగౌడ్ ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు తాటికొండ సదానందం, కాల్వ పాపిరెడ్డి, కుర్రే వెంకట మల్లు, అడితం కుమార్, గండికోట రవి, పవన్, శ్రీకాంత్, అనిల్ పాల్గొన్నారు.

కన్నాపూర్ పాఠశాలకు బెంచీలు వితరణ



నవతెలంగాణ - శంకరపట్నం : శంకరపట్నం మండలం కన్నాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అడ్వంటా సీడ్ కంపెనీ ప్రతినిధులు బెంచీలు, విద్యార్థులకు నోటుబుక్కులు, బీరువాను శనివారం ప్రతినిధులు నాగరాజు, సుమన్ అందించారు. తాగునీటి సౌకర్యం కోసం సీడ్ ఆర్గనైజర్ తోటరాజు 15వేల చెక్కును హెచ్ఎం జీవన్‌రెడ్డికి ఇచ్చారు. సీడ్ కంపెనీ ప్రతినిధులను హెచ్ఎం అభినందిస్తూ సన్మానించారు. సీడ్ అసోసియేషన్ నాయకులు మేడుదుల రాజు, కాటం సంపత్‌రెడ్డి, గొర్ల అనిల్, రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందజేత

నవతెలంగాణ - తిమ్మాపూర్ : మండలంలోని ఎల్ఎండి కాలనీలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. బహుమతులను హైదరాబాద్‌కు చెందిన గుడవర్తి రాంగోపాల్ స్మారకార్థం వారి కుమార్తె గుడవర్తి వందన, కుటుంబ సభ్యులు పాఠశాలకు దాదాపుగా 20వేల రూపాయల విలువ గల మెమొంటోలు ప్రధాన ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌కు అందజేశారు.

హమాలీ సంఘం అధ్యక్షుడిగా ఎర్రబెల్లి రాజేశ్వరరావు



నవతెలంగాణ - జమ్మికుంట : హమాలీ సంఘం నూతన అధ్యక్షుడిగా ఎర్రబెల్లి రాజేశ్వరరావును ఏకగ్రీవంగా శనివారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా పింగిలి రమేష్, ఉపాధ్యక్షునిగా వీర్ల సాంబమూర్తి, ప్రధాన కార్యదర్శిగా సిరిమల్లె వీరయ్య, పోతుల చంద్రమౌళి, కాంతారావు, ఎస్.సమ్మయ్య, భాస్కర్, అశోక్ నరసయ్య, కొమురయ్య. తదితరులను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

కేంద్రం మంజూరు చేసే ఇండ్లకు ఇందిరమ్మ పేరెట్లా పెడతారు?

- కొత్త రేషన్ కార్డులపై ప్రధాని ఫోటో కూడా ఉండాల్సిందేలి

అవినీతిలో బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్..

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

బీజేపీలో చేరిన మేయర్, కార్పొరేటర్లు



నవతెలంగాణ - కరీంనగర్

ప్రధానమంత్రి ఆవాస్ యోజన పేరుతో కేంద్రం మంజూరు చేసే ఇండ్లకు 'ఇందిరమ్మ' పేరు పేడతానంటే ఒక్క ఇల్లు కూడా మంజూరు చేసే ప్రసక్తే లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ సునీల్‌రావుతోపాటు కార్పొరేటర్లు లెక్కల స్వప్న వేణు, శ్రీదేవి చంద్రమౌళి, నాయకులు బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ వారికి కండువా కప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తుంటే రేషన్ బియ్యంపై ప్రధాని ఫొటో ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. ఇకపై కొత్త రేషన్ కార్డులపై సీఎంతోపాటు ప్రధానమంత్రి కూడా పెట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఉచిత బియ్యం ఎందుకు సరఫరా చేయాలని ప్రశ్నించారు. అవసరమైతే కేంద్రమే నేరుగా పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేసే విషయాన్ని ఆలోచిస్తామని స్పష్టం చేశారు. దావోస్ పెట్టుబడులపై బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న ప్రచారం అబద్ధమని.. 2014 నుండి ఇప్పటి వరకు దావోస్ పర్యటనలపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిలతో విద్యార్థులు, పేదలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. కార్యక్రమంలో బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థులు మల్కా కొమురయ్య, అంజిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేష్, వాసాల రమేష్, పెద్దపెల్లి జితేందర్ కొండపల్లి సరిత సతీష్, భాష సత్యనారాయణ ఓదెలు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

నవతెలంగాణ - చొప్పదండి : విద్యార్థులు మినరల్ వాటర్‌ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండల కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో పూర్వపు విద్యార్థులు వెయ్యి లీటర్ల సామర్థ్యం గల మినరల్ వాటర్ ప్లాంట్‌ను అందించగా శనివారం ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు నమూనా ఓటు వినియోగ పద్ధతిని ఎమ్మెల్యే చూసి అభినందించారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు వాసుదేవరెడ్డి, రాజబాబు, తిరుపతి, ప్రిన్సిపాల్ పడమటి మంగతాయారు, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, మార్కెట్ చైర్మన్ కొత్తూరి మహేష్, వైస్‌చైర్మన్ మునిగాల రాజేందర్, కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాసరెడ్డి, పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ - వీణవంక : వీణవంక మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరై అందజేశారు. ఎంపీడీవో మెరుగు శ్రీధర్, తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ నిజాముద్దీన్, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇండ్ల సమస్యల పరిష్కారం కోసం

'దశలవారీగా పోరాటలకు సిద్ధం అవుదాం'

నవతెలంగాణ - హుజురాబాద్ : జర్నలిస్టుల ఇండ్ల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు తప్పవని, స్థలాలను కాపాడుకునేందుకు దశల వారీగా పోరాటాలకు సిద్ధం కావాల్సిన సమయం ఆసన్నమైందని టియుడబ్ల్యూజె (ఐజేయు) జాతీయ కార్యవర్గ సభ్యుడు నగునూరు శేఖర్ అన్నారు. శనివారం హుజురాబాద్ ప్రెస్‌క్లబ్ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన నగునూరి శేఖర్ మాట్లాడారు. స్థలాల కోసం సోమవారం నుంచి దశల వారి కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. జిల్లా అధ్యక్షుడు గాండ్ల శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎలగందుల రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు నంబి భరణి కుమార్, హుజురాబాద్ ప్రెస్ క్లబ్ కన్వీనర్ ధర్మారెడ్డి, కో- కన్వీనర్లు కాయిత రాములు, నిమ్మటూరి సాయికృష్ణ, ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ అధ్యక్షుడు మక్సూద్, చిలుకమారి సత్యరాజ్, వేల్పుల సునీల్, ఆంజనేయస్వామి, కోరం సుధాకర్ రెడ్డి, మామిడి రవీందర్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించిన ఎంఈఓ

నవతెలంగాణ - జమ్మికుంట : జమ్మికుంట మండలం తనుగుల, వావిలాల ఎంపీపీ పాఠశాలలను ఎంఈఓ హేమలత సందర్శించి, పిటిఎం మీటింగ్‌ను హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకురావాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందే విధంగా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారంగా అందించాలన్నారు. అలాగే వావిలాల సెయింట్ మేరీస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

రైతు ఆత్మహత్య



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

సాగులో నష్టాలు.. అప్పుల భారం భరించలేక ఓ రైతు శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలోని వర్తమాన్నూర్ గ్రామంలో జరిగింది. కుటుంబ సభ్యులు, ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. వర్తమన్నూర్ గ్రామానికి చెందిన రైతు మైల నర్సయ్య(59) తనకున్న ఆరెకరాల్లో వ్యవసాయం చేసేవాడు. అతనికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. ఇప్పటికే పంటలు సరిగా పండక.. పెట్టుబడులు కూడా ఎల్లక అప్పులుండగా.. కుమార్తె వివాహానికి మరికొంత అప్పు చేశాడు. పంటలు సరిగ్గా పండక చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియక మనస్థాపానికి గురై పొలంలోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ అప్పారావు తెలిపారు.

విద్యార్థినిని చెప్పుతో కొట్టిన ఉపాధ్యాయుడు

- బాలికల దినోత్సవం రోజే ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి..
- ఉపాధ్యాయునిపై సస్పెన్షన్ వేటు

నవతెలంగాణ-బల్మూరు

కోపంలో సహనం కోల్పోయిన ఉపాధ్యాయుడు విద్యార్థినిని చెప్పుతో కొట్టాడు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండల పరిధిలోని కొండనాగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకులు సీరియస్ అయ్యారు. సదరు ఉపాధ్యాయున్ని సస్పెండ్ చేస్తూ శనివారం సాయంత్రం డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. తరగతి గదిలో శుక్రవారం రిపబ్లిక్ డేకు సంబంధించి రిహార్సల్స్ జరుగుతుండగా.. క్లాస్ తీసుకుంటానని ఆంగ్ల ఉపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆ సమయంలో విద్యార్థులు నవ్వారన్న కోపంతో "నన్ను చూసి నవ్వుతారా" అంటూ ఉపాధ్యాయుడు విద్యార్థిని పైకి చెప్పు విసిరాడు. 9వ తరగతి చదువుతున్న బాధిత విద్యార్థిని విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో శనివారం పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయున్ని నిలదీశారు. దాంతో వారికి సదరు ఉపాధ్యాయుడు క్షమాపణ చెప్పారు. బాలికల దినోత్సవం రోజే బాలికలపై దాడి చేసిన ఉపాధ్యాయున్ని సస్పెండ్ చేయాలని తల్లిదండ్రులు, విద్యార్థులు కోరారు. సంబంధిత అధికారులు స్పందించి ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు, యువకులు డిమాండ్ చేస్తున్నారు.

ఉపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి సస్పెన్షన్

విద్యార్థినిని చెప్పుతో కొట్టిన ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రమేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థినిని చెప్పుతో కొట్టిన ఘటనపై సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నరసింహారెడ్డి సీరియస్ అయ్యారు. ఉపాధ్యాయుడిపై తక్షణం చర్యలు తీసుకోవాలని నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రమేష్ కుమార్‌కు ఫోన్ ద్వారా మౌఖిక ఆదేశాలు జారీ చెయ్యగా, బల్మూరు మండల విద్యాధికారి నివేదిక ఆధారంగా సదరు ఉపాధ్యాయున్ని సస్పెండ్ చేస్తూ సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు.

'దుందుభి'లో ఇసుక తరలింపుపై రైతుల నిరసన

- అక్కడే నడిగడ్డ రైతుల వంటావార్పు



నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

"ప్రభుత్వం నీళ్లు ఇవ్వక పోయినా.. తామే స్వయంగా దుందుభి నది వాగులో ఫిల్టర్ పాయింట్ల ద్వారా బోరుబావులను తవ్వి సాగునీటిని పంట పొలాలకు మళ్లించుకున్నాం.. ఉమ్మడి జిల్లా కరువుతో విలయతాండవం చేస్తున్నా మాకు ఇక్కడ సాగునీరు లభించింది. తాగునీటికి ఎలాంటి ఇబ్బందీ ఉండేది కాదు. ఇప్పుడు అధికారులు ఇబ్బడిముబ్బడిగా ఇసుక తరలింపుకు అనుమతులు ఇస్తుండటంతో సాగునీటి కష్టాలు వచ్చేలా ఉన్నాయి. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి" అంటూ నడిగడ్డ రైతులు నిరసన తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా నడిగడ్డ శివారులోని రామగిరి మూలమలుపు వంటావార్పు చేశారు.

ఈ సందర్భంగా బర్ల మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇసుక తరలింపుకు విధానపరమైన నిర్ణయంపై అడిగితే అధికారులు సమాధానం చెప్పడం లేదన్నారు. నిబంధనల మేరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకే ఇసుకను తరలించాల్సి ఉన్నా రాత్రింభవళ్లు ఇసుకను తోడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలాన్ ఉంటేనే ఇసుక తరలించాల్సి ఉండగా.. ఇసుక వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డంపుల నుంచి ఇసుక తరలింపుకు టిప్పర్లు వాడుతున్నారని చెప్పారు. దీని వెనుక పోలీస్, రెవెన్యూ మైనింగ్ అధికారుల పాత్ర ఉందని ఆరోపించారు. తమ పంట పొలాలకు సాగునీటి కోసం ఇసుక తరలింపును అడ్డుకుంటా మని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు బీరం జగత్ రెడ్డి, బర్ల కాశిరెడ్డి, బర్ల రామచంద్రారెడ్డి, యాకోబ్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

స్వార్థపరులు వర్గీకరణను అడ్డుకుంటున్నారు

- శాంతియుతంగా రిజర్వేషన్ సాధించుకుందాం
- లక్ష దప్పులు.. వెయ్యి గొంతుకలతో మన ఆవేదనను చాటుదాం :ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ



నవతెలంగాణ-సిద్దిపేట

సమాజంలో అన్ని వర్గాలు, ప్రధానమంత్రి, రాష్ట్రపతి, కోర్టులో ఎస్సీ వర్గీకరణ అవసరమని చెబుతుంటే, మాలలు మాత్రం స్వార్థంతో వర్గీకరణను అడ్డుకుంటున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే మాదిగల సాంస్కృతిక ప్రదర్శన లక్షల డప్పులు.. వేల గొంతుకల కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి శనివారం సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పుడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వద్దని లగడపాటి అంటే.. ఇప్పుడు ఎస్సీ వర్గీకరణ వద్దని వెంకటస్వామి కుటుంబం కోరుతోందని ఆరోపించారు. ఆనాడు చంద్రబాబు నాయుడు వర్గీకరణకు అనుకూలంగా ఉంటే, మన జాతి మద్దతు ఇచ్చిందని, తరువాత వర్గీకరణ జరిగిందని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సుప్రీంకోర్టు తీర్పు అని చెప్పి వర్గీకరణను నిలిపివేసిందన్నారు. ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, నరేంద్ర మోడీ వర్గీకరణకు మద్దతు ఇవ్వడంతో ఆయన వద్దకు మనం పోవాల్సి వచ్చిందని, వారికి మద్దతు ఇచ్చామన్నారు.

కానీ నాటి నుంచి కాంగ్రెస్ పార్టీలో మాలల ప్రభావం ఎక్కువగా ఉండటంతో వారు వర్గీకరణను అడ్డుకుంటున్నారని విమర్శించారు. మల్లు, వెంకటస్వామి కుటుంబాలు అడ్డు పడుతున్నాయన్నారు. లక్ష డప్పుల ద్వారా మన ఆవేదనను ప్రపంచానికి తెలియజేస్తామంటే, వారు లక్ష బరిసెలు, కర్రలు అంటున్నారని, మనం శాంతియుతంగా అంటే, వారు తొడలు కొడుతున్నారని విమర్శించారు. శాంతియుతంగా వర్గీకరణను సాధించుకుందామన్నారు. తన ఎదుగుదలలో మాదిగల పాత్ర ఎంతో ఉందని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. నేడు కొంతమందికి భయపడి వర్గీకరణను ఆలస్యం చేస్తున్నారని, అందుకే తాను మరోసారి రోడ్డు ఎక్కాల్సి వచ్చిందని అన్నారు. తనకు అనేక పార్టీలు పదవులు ఇస్తామని ప్రకటించినా, భవిష్యత్ తరాలకు మూలమైన వర్గీకరణ కోసమే తాను ఈ నల్ల కండువాను విడిచిపెట్టలేదని చెప్పారు. ఫిబ్రవరి 7న ప్రతి ఇంటి నుంచి ఒక డప్పు రావాలని, మన ఆవేదనను ప్రపంచానికి చాటి చెప్పాలని కోరారు. అంతకు ముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ముంద్రాతి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు, నాయకులు పరశురాములు, శ్రీనివాస్, యాదగిరి, శేఖర్, రమేష్, భాస్కర్, ప్రకాష్, యాదగిరి, రాములు, రాజు, పవన్ కళ్యాణ్, ప్రసాద్, కనకరాజు పాల్గొన్నారు.

బ్యాంకులను ప్రయివేటీకరించొద్దు

- లేని పక్షంలో పోరాటాలు, సమ్మెలు : కేంద్రానికి ఏఐబీఈఏ ప్రధాన కార్యదర్శి సిహెచ్.వెంకటాచలం
- పెట్టుబడిదారీ విధానం పెరిగితే దేశానికి ప్రమాదం: ప్రొఫెసర్ బాబు మాథ్యూస్
- ఏపీటీబీఈఎఫ్ 30వ త్రైవార్షిక మహాసభ ప్రారంభం



ప్రస్తుత బడ్జెట్‌లో కేంద్రం హామీ ఇవ్వాలి

నవతెలంగాణ-అంబర్‌పేట

దేశంలో జాతీయ బ్యాంకులను ప్రయివేటీకరించబోమని 2025-26 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం హామీ ఇవ్వాలని అఖిల భారత బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) ప్రధాన కార్యదర్శి సిహెచ్. వెంకటాచలం డిమాండ్ చేశారు. బ్యాంకుల ప్రయివేటీకరణ, ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను పాలకులు వీడకుంటే పోరాటాలు, సమ్మెలు చేయడానికి బ్యాంకింగ్ ఉద్యోగులు వెనుకాడబోరని హెచ్చరించారు. హైదరాబాద్ కాచిగూడలోని కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు హాల్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఏపీటీబీఈఎఫ్) రెండ్రోజుల 30వ త్రైవార్షిక మహాసభను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రయివేటీకరించడ మంటే ప్రజలు పొదుపు చేసిన దాదాపు రూ.280 లక్షల కోట్ల ప్రజాధనాన్ని ప్రయివేటీకరించడమేనన్నారు. జాతీయ బ్యాంకులు సరిగ్గా పని చేయకపోతే లక్షల కోట్ల లాభాలు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం వచ్చినా భారత దేశం ఆర్థిక సంక్షోభాన్ని తట్టుకుని నిలబడ గలిగిందంటే అది.. ప్రభుత్వరంగ బ్యాంకుల వల్లనేనన్నారు. బ్యాంకుల సేవలు, అవసరాలు, ఖాతాదారుల సంఖ్యకు అనుగుణంగా క్లరికల్, కిందిస్థాయి సిబ్బందిని నియమిం చాలని డిమాండ్ చేశారు. బ్యాంకు ఉద్యోగుల పనితీరును సమీక్షించే చర్యలకు పాల్పడితే సమ్మె తప్పదని హెచ్చరించారు.

నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ (బెంగళూరు) ప్రొఫెసర్ బాబు మాథ్యూస్ మాట్లాడుతూ.. ఏకీకృత పెట్టుబడి దారీ విధానం మరింత పెరిగితే దేశానికి, ప్రజలకు అత్యంత ప్రమాదమని చెప్పారు. లేబర్ కోడ్ పూర్తిస్థాయిలో అమలు చేస్తే భవిష్యత్‌లో సమ్మెలు చేసే పరిస్థితే ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐడీబీఐ లాంటి బ్యాంకుల ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు రుణాలు ఇచ్చి ఉత్పాదక రంగంలో ఉద్యోగాల ను, ఉపాధి అవకాశాలను పెంపొందించి నిరుద్యోగాన్ని తొలగించే చర్యలను ప్రభుత్వం చేపట్టడం లేదని విమర్శించారు. ఆలిండియా ప్రొగ్రెసివ్ ఫోరం జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ యుగల్ కిషోర్ రాయలు మాట్లాడుతూ.. బీఎస్ఎన్ఎల్, ఎయిర్ ఇండియా, స్టీల్ అథారిటీ లాంటి సంస్థల్లో వీఆర్ఎస్ వల్ల దాదాపు ప్రయివేటీకరణ జరిగిపోయాయ న్నారు. పది లక్షల మంది బ్యాంకు ఉద్యోగులు రోడ్లపైకి వచ్చి పోరాడిన ఫలితంగా బ్యాంకుల ప్రయివేటీకరణ ఆగిపోయిందని, ఇదే స్ఫూర్తి ఇతర ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు, కార్మికులు ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. ఏపీటీబీఈఎఫ్ ప్రధాన కార్యదర్శి, ఏఐబీఈఏ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు స్వాగతోపన్యాసం చేశారు. ఏపీటీబీఈఎఫ్ అధ్యక్షులు టి.రవీంద్ర నాథ్ మహాసభకు అధ్యక్షత వహించగా, ఏఐబీఈఏ జాతీయ సంయుక్త కార్యదర్శి వంక ఉదయ్ కుమార్ ఏపీటీబీఈఎఫ్ సంయుక్త కార్యదర్శి పివి.కృష్ణారావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ సమద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి, కమీషన్ల చాటున 'గంగుల' రాజకీయం

- కరీంనగర్ ఎమ్మెల్యేపై మేయర్ సునీల్‌రావు సంచలన వ్యాఖ్యలు
- కేంద్ర మంత్రి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరిక
- మేయరే అవినీతి తిమింగలం : బీఆర్ఎస్ కార్పొరేటర్లు
- ఎక్కడ అధికారం ఉంటే అక్కడికెళ్లే చరిత్ర సునిల్‌రావుది.. : ఎమ్మెల్యే గంగుల



నవతెలంగాణ -కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

'నా జోలికొస్తే గంగుల కమలాకర్ అవినీతి, అక్రమాల బండారం బయటపెడతా. కరీంనగర్‌లో చోటుచేసుకున్న ప్రతి స్కాం వెనుక ఎమ్మెల్యేనే ఉన్నారు. ఏ టెండర్ వచ్చినా అందులో ఎంత కమీషన్ వస్తుందన్నదే ఆలోచనే. బినామీలతో అన్ని రకాల కాంట్రాక్టు పనులు చేయిస్తూ దోచుకున్నారు' అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌పై మేయర్ వై.సునిల్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నుంచే మేయర్‌గా పని చేసిన ఆయన శనివారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఏ షరతూ లేకుండానే బీజేపీలో చేరుతున్నానని, సామాన్య కార్యకర్తగానే పని చేస్తానని అన్నారు. ఇదే సమయంలో ఇన్నాళ్లు తాను ఉన్న బీఆర్ఎస్ పార్టీలోని స్థానిక ఎమ్మెల్యే టార్గెట్‌గా సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు మేయర్ పదవి రావడానికి ప్రధాన కారణం వినోద్ కుమార్ అని, అడ్డుకున్నది మాత్రం గంగుల కమలాకరేనని ఆరోపించారు. అవమానాలు దిగమింగుకుని బీఆర్ఎస్‌లో ఐదేండ్లు పని చేశానన్నారు. స్మార్ట్ సిటీ నిధులు బండి సంజయ్ తెచ్చారని వాస్తవాలు చెబితే గంగులకు ఎందుకు కోపం అంటూ ప్రశ్నించారు. గంగులకు, బండి సంజయ్‌కు నక్కకు నాగలోకానికి ఉన్న తేడా ఉందంటూ వ్యాఖ్యానించారు. ఏనాడూ తనకు ఫలానా పని కావాలని కూడా అడగని క్లీన్ హిస్టరీ ఉన్న సంజయ్ వెంట నడిచేందుకే సిద్ధమై బీజేపీలో చేరానంటూ చెప్పుకొచ్చారు.

మేయరే అవినీతి తిమింగలం : బీఆర్ఎస్ కార్పొరేటర్లు

ఐదేండ్లు మంచివాడిగా నటిస్తూ వచ్చిన మేయర్ సునిల్‌రావు తన పదవీకాలంలో రూ.కోట్లు కూడబెట్టుకున్నారని, ఆయనే అతిపెద్ద అవినీతి తిమింగలం అని బీఆర్ఎస్ కార్పొరేటర్లు తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షులు హరిశంకర్ సహా పలువురు కార్పొరేటర్లు శనివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. సునిల్‌రావు బీజేపీలోకి వెళ్తున్నాడని ఐదు నెలల కిందటే చెప్పామని, ఆయన ద్రోహం, రాజకీయ వ్యభిచారం, వెన్నుపోటు, అవినీతి రాజకీయాల అస్త్రాలతోనే పని చేశారని విమర్శించారు. అధికార పార్టీలో ఉండాలన్న తపనతోనే బీజేపీలో చేరాడన్నారు. గతంలో కాంగ్రెస్ ఉన్నప్పుడు చేసిన వెన్నుపోటు రాజకీయాలతోనే ఆ పార్టీ వాళ్లు దగ్గరికి రానియ్య లేదని, అందుకే ప్రత్యామ్నాయంగా ఎంపీ సంజయ్ పంచన చేరి బీజేపీలోకి వెళ్లాడని అన్నారు. సునిల్‌రావును మేయర్‌గా బోయినపల్లి వినోద్ కుమార్ చేస్తే.. ఐదేండ్లు ఎమ్మెల్యే గంగులనే సహాయ సహకారాలు అందించిన విషయం మరిచావా? అంటూ ప్రశ్నించారు.

ఎక్కడ అధికారం ఉంటే అక్కడికెళ్లే చరిత్ర సునిల్‌రావుది.. ఎమ్మెల్యే గంగుల కమలాకర్

రెండున్నర దశాబ్దాలపాటు కాంగ్రెస్‌లో ఉన్న సునిల్‌రావు ఆ పార్టీ అధికారం కోల్పోగానే.. అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్‌లోకి దొడ్డిదారిన వచ్చాడు. అప్పుడే ఆయన గురించి పార్టీ పెద్దలకు చెప్పాను. ఆయన మేయర్‌గా చేసిన కాలంలో చాలా ఫిర్యాదులు వచ్చాయి. అప్పుడు మేము పెద్దగా దృష్టి సారించలేదు. ఇప్పుడు వాటన్నింటిపై విచారణ చేసేందుకు దృష్టిసారిస్తాం' అని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మేయర్ వ్యాఖ్యలపై స్పందించారు. గౌరవంగా పార్టీని వీడి వెళ్లిపోవాలిగానీ, అనవసరంగా తనపై ఆరోపణలు చేస్తే మైలేజ్ రాదని హితవు పలికారు. తన సహకారం లేదని, అవినీతి చేశాడని చెబుతున్న ఆయన.. తమ పార్టీలో ఉన్నన్ని రోజులూ తన పేరే జపించిన విషయం తెలియదా? అంటూ ప్రశ్నించారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని, ఇలాంటి వాళ్లు వెళ్లిపోవడం వల్ల బీఆర్ఎస్‌కు పట్టిన కొన్ని శనీశ్వరులను వదిలించుకున్నట్టే అవుతుందని అన్నారు.

రోడ్డెక్కిన వేరుశనగ రైతులు

మద్దతు ధర ప్రకటించాలని ఆందోళన

- వ్యాపారస్తులు సిండికేట్ అయి ధర తగ్గిస్తున్నారని ఆవేదన
- వికారాబాద్ జిల్లా పరిగి మార్కెట్ యార్డు వద్ద ఘటన



నవతెలంగాణ-పరిగి

పంటకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ వేరుశనగ రైతులు ఆందోళన చేపట్టారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా పరిగి మార్కెట్ యార్డు వద్ద శనివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. చుట్టుపక్కల ప్రాంతాల రైతులు, ఇతర జిల్లాల నుంచి రైతులు శుక్రవారం ఉదయం పరిగి మార్కెట్‌కు వేరుశనగ పంటను తీసుకొచ్చారు. శుక్రవారం ఈనాం వెబ్‌సైట్ మొరాయించడంతో అధికారులు ట్రేడింగ్ నిర్వహించలేదు. శనివారం మధ్యాహ్నం ఆన్‌లైన్ బిడ్డింగ్ నిర్వహించగా రూ.4,400 నుంచి రూ.5,800 ధర పలికింది. దాంతో మద్దతు ధర రావడం లేదని రైతులు ఆందోళనకు దిగారు. మార్కెట్ యార్డులోని దుకాణ సముదాయాలన్నీ మూయించి ఆందోళన వ్యక్తం చేశారు. ధర తగ్గడంపై అధికారులను నిలదీయగా సరైన సమాధానం చెప్పక పోవడంతో రైతులు రోడ్డెక్కారు. హైదరాబాద్-బీజాపూర్ హైవేపై బైటాయించి నిరసన తెలిపారు. వేరుశనగ క్వింటాలుకు రూ.6,783 ధర ఉంటే ఇక్కడ రూ.4 వేల నుంచి రూ.5 వేలు మాత్రమే ఇస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పరిగి మార్కెట్ యార్డులో ట్రేడర్లంతా సిండికేట్‌గా మారి ధర తగ్గిస్తున్నారని రైతులు ఆరోపించారు. అధికారులు వచ్చి హామీ ఇస్తేనే తప్ప అక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించి కూర్చు న్నారు. అధికారులు రైతులకు నచ్చజెప్పి మార్కెట్‌లోకి తీసుకొచ్చారు. మద్దతు ధరపై మార్కెట్ కార్యదర్శిని నిలదీశారు. గందరగోళం ఏర్పడటంతో రైతులు మరోసారి రోడ్డు పై బైటాయించారు. దాంతో మార్కెట్ కార్యదర్శి ఇంతకుముందు జరిగిన ట్రేడింగ్‌ని క్యాన్సల్ చేసి, మరోసారి ట్రేడింగ్ నిర్వహిస్తామని చెప్పారు. లేదా ఉన్నతాధికారులతో మాట్లాడి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేలా చూస్తానని చెప్పడంతో రైతులు శాంతించారు. వేరుశనగ పంటకు మద్దతు ధర కల్పించి కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా రైతులు డిమాండ్ చేశారు.

కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

- చనాక-కోరాట బ్యారేజీ పనులను ప్రారంభించాలి : మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు కూడా పెట్టుబడి సాయం అందిస్తామని హామినిచ్చిందని, కానీ ఇప్పుడు ఊసెత్తడం లేదని మాజీ మంత్రి, రైతు ఆత్మహత్యలపై బీఆర్ఎస్ అధ్యయన కమిటీ చైర్మెన్ నిరంజన్‌రెడ్డి అన్నారు. రైతు ఆత్మహత్యలపై అధ్యయనం చేసేందుకు ఆదిలాబాద్‌కు వచ్చిన కమిటీ సభ్యులతో కలిసి ఆయన శనివారం స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లాలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చనాక-కోరాట బ్యారేజీ నిర్మాణాన్ని పూర్తి చేసిందని, మెయిన్ కెనాల్ కూడా పూర్తయిందని, మిగతా పనులను కాంగ్రెస్ సర్కారు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంపై తాపత్రయం లేదని విమర్శించారు. ప్రభుత్వ పట్టింపు లేనితనం కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులు, ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా ఇవ్వకుండా కుంటి సాకులు చెబుతోందన్నారు. చనకా- కోర్ట ప్రాజెక్టు పూర్తిపై బీజేపీ ఎమ్మెల్యేలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, మాజీ మంత్రులు జోగు రామన్న, సత్యవతి రాథోడ్, పువ్వాడ అజయ్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

సోదరికి కేసీఆర్ నివాళి

- మేడ్చల్ జిల్లా పూడూరులో అంత్యక్రియలు
- హాజరైన కేటీఆర్, హరీశ్‌రావు, కవిత



నవతెలంగాణ- మేడ్చల్

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సోదరి చీటి సకలమ్మ(82) శుక్రవారం రాత్రి కన్నుమూసిన సంగతి తెలిసిందే. శనివారం మేడ్చల్ జిల్లా పూడూరు గ్రామంలోని ఆమె కుమారుడి నివాసంలో మృతదేహానికి సీఎం కేసీఆర్ నివాళ్లర్పించారు. కుటుంబ సభ్యులు, బంధువులను ఓదార్చారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవితతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నివాళి అర్పించారు. అనంతరం పూడూరు శ్మశానవాటికలో సకలమ్మ అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంత్యక్రియల్లో ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, దేవకొండ దామోదర్‌రావు, ఎమ్మెల్యేలు గుంతకండ్ల జగదీశ్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యేలు ఆశన్నగారి జీవన్ రెడ్డి, బాల్క సుమన్, కార్పొరేషన్ మాజీ చైర్మెన్‌లు ఎర్రోళ్ల శ్రీనివాస్ యాదవ్, వంటేరు ప్రతాప్‌రెడ్డి, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, భాస్కర్ యాదవ్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సకలమ్మ శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. కేసీఆర్‌కు ఆమె 5వ సోదరి. సకలమ్మ స్వగ్రామం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పెదిర. ఆమె భర్త హన్మంతరావు కొన్నేండ్ల కిందటే మృతిచెందారు. వారికి ముగ్గురు కుమారులు సంతానం.

అంబేద్కర్ వల్లే ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు

- తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య



నవతెలంగాణ-జనగామ

భారతదేశంలో ప్రతి పౌరునికీ ఓటు హక్కు కల్పించింది డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య అన్నారు. శనివారం ఓటర్ల దినోత్సవం సందర్భంగా జనగామ జిల్లా కేంద్రంలో వందే మాతరం స్టూడెంట్ ఫెడరేషన్, జిల్లా ఉద్యమకారుల ఆధ్వర్యంలో మంగళంపల్లి రాజు అధ్యక్షతన జనగామ చౌరస్తాలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి బక్కి వెంకటయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజలందరూ కుల, మతాలకతీతం గా ఓటు వేయడానికి అంబేద్కరే కారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ సంఘం జిల్లా ఇన్‌చార్జి తిప్పారపు విజయ్, పానుగంటి ప్రవీణ్, బీఆర్ఎస్ నాయకులు సువార్త, వీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నల్ల రాహుల్, నాయకులు వేంపటి అజయ్, సల్ల మహేష్, యాదగిరి, నరేష్ పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ బైక్ షోరూంలో అగ్నిప్రమాదం

- సుమారు రూ. కోటి ఆస్తి నష్టం
- రాజేంద్రనగర్ పీఎస్ పరిధిలో ఘటన



నవతెలంగాణ-రాజేంద్రనగర్

ఎలక్ట్రికల్ గోదాంలో అగ్నిప్రమాదం సంభవించి, సుమారు కోటి రూపాయల ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రబోడ ప్రాంతంలోని హైదర్‌గూడలో గతేడాది ఎలక్ట్రికల్ బైక్ షోరూం ప్రారంభమైంది. శనివారం ఉదయం షోరూం యజమానులు పూజ చేసి బయటకు రాగానే లోపల ఒక్కసారిగా పొగలు, మంటలు వచ్చాయి. క్షణాల్లో అక్కడ ఉన్న ఎలక్ట్రికల్ బైకులు పేలయాయి. అందులో పని చేస్తున్న వారు భయంతో బయటకు పరుగులు తీశారు. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది సుమారు గంటపాటు కష్టపడి మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చింది. ఎలక్ట్రికల్ బైకులు ఒకదాని తర్వాత ఒకటి పేలడంతో ఆ ప్రాంతం మొత్తం దట్టమైన పొగ వ్యాపించింది. 45 ఎలక్ట్రికల్ బైకులు పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు కోటి రూపాయలు ఆస్తి నష్టం సంభవించిందని యజమానులు చెప్పారు. ఈ ఘటనకు షార్ట్ సర్క్యూట్ కారణమా, లేదా ఎలక్ట్రికల్ బ్యాటరీ సమస్యనా.. అని పోలీసుల కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏడాదిలోనే సమస్యలెందుకు!?

బ్యారేజీపై కాంట్రాక్టర్లకు కాళేశ్వరం కమిషన్ ప్రశ్న



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ప్రాజెక్టుల పనులు ప్రారంభించే ముందు అన్ని అంశాలను పూర్తిస్థాయిలో సరిచూసుకోవాల్సిన బాధ్యత నిర్మాణసంస్థలపై లేదా అని కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ చైర్మెన్ జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నించారు. టెండర్ల వ్యవహారం అసమగ్రంగా ఉన్నప్పుడు వాటి గురించి ప్రభుత్వాన్ని ఎందుకు సంప్రదించలేదని అడిగారు. ముందేజాగ్రత్తలు తీసుకుని ఉంటే నష్టం జరిగేది కాదని వ్యాఖ్యానించారు. అన్నారం బ్యారేజీని నిర్మించిన ఆఫ్కాన్స్ సంస్థ ప్రతినిధులు నాగ మల్లిఖార్జునరావు, శేఖర్‌దాస్ కాళేశ్వరం కమిషన్ ఎదుట శనివారం విచారణకు హాజరయ్యారు. గతంలో వారు దాఖలుచేసిన అఫిడవిట్ల ఆధారంగా కమిషన్ వారిని ప్రశ్నించింది. పనులకు సంబంధించిన ఒప్పందాలు, అందులోని అంశాలు, పనుల ప్రారంభం, ఆలస్యానికి గల కారణాలు, తలెత్తిన సమస్యలు, తీసుకున్న చర్యలు తదితర అంశాలపై వారిని కమిషన్ చైర్మెన్ ప్రశ్నించారు.

బ్యారేజీ ప్రతిపాదిత లోకేషన్ మార్చడం, భూమి అప్పగింతలో ఆలస్యం జరగడంతోనే పనుల ప్రారంభానికి కొంత సమయం పట్టిందని ఆఫ్కాన్స్ ప్రతినిధులు వివరించారు. సైట్‌కు వెళ్లేందుకు మార్గంకూడా లేకపోవడంతో ఏడాదిపాటు ప్రయివేటు వ్యక్తుల నుంచి భూములు లీజుకు తీసుకున్నట్టు తెలిపారు. ముఖ్యమైన పనులు చేసే క్రమంలో అన్ని అంశాలను పూర్తిస్థాయిలో చూసుకోవాల్సిన బాధ్యత ఉంటుందన్నారు. కేవలం కాంట్రాక్టు, డబ్బులు వస్తున్నాయి కదా అని మాత్రమే చూసుకుంటే ఎలా అని కమిషన్ ప్రశ్నించిందని చెప్పారు. వందేండ్లు ఉండాల్సిన బ్యారేజీలో ఏడాదికే సమస్యలు ఎందుకు వచ్చాయని కమిషన్ అడిగింది. ఈపీసీ ఒప్పందం అయి ఉంటే సర్వే సహా అన్ని అంశాలను తామే చూసుకునే వాళ్లమని ఆఫ్కాన్స్ ప్రతినిధులు చెప్పారు. ప్రొటెక్షన్ వర్క్స్ విషయమై నీటిపారుదల శాఖతో సంప్రదింపులు చేసినట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రకాశం బ్యారేజీ, ధవళేశ్వరం బ్యారేజీ తరహా ప్రొటెక్షన్ వర్క్స్ గురించి చర్చించినట్టు పేర్కొన్నారు. సీసీ బ్లాకులు దెబ్బతిన్న తర్వాత కన్సెల్టెన్సీతో అధ్యయనం చేయించామనీ, ఆ సిఫారసులపై నీటి పారుదలశాఖ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వివరించారు. అన్నారం ఆనకట్టకు ఎలాంటి పగుళ్లు రాలేదనీ, ఒకసారి సీపేజీ సమస్య వస్తే వెంటనే గ్రౌటింగ్ చేసి అరికట్టినట్టు ఆఫ్కాన్స్ ప్రతినిధులు కమిషన్‌కు తెలియజేశారు.



భారత రాజ్యాంగానికి 75 ఏండ్లు. రాజ్యాంగాన్ని దేశానికి శక్తివంతమైన దారి దీపిక అనొచ్చేమో! దేశ కాలమాన పరిస్థితులు బట్టి ఎప్పటికప్పుడు అధునాతనం అవుతున్న రాజ్యాంగ ప్రధాన ఉద్దేశం దేశాన్ని గణతంత్ర, ప్రజాస్వామ్య రాజ్యంగా మార్చడం. రాజ్యాంగం ఉనికిలోకి వచ్చి మార్గం చూపుతున్న విధంగా మహిళల నడక సాగుతున్నదా? ఆమె జీవితం ఆత్మగౌరవంతో సాగుతున్నదా? విద్య, ఆరోగ్య, రాజకీయ రంగాల్లో సమ భాగస్వామ్యం పొందుతున్నదా? సామాజిక న్యాయం, ఆర్థిక న్యాయం అందుకుంటున్నదా? రాజ్యాంగ శిల్పులు ఊహించిన విధంగా ప్రజలలో మహిళను భాగంగా చూస్తున్నారా? అసలు రాజ్యాంగం మహిళలకు ఏమిచ్చింది? క్లుప్తంగా చర్చిద్దాం.

రాజ్యాంగం ఆమెకేమిచ్చింది?



భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దేశ మహిళల స్థితిగతులపై ఆలోచించి మహిళల సాధికారత కోసం కృషి చేశారు. ఆయన దృష్టిలో మహిళలు కేవలం గృహిణులు కాదు. సమాజంలో సమాన భాగస్వాములు. అందువల్లనే భారత రాజ్యాంగంలో మహిళలకు సమానత్వం, గౌరవం కల్పించడానికి అనేక ఏర్పాట్లు చేశారు. తద్వారా మహిళల సాధికారత సాధ్యమవుతుందని భావించారు.

అందులో ముఖ్యమైనవి

రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 సమానత్వం, ఆర్టికల్ 15 వివక్ష లేని హక్కు, ఆర్టికల్ 16 మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు లభించేలా రాజ్యాంగం నిర్దేశించింది. ఆర్టికల్ 39 సి మహిళా ఉద్యోగినులు దోపిడీకి గురికాకుండా కాపాడటం, ఆర్టికల్ 39(ఎ) మహిళలకు సమానంగా వేతనం, ఆర్టికల్ 42 ఉచిత ప్రసూతి సెలవులు ఇవ్వాలని రాజ్యాంగం స్పష్టంగా పేర్కొంది. అంబేద్కర్ మహిళల కోసం చేసిన కృషి వల్లనే మహిళల స్థాయిని పెంచే విడాకులు వంటి హక్కులు కల్పించే హిందుకోడ్ బిల్లు వచ్చింది. అనేక సామాజిక అన్యాయాలకు, అసమానతలను నిర్మూలిస్తూ కొన్ని సంస్కరణలకు కారణమైంది. మహిళల విద్యను ప్రోత్సహించింది. హిందూ వివాహ చట్టం 1955, హిందూ వారసత్వ చట్టం - 1956, వరకట్న నిషేధ చట్టం-1961, కుటుంబ న్యాయస్థానాల చట్టం 1984, మహిళల అసభ్య ప్రదర్శన నిషేధ చట్టం -1986, 2005 మహిళల రక్షణ కోసం గృహహింస చట్టం, లైంగిక వేధింపుల చట్టం 2013 వంటి సదుపాయాలున్నాయి. పంచాయితీ రాజ్ , నగరపాలక సంస్థల్లో మహిళలకు 50 % రిజర్వేషన్లు ఉన్నాయి. మహిళల హక్కుల రక్షణ, భద్రత సంబంధించిన అంశాల పరిరక్షణకు జాతీయ మహిళా కమిషన్ కృషి చేస్తుంది.

మనకున్న చట్టాలు కొంత వరకు సహాయపడిన్నాయి. కానీ అనుకున్న ఫలితాలు సాధించగలుగుతున్నామా? లేదు, మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలు ఉన్నప్పటికీ మహిళలు అనేక సవాళ్ల ఎదుర్కొంటున్నారు.

పెరుగుతున్న దాడులు

ఉద్యోగ అవకాశాలు, వేతనాలు, సామాజిక గుర్తింపు వంటి అనేక విషయాల్లో లింగవివక్ష కొనసాగుతూనే ఉంది. మహిళలపై గృహ హింస, లైంగిక వేధింపులు, అత్యాచారాలు వంటి సుడిగుండాల్లో చిక్కి విలవిలలాడుతూనే ఉన్నారు.



ఉదాహరణగా బిల్కిస్ బానో కేసు తీసుకుందాం. 2002లో గుజరాత్ అల్లర్లలో గర్భవతిగా ఉన్న బిల్కిస్ బానో, ఆమె కుటుంబ సభ్యులపై జరిగిన సామూహిక అత్యాచారం, హత్యలు సంచలనం కలిగించిన విషయం అందరికి తెలిసిందే. ఆమె ఎన్నో ఏండ్లు న్యాయం కోసం పోరాడింది. నిందితులకు శిక్ష పడింది. కానీ ఏం లాభం? గుట్టుచప్పుడు కాకుండా క్షమాభిక్ష పేరుతో హంతకులైన నేరస్థులను గుజరాత్ ప్రభుత్వం విడుదల చేసింది. అంతేకాదు పూలదండలతో ఆహ్వానం పలికింది. దీంతో బిల్కిస్ బానో, మానవ హక్కుల సంస్థలు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. గుజరాత్ ప్రభుత్వ నిర్ణయం రద్దయింది. ఈ కేసు దేశ మహిళల భద్రత, న్యాయ వ్యవస్థ పట్ల ప్రజలకు నమ్మకానిచ్చింది. ఈ మధ్య కాలంలో ఎన్ని సవాళ్ల, ఎన్ని అవమానాలు, ఎంత యాతన? దానికి బాధ్యులెవరు? దేశంలో మహిళల మాన ప్రాణాలకు రక్షించాల్సిన ఆ రాష్ట్ర ప్రభుత్వం నేరస్థుల పక్షాన నిలబడటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం కాదా?



చైతన్యం కావాలి

ప్రస్తుతం కొట్లాడి పోరాడి సాధించుకున్న మహిళల హక్కులు కోల్పోయే తిరోగమన దిశగా అడుగులు పడుతున్నాయి. జన జీవనంలోకి చొచ్చుకొచ్చి నియంత్రిస్తున్న మతం కోరలు చాచి వికటాట్టహాసం చేస్తున్నది. మహిళల శ్రేయస్సుకు ముప్పు కలిగించే మతం కోరలు పీకి, భారతీయ మహిళ రాజ్యాంగం తనకు కల్పించిన హక్కులు, చట్టాలు అందుకోవాలి. సమాజంలో అన్ని రకాల వివక్షతలు పోయి సమస్థానం, గౌరవమర్యాదలు అందుకొని ఉన్నతంగా ఎదిగే రోజు రావాలి. ఇది జరగాలంటే రాజ్యాంగ పరమైన హక్కులతో పాటు ప్రజల్లో అవగాహన, చైతన్యం రావాలి. అందుకు పౌర సంస్థల, ఉద్యమ సంస్థల కృషి మరింత అవసరం.

మహిళలు ఇంటికే పరిమితమా..?

చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం నానాటికీ దిగజారిపోతున్నది. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కోరుతూ ముప్పై ఏండ్లకు పైగా పోరాటం చేయాల్సి వచ్చింది. గత పార్లమెంట్ ఎన్నికల ముందు సెప్టెంబర్ 28, 2023లో బిల్లు వచ్చినప్పటికీ అమలు కాలేదు. మహిళలు సమాజంలో తమ స్థితి మెరుగుపడటం కోసం, తమ హక్కుల కోసం పోరాడి కొన్ని చట్టాలు సాధించుకున్నారు. కానీ మహిళల స్థితిగతుల్లో రావలసిన మార్పు రాకపోవడానికి కారణం ఏంటి? మహిళలను కేవలం గృహిణులుగానే చూసే సామాజిక దృక్పథం కొనసాగుతూనే ఉంది. అందుకు ఎల్ అండ్ టి చైర్ పర్సన్ ఎస్ ఎన్ సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు మంచి ఉదాహరణ. వారాంతపు సెలవు ఎందుకు? ఇంట్లో పెళ్ళాం ముఖం ఎంత సేపని చూస్తారు? అని అతని వ్యాఖ్య ఉద్యోగులంటే పురుషులేనా? మహిళలు కాదా? మహిళలు చేసే ఉద్యోగానికి విలువ లేదా? మహిళ గృహిణిగా మాత్రమే ఉండాలా? ఏమిటీ ధోరణి? ఎందుకిలా మాట్లాడుతున్నారు? మన సమాజం పురుషస్వామ్య సమాజం. మహిళల్ని గృహిణులుగా మాత్రమే చూసే దృక్పథం ఇప్పటికి బలంగా ఉంది.

ఇవే కారణాలు...

సామాజిక సాంస్కృతిక విలువలు అంటే ఆచారాలు, సంప్రదాయాలు మహిళల అభివృద్ధికి అడ్డంగా నిలిస్తున్నాయి. అందువల్లే చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరిగే బిల్లు చట్టం రావడానికి ముప్పై ఏండ్లకు పైనే పట్టింది. ఇక చేసుకున్న చట్టాల అమలులో ఉన్న లొసుగులు, లోపాలు, పోలీసులు న్యాయస్థానాలు మహిళల ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించక పోవడం, నిందితులకు తగిన శిక్షలు పడకపోవడం వంటి సమస్యలు ఎదుర్కొంటూనే ఉన్నారు. మహిళలు ఆర్థికంగా స్వతంత్రంగా లేకపోవడం వల్ల పురుషులపై ఆధారపడి పోరాడే శక్తి కోల్పోతుంది. ముఖ్యంగా మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు అమలు కాకపోవడానికి, జెండర్ అసమానతలు తొలగక పోవడానికి కులం, మతం పితృస్వామ్యం వంటి సామాజిక సాంస్కృతిక కారణాల పాత్ర ప్రధానమైనది.

స్వేచ్ఛను కట్టడి చేస్తున్నాయి

మన దేశంలో ఉన్న అన్ని మత గ్రంథాల్లో పురుషుల కంటే మహిళలు తక్కువ అన్న భావన కనిపిస్తుంది. పురుషులకు సేవ చేయడమే మహిళ కర్తవ్యం అని నమ్మే మత సాంప్రదాయాలు, కుల కట్టుబాట్లు మహిళా స్వేచ్ఛను కట్టడి చేస్తున్నాయి. మహిళలను సమాజానికి దూరం చేస్తున్నాయి. కులగౌరవం కాపాడాలనే పేరుతో మహిళల చదువు, ఉద్యోగాలకు అనుమతించకుండా బాల్యవివాహాలు చేస్తున్నారు. కులం తప్పి మరో కులం/మతం వారిని పెండ్లి చేసుకుంటే పరువు హత్యలకు పాల్పడటం, మత నాయకులు, కుల పెద్దలు మహిళల హక్కులు వ్యతిరేకిస్తూ తీర్పు చెప్పడం, ప్రచారం చేయడం వంటివన్నీ రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడిచేవే.

సమాజం సవ్యంగా సాగుతుందా?

పితృస్వామిక భారతీయ సమాజంలో పురుషులదే నిర్ణయాధికారం. మహిళ గృహిణి మాత్రమే. విద్య, ఆరోగ్య, ఆస్తి హక్కులు అంతంత మాత్రమే. ఒకరిద్దరు కంపెనీ సిఇఓలను లేదా నిర్ణయాధికారంలో ఉన్న మహిళలను చూపించి అది మహిళాభివృద్ధి, లింగ సమానత్వం అనుకుంటే పొరపాటే. మహిళలకు తగిన గుర్తింపు, సమాన అవకాశాలు, ఆర్థిక సమానత్వం లేని వ్యవస్థలో, మహిళలకు రక్షణలేని, మానవ విలువలు అడుగంటుతున్న సమాజం సవ్యంగా సాగుతుందా? సాగదు. మరింత వెనుకబడిపోతుంది. స్త్రీని సమాజాభివృద్ధిలో భాగస్వామిగా చేసిన సమాజం ముందుకు పోతుంది.



- వి. శాంతి ప్రబోధ

పద్మ అవార్డులు ప్రకటించిన కేంద్రం

న్యూఢిల్లీ : భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా 2025 ఏడాదికి గానూ కేంద్రం 'పద్మ' పురస్కారాలను ప్రకటించింది. వివిధ రంగాల్లో విశేష సేవలు అందించినవారిని ఈ ప్రతిష్టాత్మక అవార్డులకు ఎంపిక చేసింది. ఏడుగురిని పద్మ విభూషణ్, 19 మందిని పద్మ భూషణ్, 113 మందిని పద్మ శ్రీ పురస్కారాలకు ఎంపిక చేసింది. పద్మ అవార్డుల్లో ఏడుగురు తెలుగువారున్నారు. వీరిలో తెలంగాణ నుంచి ప్రఖ్యాత వైద్యులు దువ్వూరి నాగేశ్వర్‌రెడ్డి.. పద్మ విభూషణ్‌కు ఎంపికయ్యారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ వరించింది. ఇక ఏపీ నుంచి కళల విభాగంలో సినీనటుడు బాలకృష్ణ పద్మభూషణ్‌కు ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన టీడీపీ హిందూపురం ఎమ్మెల్యేగా ఉన్నారు. బ్రెజిల్‌కు చెందిన వేదాంత గురు జోనల్ మాశెట్టి, కువైట్‌కు చెందిన షేకా ఏజే అల్ సబాహ్, నేపాల్‌కు చెందిన నరేన్ గురుంగ్‌లు పద్మశ్రీ అవార్డులకు ఎంపికైనవారిలో ఉన్నారు.
ప్రతి ఏటా రిపబ్లిక్ డే సందర్భంగా పద్మ అవార్డులను ప్రకటిస్తారు. పద్మ అవార్డులను పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ అనే మూడు విభాగాల్లో కేంద్రం అందిస్తుంది. కళల, సమాజ సేవ, ప్రజా సంబంధాలు, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, వాణిజ్యం, వైద్యం, సాహిత్యం, విద్య, క్రీడలతో పాటు వివిధ రంగాలలో అత్యుత్తమ సేవలు అందించినవారిని ఈ అవార్డులకు ఎంపిక చేస్తారు.



పద్మ విభూషణ్ వీరికే

దువ్వూరి నాగేశ్వర్ రెడ్డి (వైద్యం) - తెలంగాణ
జస్టిస్ జగదీశ్ ఖేహర్ (రిటైర్డ్) (ప్రజా వ్యవహారాలు) - చండీగఢ్
కుముదిని రజినీకాంత్ లాఖియా (కళలు) - గుజరాత్
లక్ష్మీనారాయణ సుబ్రమణియం (కళలు) - కర్నాటక
ఎం.టి.వి.వాసుదేవన్ నాయర్ (మరణానంతరం) (సాహిత్యం, విద్య) - కేరళ
ఓసాము సుజుకీ (మరణానంతరం) (వాణిజ్యం, పరిశ్రమలు) - జపాన్
శారదా సిన్హా (కళలు) - బీహార్

పద్మభూషణ్ వీరికే..

నందమూరి బాలకృష్ణ (కళలు) - ఆంధ్రప్రదేశ్
ఎ.సూర్యప్రకాశ్ (సాహిత్యం, విద్య, జర్నలిజం) - కర్నాటక
అనంత్ నాగ్ (కళలు) - కర్నాటక
బిబేక్ దెబ్రాయ్ (మరణానంతరం) (సాహిత్యం, విద్య) - ఎన్‌సీటీ ఢిల్లీ
జతిన్ గోస్వామి (కళలు) - అసోం
జోస్ చాకో పెరియపురం (వైద్యం) - కేరళ
కైలాశ్ నాథ్ దీక్షిత్ (ఇతర- ఆర్కియాలజీ) - ఎన్‌సీటీ ఢిల్లీ
మనోహర్ జోషీ (మరణానంతరం) (ప్రజావ్యవహారాలు) - మహారాష్ట్ర
నల్లి కుప్పుస్వామి చెట్టి (వాణిజ్యం, పరిశ్రమలు) - తమిళనాడు
పీఆర్ శ్రీజేశ్ (క్రీడలు) - కేరళ
పంకజ్ పటేల్ (వాణిజ్యం, పరిశ్రమలు) - గుజరాత్
పంకజ్ ఉదాస్ (మరణానంతరం) (కళలు) - మహారాష్ట్ర
రామ్‌బహదుర్ రాయ్ (సాహిత్యం, విద్య, జర్నలిజం) - ఉత్తర్‌ప్రదేశ్
సాధ్వీ రీతంభర (సామాజిక సేవ) - ఉత్తర్‌ప్రదేశ్
ఎస్.అజిత్ కుమార్ (కళలు) - తమిళనాడు
శేఖర్ కపూర్ (కళలు) - మహారాష్ట్ర
శోభన చంద్రకుమార్ (కళలు) - తమిళనాడు
సుశీల్ కుమార్ మోడీ (మరణానంతరం) (ప్రజావ్యవహారాలు) - బీహార్
వినోద్ ధామ్ (సైన్స్ అండ్ ఇంజినీరింగ్) - అమెరికా

పద్మశ్రీ అవార్డులు

మందకృష్ణ మాదిగ (ప్రజావ్యవహారాలు) - తెలంగాణ
కె.ఎల్ కృష్ణ (సాహిత్యం, విద్య) - ఆంధ్రప్రదేశ్
మాడుగుల నాగఫణి శర్మ (కళలు) - ఆంధ్రప్రదేశ్
మిర్యాల అప్పారావు(మరణానంతరం) (కళలు)- ఆంధ్రప్రదేశ్
వదిరాజ్ రాఘవేంద్రచార్య పంచముఖి (సాహిత్యం, విద్య) - ఆంధ్రప్రదేశ్
జోనస్ మాశెట్టి (వేదాంత గురు) - బ్రెజిల్
హర్వీందర్‌సింగ్ (పారాలింపియన్ గోల్డ్‌మెడల్ విన్నర్) - హర్యానా
భీమ్ సింగ్ భవేష్ (సోషల్‌వర్క్) - బీహార్
పి.దక్షిణా మూర్తి (డోలు విద్వాంసుడు)- పుదుచ్చేరి
ఎల్.హంగ్‌థింగ్ (వ్యవసాయం-పండ్లు)- నాగాలాండ్
బేరు సింగ్ చౌహాన్ (జానపద గాయకుడు) - మధ్యప్రదేశ్
షేఖా ఎ.జె. అల్ సబాహ్ (యోగా)- కువైట్
నరేన్ గురుంగ్ (జానపద గాయకుడు) - నేపాల్
హరిమన్ శర్మ (యాపిల్ సాగుదారు) - హిమాచల్ ప్రదేశ్
జుమ్దే యోమ్‌గామ్ గామ్లిన్ (సామాజిక కార్యకర్త)- అరుణాచల్‌ప్రదేశ్
విలాస్ దాంగ్రే (హెూమియోపతి వైద్యుడు) - మహారాష్ట్ర
వెంకప్ప అంబాజీ సుగటేకర్ (జానపద గాయకుడు) - కర్నాటక
నిర్మలా దేవి (చేతి వృత్తులు) - బీహార్
జోయ్నచరణ్ బతారీ (ధింసా కళాకారుడు)- అసోం
సురేశ్ సోనీ (సోషల్‌వర్క్- పేదల వైద్యుడు)- గుజరాత్
రాధా బహిన్ భట్ (సామాజిక కార్యకర్త)- ఉత్తరాఖండ్
పాండి రామ్ మాండవి (కళాకారుడు) - ఛత్తీస్‌గఢ్
లిబియా లోబో సర్దేశాయ్ (స్వాతంత్ర్య సమరయోధురాలు) - గోవా
గోకుల్ చంద్ర దాస్ (కళలు)- పశ్చిమ బెంగాల్
సాల్లీ హెూల్కర్ (చేనేత)- మధ్యప్రదేశ్
మారుతీ భుజరంగ్‌రావు చిటమ్‌పల్లి (సాంస్కృతికం, విద్య)- మహారాష్ట్ర
బతూల్ బేగమ్ (జానపద కళాకారిణి) - రాజస్థాన్
వేలు ఆసన్ (డప్పు వాద్యకారుడు) - తమిళనాడు
భీమవ్వ దొడ్డబాలప్ప శిళ్లేక్యాతర (తోలుబొమ్మలాట) - కర్నాటక
పర్మార్ లావ్జీభాయ్ నాగ్జీభాయ్ (చేనేత)- గుజరాత్
విజయలక్ష్మి దేశ్‌మానే (వైద్యం)- కర్నాటక
చైత్రం దేవ్‌చంద్ పవార్ (పర్యావరణ పరిరక్షణ)- మహారాష్ట్ర
జగదీశ్ జోషిలా (సాహిత్యం)- మధ్యప్రదేశ్
నీర్జా భట్లా (గైనకాలజీ) - ఢిల్లీ
హ్యూ, కొల్లీన్ గాంట్జర్ (సాహిత్యం, విద్య - ట్రావెల్) - ఉత్తరాఖండ్

వైవిధ్యతను ఆచరిస్తేనే సమానత్వం

న్యూఢిల్లీ : స్వాతంత్ర్యం సిద్ధించి 75ఏండ్లు పూర్తి చేసుకుని అజాదీ కా అమృత మహోత్సవ్ కాలంలో వున్న మన దేశం విశిష్టమైన గొప్పతనాన్ని, వైవిధ్యభరితమైన సంస్కృతిని చాటిచెబుతూ మనం ఈ పండుగను జరుపుకుంటున్నామని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఈ 75వ గణతంత్ర దినోత్సవం ఎంతో ప్రత్యేకమైనదని, విశిష్టమైనదని వ్యాఖ్యానించారు. భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె శనివారం రాత్రి దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. భారతదేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థ పశ్చిమ దేశాల్లోని ప్రజాస్వామ్య భావన కన్నా చాలా ప్రాచీనమైనదని అందుకే భారత్‌ను ప్రజాస్వామ్య మాతృకగా పిలుస్తారని ఆమె కొనియాడారు. అనేక ప్రతికూలతలను, అడ్డంకులను, సవాళ్ళను దాటుకుంటూ సాగిన 75ఏండ్ల సుదీర్ఘ ప్రయాణాన్ని రాష్ట్రపతి తన ప్రసంగంలో వివరించారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని ఆమె ప్రముఖంగా పేర్కొన్నారు. ఆర్థిక, సైన్స్, అంతర్జాతీయ సంబంధాలు సహా పలు రంగాల్లో భారత్ సాధించిన పలు విజయాలను ఈ సందర్భంగా ఆమె వివరించారు. మన మౌలిక విలువలు, సిద్ధాంతాలు, సూత్రాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాల్సి వుందన్నారు. ప్రజాస్వామ్యం అంటేనే వైవిధ్యభరితమైన సంస్కృతీ సంప్రదాయాలు, విశ్వాసాలు, ఆచారాలని అన్నారు. ఈ వైవిధ్యతను మనం ఆచరిస్తేనే సమానత్వం సిద్ధిస్తుందన్నారు. లింగ సమానత్వం దిశగా కూడా మనం పురోగతి సాధించామన్నారు. చారిత్రక మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్ ఆమోదించిందన్నారు. నారీ శక్తి వందన్ అభియాన్ మహిళా సాధికారతకు విప్లవాత్మకమైన సాధనంగా మారుతుందన్నారు.

ఆత్మనిర్భర్ కోసం రైతుల కృషి

గణతంత్ర రాజ్యంగా ఆవిర్భవించిన 75ఏండ్ల తర్వాత కూడా దేశంలోని పలు ప్రాంతాలు దారిద్ర్యంలో వున్నాయని, ఆకలి బాధలను ఎదుర్కొంటున్నాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆవేదన వ్యక్తం చేశారు. అయితే మన విశ్వాసం చెక్కు చెదరలేదన్నారు. ఆ పరిస్థితులను అధిగమించేందుకు మనం అనేక చర్యలు, తీర్మానాలు చేపట్టామన్నారు. ముఖ్యంగా ఆహార ధాన్యాలు, ఇతర పంటల విషయంలో మన దేశం స్వయం సమృద్ధి సాధించేందుకు మన రైతాంగం చెమటోడ్చి నిరంతరంగా శ్రమించిందని అన్నారు. మన కార్మికులు కఠోర శ్రమతో మన తయారీ రంగాన్ని, మౌలిక వసతులను మరింత మెరుగైన రీతిలో వుండేలా తీర్చిదిద్దారన్నారు. ఈ రంగాల్లో అంతర్జాతీయ స్థాయిలో మనం చొరవలు తీసుకుంటున్నామన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీల అభివృద్ధికి ప్రభుత్వం నిర్దిష్ట చర్యలు తీసుకుంటోందని చెప్పారు. వారి సామాజిక, ఆర్థిక అభ్యున్నతి కోసం ప్రత్యేకంగా పథకాలు రూపొందించిందన్నారు. ప్రాథమిక అవసరాలను ఒక హక్కుగా మార్చడం ద్వారా సంక్షేమం అన్న భావననే ప్రభుత్వం పునర్నిర్వచించిందన్నారు. సాహసోపేతమైన, దార్శనికత, ఆర్థిక బలంతో రాబోయే కాలంలో కూడా మన పురోగతి ఇదే వేగంతో కొనసాగుతుందన్నారు.

పటిష్టమైన ఆర్థిక వ్యవస్థతో వచ్చిన ఆత్మ విశ్వాసంతో మనం ముందుకు వెళుతున్నామన్నారు. ఇటీవలి కాలంలో ప్రధాన దేశాల ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్ జిడిపి వృద్ధిరేటు కొనసాగుతోందన్నారు. సమాజంలోని బలహీన వర్గాల వారికి ఉచిత ఆహారం అందించే పథకాలను కరోనా మహమ్మారి కాలంలో అమలు చేశామని, ఆ తర్వాత కూడా ప్రభుత్వం ఆ పథకాల పరిధిని పెంచి, అమలును కొనసాగిస్తోందని రాష్ట్రపతి పేర్కొన్నారు.

ప్రస్తుత అమృత కాలంలో కనివినీ ఎరుగని సాంకేతిక మార్పులు ఎదురవుతున్నాయని, కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్ వంటి అధునాతన సాంకేతిక చొరవలు పతాక శీర్షికల నుండి మన రోజువారీ జీవితాల్లోకి వచ్చేశాయని ఆమె పేర్కొనానరు. రాబోయే భవిష్యత్తులో ఆందోళన చెందే అంశాలు, అవకాశాలు సృష్టించే రంగాలు కూడా అనేకం వున్నాయన్నారు. ముఖ్యంగా యువతను దృష్టిలో పెట్టుకుంటే వారు సరికొత్త సరిహద్దులను అన్వేషిస్తూ ముందుకు సాగిపోతున్నారన్నారు. వారి మార్గంలో ఎదురయ్యే అడ్డంకులను తొలగిస్తూ వారికి మార్గం సుగమం చేయడమే మన ముందున్న కర్తవ్యమని అన్నారు. వారి విశ్వాసమే రేపటి భారతాన్ని నిర్మిస్తుందని ఆమె ఆకాంక్షించారు. యువత మనస్సులను తీర్చిదిద్దే ఉపాధ్యాయులే మన జాతి నిర్మాతలను ఆమె అభిప్రాయపడ్డారు. మౌనంగా పనిచేసుకుంటూ దేశానికి మరింత మెరుగైన భవితవ్యాన్ని అందించేందుకు ఇతోధికమైన సేవలందించే మన రైతాంగం, కార్మికులకు కచ్చితంగా మనందరం కృతజ్ఞులమై వుండాలని రాష్ట్రపతి పేర్కొన్నారు. చివరగా ఇటువంటి పర్వదినాన మనసాయుధ బలగాలకు, పోలీసులు, పారా మిలటరీ బలగాలకు భారత్ అభివాదం చేస్తోందన్నారు. వారి ధైర్యసాహసాలే లేకపోతే ఈనాడు మనం లేమని వ్యాఖ్యానించారు. చివరగా మనందరం మనం కృషి చేయగలిగే రంగాల్లో కృషి చేస్తూ, దేశానికి ఇతోధికంగా సేవలందిస్తూ, నిబద్ధతతో వ్యవహరిస్తూ లక్ష్యాల సాధన దిశగా సాగాలని కోరారు.

31న ఉస్మానియా ఆస్పత్రి భవనానికి శంకుస్థాపన

(మొదటిపేజీ తరువాయి)

నలువైపులా రహదారులు ఉండాలనీ, దానికోసం అవసరమైనచోట్ల ఇతర మార్గాలను కలిపేలా అండర్‌పాస్‌లు నిర్మించాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చే రోగులు, సహాయకులు, పరామర్శకు వచ్చే వారి వాహనాలు నిలిపేందుకు వీలుగా అండర్‌గ్రౌండ్‌లో రెండు ఫ్లోర్లలో పార్కింగ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. డార్మిటరీ, ఫైర్‌స్టేషన్, క్యాంటిన్, మూత్రశాలలు, ఎస్టీపీలు నిర్మించాలని ఆదేశించారు. మరణించిన వారి పిల్లలు విదేశాల్లో స్థిరపడుతుండటంతో వారు వచ్చేందుకు రెండు, మూడు రోజులు పడుతోందనీ, అప్పటి వరకు మృతదేహాలను భద్రపర్చేందుకు ఆధునిక సౌకర్యాలతో మార్చురీ, బాడీ ఫ్రీజింగ్ నిర్మాణాలు చేపట్టాలని చెప్పారు. అవయవాల మార్పిడి, అత్యవసర సమయాల్లో రోగుల తరలింపునకు వీలుగా హెలీ అంబులెన్స్‌లు వినియోగిస్తున్నందున హెలీప్యాడ్ నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఆస్పత్రిలో అడుగుపెట్టగానే ఆహ్లాదకర వాతావరణం ఉండాలనీ, ఏదో కోల్పోతున్న భావన ఉండరాదని అన్నారు. సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి సంయుక్త కార్యదర్శి సంగీత సత్యనారాయణ, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియానా జడ్ చోంగ్తూ, ఫ్లాగ్ షిప్ ప్రోగ్రామ్స్ కమిషనర్ శశాంక, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

చీనాబ్ బ్రిడ్జిపై వందేభారత్

(మొదటిపేజీ తరువాయి)

వందే భారత్ రైలు పరుగులు తీసింది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక వందేభారత్ టికెట్ ధర విషయానికి వస్తే.. ఢిల్లీ నుంచి కాశ్మీర్‌కు రూ.1,500 నుంచి రూ.2,100గా నిర్ణయించినట్లు తెలుస్తున్నది. రైలు మార్గమధ్యలో జమ్మూ, శ్రీమాతా వైష్ణోదేవి కత్రాలో స్టాప్స్ ఉండనున్నట్లు సమాచారం.

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు ఐలయ్య మృతి

నవతెలంగాణ-కొత్తగూడెం

పేదల పక్షాన నిలబడి, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసిన ఉద్యమ కెరటం, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కాసాని అయిలయ్య(75) మృతిచెందారు. కొత్తగూ డెం ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుం టున్న సందర్భంలో ఒక్కసారిగా బీపీ తగ్గి, గుండెపోటు రావడంతో మరణించారు. ఆయన భౌతికకాయాన్ని సీపీఐ(ఎం) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యాలయంలో ప్రజల సందర్శనార్థం ఉంచా రు. అనంతరం ఆయన నివాసం సుజాతనగర్ మం డల కేంద్రానికి తరలించారు. ఆదివారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఆయనకు కుమారుడు లెనిన్, కుమార్తె జ్యోతి ఉన్నారు. ఇద్దరికి ఆదర్శ వివాహాలు చేశారు. భార్య కాసాని లక్ష్మీ 2017లో సుజాతనగర్ సర్పంచ్‌గా సేవలందిస్తూ అకాల మరణంచెందారు. కాసాని మృతి పట్ల పలువురు రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపారవేత్తలు తీవ్ర సంతాపం సానుభూతి తెలిపా రు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

నేడు అంత్యక్రియలు

ఆదివారం ఉదయం 10 గంటలకు సుజాతనగర్ మండల కేంద్రంలో సంతాప సభ అనంతరం అంత్యక్రియలు జరుగుతాయని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు తెలిపారు. అంత్యక్రియలో అన్ని వర్గాల ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు, శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కాసాని ప్రజా పోరాట నాయకులు : మచ్చా వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలు, సుజాతనగర్, కొత్తగూడెం ప్రాంతాల ప్రజల పక్షాన నాలుగున్నర దశాబ్దాల పాటు కాసాని ఐలయ్య తను నమ్మిన సిద్ధాంతం కోసం దీక్ష, పట్టుదలతో నిలబడ్డారు. రాజకీయాల్లో అనేక మార్పులు వచ్చినా, ఇబ్బందులు తలెత్తినా ఎర్రజెండా పక్కన నిలబడిన నాయకులు ఐలయ్య. అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ తుదిశ్వాస వరకు ప్రజల మధ్యనే జీవించారు. ప్రజా ఉద్యమాన్ని కాపాడటమే ఆయనకు ఇచ్చే నివాళి.

విభజించు..పాలించు

ఇదే కాషాయపరివార్ విధానం | జనం మదిలో రాజ్యాంగం... బీజేపీ మనసులో మనువాదం

సంగారెడ్డి నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధులు

'దేశవ్యాప్తంగా ఆదివారం 75వ రాజ్యాంగ దినోత్సవం జరుగుతుంది. స్వాతంత్ర్య పోరాట ఫలితంగా అంబేద్కర్ రాసిన రాజ్యాంగం జనవరి 26న అమల్లోకి వచ్చింది. ప్రజలందరి మదిలో రాజ్యాంగం ఉంది. కానీ బీజేపీ నాయకుల మనసులో రాజ్యాంగం లేదు. మనువాదం ఉన్నది. మనువాదానికి అనుగుణంగానే పాలన సాగిస్తున్నారు. అందులో భాగంగానే పార్లమెంటు సాక్షిగా అంబేద్కర్‌ను అవమానిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మాట్లాడారు. ఆయన మనసులో అదానీ-గాడ్సే ఉన్నారు. అమిత్‌షాకు కేంద్రమంత్రిగా కొనసాగే అర్హత లేదు. మంత్రి పదవికి తక్షణమే రాజీనామా చేయాలి.'అని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో నాలుగు రోజులపాటు జరగనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభలు శనివారం ప్రారంభమయ్యాయి. ఐబీ కార్యాలయం నుంచి వేలాది మందితో భారీ ప్రజాప్రదర్శనను నిర్వహించారు. అనంతరం పీఎస్ఆర్ గ్రౌండ్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, ఆహ్వానసంఘం చైర్మెన్ చుక్క రాములు అధ్యక్షతన జరిగిన బహిరంగసభకు ముఖ్యఅతిథిగా బృందాకరత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రియమైన సోదర, సోదరీమణులారా పార్టీ మహాసభల నేపథ్యంలో అందరికీ లాల్‌సలాం అంటూ తెలుగులో ప్రసంగాన్ని మొదలుపెట్టారు.



మతోన్మాదులారా ఖబడ్దార్ : తమ్మినేని

(మొదటిపేజీ తరువాయి)

చూడ్డమేనని చెప్పారు. మతోన్మాదాన్ని తిప్పికొడతామని అన్నారు. ఖబడ్దార్ మతోన్మాదులారా... బీజేపీ కుయుక్తులను అడ్డుకుంటామని చెప్పారు. పార్టీ నాలుగో మహాసభలో చర్చించి సమరశీల పోరాటాలను నిర్వహిస్తామన్నారు. సకల జనులు బీజేపీ ప్రమాదాన్ని గుర్తించి అడ్డుకోవాలని కోరారు. బీజేపీకి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, టీడీపీని కలుపుకుని పోతామని చెప్పారు. అందరినీ ఒకతాటిమీదకు, ఒక వేదికమీదకు తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఇచ్చిన వాగ్దానాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏడో గ్యారంటీ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కోరారు. ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తే సమర్థిస్తామనీ, విస్మరిస్తే పోరాటం చేస్తామని చెప్పారు. రైతు భరోసా, ఆత్మీయ భరోసా, మహిళలకు రూ.2,500 అమలు ఏమైందని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎన్నికలు ఓట్లు వచ్చినపుడు ఒక మాట, తర్వాత ఇంకోమాట మారుస్తున్నాయని అన్నారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన, లగచర్ల, దామగుండం వంటి సమస్యలపై అన్ని పార్టీలనూ పిలిచి మాట్లాడారా?అని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. హామీలను అమలు చేయకుంటే ప్రశ్నిస్తామనీ, ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. ప్రజావ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటే అడ్డుకుంటామని అన్నారు. కలిసొచ్చే శక్తులను కలుపుకుని పనిచేస్తామన్నారు. పార్టీ రాష్ట్ర మహాసభల్లో చర్చించి ప్రజా ఉద్యమాలకు పూనుకుంటామని చెప్పారు.

ఈ మహాసభ ప్రజాప్రదర్శన, బహిరంగసభలో సీతారాం ఏచూరి లేరనీ, ఆయన మరణం పట్ల శ్రద్ధాంజలి ఘటిస్తున్నామని అన్నారు. తెలంగాణ ఉద్యమంతో ఆయనకు దగ్గరి సంబంధముందన్నారు. ఏచూరి స్ఫూర్తితో ఎర్రజెండాను, ఉద్యమాలను ముందుకుతీసుకెళ్లేందుకు శపథం తీసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. నిజాం నవాబు, బ్రిటీష్, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సాగిందన్నారు. కార్మికులే ఈ మహాసభలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. దేశంలో కార్మికులు, రైతులు దోపిడీకి గురవుతున్నారని చెప్పారు. మోడీ ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతున్నదని విమర్శించారు. కానీ కార్పొరేట్లకు మాత్రం రూ.మూడు లక్షల కోట్లు రాయితీలిచ్చిందని వివరించారు. మోడీ సర్కార్ పెట్టుబడిదారులకు మేలు చేసేందుకు నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. కార్మిక సంఘాలన్నీ వాటికి వ్యతిరేకంగా పోరాడుతున్నాయని అన్నారు. వలస కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ, కనీస వేతనాలు అందడం లేదని చెప్పారు. ఎనిమిది గంటల పనివిధానం కాకుండా పది గంటలు, 12 గంటల పనివిధానం అమలవుతున్నదని విమర్శించారు. అంగన్‌వాడీలు, ఆశాలు, మధ్యాహ్న భోజనం కార్మికులు, ఉపాధి హామీ కార్మికులు అనేక సమస్యలతో బాధపడుతున్నారని అన్నారు. సామాన్యులపైకి బీజేపీ ప్రభుత్వం బుల్డోజర్‌ను తెస్తే కమ్యూనిస్టులు అడ్డుకుంటారని చెప్పారు. పేదలు, రైతులు, కార్మికులపై జులుం ప్రదర్శిస్తే సీపీఐ(ఎం) అండగా ఉంటుందన్నారు. రాజ్యాంగం, సమానత్వం, లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సామ్యవాదం, ఫెడరలిజంపై విశ్వాసం లేని వారు కేంద్రంలో పాలకులుగా ఉన్నారని విమర్శించారు. హిందూ ముస్లిం, ఆదివాసీ ముస్లింలను విభజిస్తూ దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు. ప్రజలను విభజించు పాలించు బ్రిటీష్ విధానాన్ని అనుసరిస్తున్నారని చెప్పారు. ప్రజల మధ్య కులం, మతం పేరుతో చిచ్చు పెట్టి రెచ్చగొడుతున్నారనీ, ఇది దేశానికే ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ధర్మానికి, ప్రజల మత విశ్వాసాలకు, హిందూత్వ భావజాలానికి సంబంధమే లేదన్నారు. మతాన్ని ఆయుధంగా రాజకీయాలకు వాడుకోవడం సరైంది కాదని చెప్పారు. దీన్ని వ్యతిరేకించడం కోసమే ఇండియా కూటమి ఏర్పడిందని అన్నారు. ఇండియా కూటమి అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు ఆదర్శంగా ఉండాలని సూచించారు. స్వార్థం కోసం, కుటుంబం కోసం కాకుండా సమాజ మార్పుకోసం సీపీఐ(ఎం) పోరాడుతుందని ఆమె చెప్పారు. ఎర్రజెండాను ముందుకెళ్లాలనీ, మతోన్మాద శక్తులను వెనక్కి కొట్టాలని అన్నారు. దోపిడీ లేని వ్యవస్థ కోసం పోరాటం చేయాలన్నారు.

అన్నారు. సీపీఐ(ఎం) పార్టీకి ఓట్లు, సీట్లు అటుఇటైనా పేదల కోసం నిలబడి పోరాడుతుందని నొక్కి చెప్పారు. రాష్ట్రానికి, దేశానికి పెట్టుబడులు అంటూ మోడీ, రేవంత్‌రెడ్డి, చంద్రబాబు విదేశాల్లో తిరుగుతున్నారనీ, వారు తిరిగేది ప్రజల కోసం కాదు..తమకు దక్కాల్సిన మూటల కోసమని విమర్శించారు. కేసీఆర్ చేసిన సమగ్ర కుటుంబ సర్వే ఎక్కడ పోయిందో అర్థం కావడం లేదన్నారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి సర్కారు కులగణన, దరఖాస్తుల స్వీకరణతో కాలం వెళ్లబుచ్చుతున్నదని వివరించారు. మోడీ సర్కారు మతం, కులం చుట్టూ ప్రజలను తిప్పుతుంటే..రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దరఖాస్తుల చుట్టూ తిప్పుతున్నదని విమర్శించారు.

ఎర్రజెండా కోసం మేమున్నామని సహకరించడం స్ఫూర్తిదాయం : చుక్క రాములు



మహాసభలను జయప్రదం చేయడానికి పారిశ్రామిక కార్మికవర్గం రెండు నెలల నుంచి కష్టపడుతున్నదనీ, ఎర్రజెండా కోసం మేమున్నామనీ పారి శ్రామిక కార్మికులు, అసంఘటిత కార్మికులు, స్కీం వర్కర్లు, వ్యవసాయ కూలీలు, రైతులు, పేదలు అన్ని విధాలా సహకరించడం స్ఫూర్తిదాయకమని సీపీఐ(ఎం) మహాసభల ఆహ్వాన కమిటీ చైర్మెన్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్కరాములు కొనియాడారు. జహీరాబాద్‌లో నిమ్జ్ కోసం 12,500 ఎకరాలను గుంజుకుంటే బాధితుల పక్షాన పోరాడింది సీపీఐ(ఎం) మాత్రమేననీ, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఒక్కరు కూడా ముందుకు రాలేదని వివరించారు. సంగారెడ్డి జిల్లాలోని అనేక పరిశ్రమల్లో మెరుగైన వేతన ఒప్పందాలు జరిగే పోరాటాలు చేయడంలోనూ, విజయం సాధించడంలోనూ ఎర్రజెండా పాత్ర కీలకమని నొక్కి చెప్పారు. కార్మికులంతా ఒక్కతాటిపై ఉండి తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

దమ్ముంటే అందరికీ అన్ని సౌకర్యాలు కల్పించండి : జూలకంటి రంగారెడ్డి



ఒకే దేశం ఒకే ఎన్నిక..ఒకే దేశం..ఒకే పన్ను..ఒకే దేశం.. ఒకే ఆహారం.. నినాదాలను మాని దమ్ముంటే దేశంలో అందరీ అన్ని సౌకర్యాలు కల్పించాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. దేశంలో అందరికీ వైద్య, విద్యా సౌకర్యాలను కల్పించాలని కోరారు. దేశంలో 80 కోట్ల మందికి తాము ఉచితంగా రేషన్ ఇస్తున్నామని చెప్పడానికి పాలకులు సిగ్గుపడాలన్నారు. దేశంలో రాజకీయాలు వ్యాపారమయం అయ్యాయనీ, బూర్జువా పార్టీలు ప్రయివేటు కంపెనీల లిమిటెడ్‌లుగా మారాయని విమర్శించారు. పాలకులు సంపన్నుల కోసం పనిచేస్తూ పేదలపై పన్నులు, భారాలు, అప్పులు మోపుతున్న తీరును ఎండగట్టారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం మహాసభలో చర్చించి సమరశీల పోరాటాలకు రూపకల్పన చేస్తామని చెప్పారు.

పోరాటాల గడ్డ ఎర్రజెండా వెలుగుల కోసం చూస్తోంది : ఎస్.వీరయ్య



తెలంగాణ పోరాటాల గడ్డ అనీ, ఎర్రజెండా వెలుగుల కోసం ఎదురుచూస్తోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. రేవంత్‌రెడ్డి సర్కారు హామీనిచ్చిన ఆరు గ్యారంటీల్లో ఉచిత బస్సు మినహా ఏదీ అమలు కావడం లేదని విమర్శించారు. కనీస వేతనాల కోసం కార్మికుల పక్షాన కొట్లాడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వమేమో 10 వేలు, 12 వేలు చాలని జీవోలు విడుదల చేస్తున్నదనీ, ప్రధాని మోడీనేమో రోజువారీ కూలి రూ.178 ఇస్తే సరిపోతుందని అంటున్నారని విమర్శించారు. ఆ వేతనంతో ఒక్క బీజేపీ నేతగానీ, నాయకులుగానీ బతికి చూపించాలని సవాల్ విసిరారు. 8 గంటల పనివిధానాన్ని తీసేసి రెండు షిఫ్టు విధానం(12 గంటల పనివిధానం) తేవడం ప్రమాదకరమన్నారు. విభజన హామీలు, రాష్ట్రానికి రావాల్సిన నిధులు, హక్కులపై సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు పోరాడటం లేదని ప్రశ్నించారు. సింగరేణిని క్రమంగా ప్రయివేటీకరిస్తుంటే బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు గమ్మున ఉండటాన్ని తప్పుబట్టారు. పేరు ఆర్టీసీ..బస్సులు ప్రయివేటువేంటి అని రేవంత్‌సర్కార్‌ను ప్రశ్నించారు. రాష్ట్ర హక్కుల కోసం కొట్లాడాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జయరాజు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఆర్ అరుణ్‌కుమార్, బి వెంకట్, సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం సాయిబాబు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి జ్యోతి, పోతినేని సుదర్శన్, డిజి నరసింహారావు, జాన్‌వెస్లీ, పాలడుగు భాస్కర్, మల్లు లక్ష్మి, టి సాగర్, పి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలకు ఎర్రజెండా అంటే భయం : చెరుపల్లి సీతారాములు



ప్రజల పక్షాన కొట్లాడే ఎర్రజెండా పార్టీ నాయ కులంటే పాలకపార్టీలకు భయమనీ, ప్రజల పక్షాన పోరాడుతున్న ఎంతో మంది నాయకులను చంపే శాయని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు చెప్పారు. దోపిడీదారులకు వ్యతిరేకంగా నికరంగా పోరాడుతున్నది ఎర్రజెండానే

పేదలకు భూములివ్వకుండా పెద్దలకిచ్చే యత్నం : జి.నాగయ్య



రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల మిగులు భూమి ఉందనీ, దాన్ని పేదలకు పంచకుండా పారిశ్రామి కవేత్తలకు కేటాయించే ప్రయ త్నంలో రాష్ట్ర సర్కారు ఉందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య విమర్శిం చారు. రాష్ట్రంలో 31 లక్షల మందికి సొంత ఇండ్లు లేవనీ, వారికి ఇండ్ల జాగాలు ఇచ్చేందుకు పాలకులకు చేయి రావడం లేదని చెప్పారు. అసైన్డ్ భూమి ఎకరం ఇస్తే 400 గజాలిచ్చి అమ్ముకునే హక్కు కల్పిస్తామని చెబుతూ పేదలను భూముల నుంచి దూరం చేసే యత్నంలో పాలకులు ఉన్నారని చెప్పారు. 69 కేంద్రాల్లో ఇండ్ల జాగాల కోసం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నామన్నారు.

ఉప్పొంగిన ఎర్ర సముద్రం
కదం తొక్కిన రెడ్ ఆర్మీ

- దద్దరిల్లిన ప్రజా ప్రదర్శన
- కోలాట, దప్పుల దర్వులాట...విచిత్ర వేషాధారణ
- ఎర్ర తోరణమై సాగిన కార్మిక, శ్రామిక జనం
- జనంతో కలిసి సాగిన సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు
- ప్రదర్శనలో బృందాకరత్, బీవీ రాఘవులు, కేంద్ర, రాష్ట్ర నాయకులు
- ఐబీ నుంచి పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు ఎర్ర ప్రవాహం
- అమరుల స్మారకంగా మూడు జ్యోతులు అందజేత



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

కార్మిక, కర్షక లోకం ఎర్ర ప్రవాహమై సాగింది. రెడ్ ఆర్మీ కదం తొక్కడంతో ఎర్ర సముద్రంలా ఉప్పొంగింది. డప్పులదరువులు, కోలాటా నృత్యాలు ధూంధాం చేశాయి. విచిత్ర వేషాధారణలు ఆలోచింపజేసి ఆకట్టుకున్నాయి. చీమల దండై కదిలిన ఎర్రసైన్యం కవాతుతో సంగారెడ్డి పట్టణం దద్దరిల్లింది. రెడ్ షర్ట్స్, ఎర్రచీరలు ధరించి... ఎర్రజెండాను భుజాన ఎత్తిపట్టి "అదే పతాక జైత్రయాత్ర సాగుతోందిరా' అంటూ పాట పాడుతూ ఆటలాడుతూ సాగిన ప్రజా ప్రదర్శన అబ్బురపరిచింది. ఈ నెల 25-28 తేదీల్లో సంగారెడ్డి పట్టణంలోని కామ్రేడ్ సీతారాం ఏచూరి, కామ్రేడ్ మల్లు స్వరాజ్యం ప్రాంగణంలో (గోకుల్ గార్డెన్) జరగనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభల్లో భాగంగా శనివారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో భారీ ప్రజా ప్రదర్శన నిర్వహించారు. స్థానిక ఐబీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా సాగారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన వేలాది మంది సీపీఐ(ఎం) కార్యకర్తలు, కార్మికులు, కర్షకులు, పేదలు, మహిళలు పెద్దఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఐబీ నుంచి ప్రారంభమైన ప్రజా ప్రదర్శన బహిరంగ సభాస్థలికి చేరుకుంది. ప్రదర్శన ముందు భాగాన సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, బీవీ రాఘవులు, కేంద్రకమిటీ సభ్యులు జి.నాగయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య, చుక్క రాములు, జూలకంటి రంగారెడ్డి, జాన్‌వెస్లీ, పాలడుగు భాస్కర్, మల్లు లక్ష్మి, టి.సాగర్, అబ్బాస్, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ఇతర ముఖ్య నాయకులు ముందు భాగాన సాగారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై బృందాకరత్ ప్రజలకు అభివాదం చేశారు.

డప్పుల దర్వులు...కోలాటాల నృత్యాలు

సీపీఐ(ఎం) ప్రజా ప్రదర్శనలో డప్పు కళాకారులు చిందేస్తూ దరువేశారు. ప్రదర్శన అగ్రభాగాన సాగిన డప్పు కళాకారులు ఎర్రజెండా పాటల ఊపులో ఆడిపాడారు. ఎర్ర దుస్తులు ధరించి ప్రత్యేక శిక్షణ పొందిన కళాకారులు ప్రదర్శనకు ఊపుతెచ్చారు. మహిళా కళాకారులు కోలాటాల నృత్యాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రెండూ మూడు కోలాట దళాలు ఎర్రజెండా పాటలపై కోలాట దర్వులేస్తూ ఆడాయి. అదే విధంగా ప్రదర్శనలో విచిత్ర వేషాధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దేశంలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలే కాకుండా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న సరళీకృత ఆర్థిక విధానాలు, మతోన్మాద పోకడల్ని ఎత్తిచూపుతూ వేసిన వేషాలు ఆలోచింపజేశాయి. రాజ్యాంగానికి ముప్పు వాటిల్లిన నేపథ్యంలో సీపీఐ(ఎం) రాజ్యాంగ పరిరక్షణకు నడుం బిగించింది. ప్రదర్శనలో రాజ్యాంగం చేతబట్టిన ఇద్దరు కళాకారులు అంబేద్కర్ వేషాధారణతో ప్రదర్శనలో ముందు నడిచారు. అదే విధంగా బీజేపీ దేవుళ్ల జపం చేస్తూ మతాన్ని రాజకీయాలకు వాడుతున్న దృశ్యం కూడా మతసామరస్యం కోరుకునే వాళ్లను ఆలోచింపజేసింది. సరళీకృత విధానాల వల్ల పేదలు మరింత పేదలవుతున్న తీరు.. హిందూ, ముస్లీం, క్రిష్టయన్ వేషాధారణలో మత సామరస్యాన్ని కోరే సందేశానిచ్చారు. మతోన్మాద భూతం, రైతులు, కనీస వేతనాల్లేని కార్మికులు, హింసకు గురవుతున్న మహిళల వంటి వేషాధారణలు ప్రదర్శనలో ప్రత్యేకంగా నిలిచాయి.

కదం తొక్కిన కార్మిక వర్గం

ప్రజా ప్రదర్శనలో కార్మిక వర్గం కదం తొక్కింది. పారిశ్రామిక ప్రాంతంగా ఉన్న సంగారెడ్డిలో సీపీఐ(ఎం) కార్మిక వర్గం గట్టి పునాది కలిగి ఉన్నది. అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి కార్మికులకు మెరుగైన వేతనాలు సాధించి పెట్టింది. అందుకే సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల ప్రదర్శనలో ఎర్రజెండాలు చేతబూని కదం తొక్కుతూ కదిలారు. అసంఘటిత రంగంలోని హమాలీ, ట్రాన్స్‌ఫోర్ట్, భవన నిర్మాణ కార్మికులతో పాటు కాంట్రాక్టు కార్మికులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. భూ నిర్వాసితులు, రైతులు, గ్రామీణ, పట్టణ పేదలు, ఇండ్ల స్థలాల పోరాటంలో పాల్గొన్న పేదలు అత్యధికంగా ర్యాలీకి తరలివచ్చారు.











కార్పొరేట్లే వాళ్ల దోస్తులు : బీవీ రాఘవులు



(మొదటిపేజీ తరువాయి)

గుర్తుచేశారు. నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నదనీ, కార్పొరేట్ల కోసం చట్టాలు మారుస్తూ పోతున్నదని విమర్శించారు. దేశంలోని మార్కెటింగ్ వ్యవస్థను అంబానీ, అదానీలకు కట్టబెట్టే పనిలో మోడీ సర్కారు ఉందని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, టీడీపీ, వైసీపీలు సంపన్నుల కోసం పనిచేసే పార్టీలని చెప్పారు. మోడీ ప్రభుత్వం వచ్చాక అంబానీ ఆస్తి లక్ష కోట్ల రూపాయల నుంచి రూ.8 లక్షల కోట్లకు, అదానీ ఆస్తి రూ.40 వేల కోట్ల నుంచి రూ.7.5 లక్షల కోట్లకు పెరిగిన తీరును వివరించారు. ట్రంప్ గెలిచాక డిన్నర్ పార్టీకి మన దేశం నుంచి అంబానీని మాత్రమే పిలిచిన విషయాన్ని గుర్తుచేశారు.

పెట్టుబడిదారులకు ఎర్రజెండా ప్రాధాన్యత తెలుసుననీ, అందుకే పాలకులతో నిరంతరం అణచివేయిస్తూ అరెస్టులు చేయిస్తున్నారని చెప్పారు. మోడీ సర్కారు ప్రశ్నిస్తే జైలుకు పంపిస్తున్నదనీ, పౌర హక్కుల కోసం నిలదీస్తే చంపేస్తుందని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని మోడీ సర్కారు హరిస్తున్నదని తీరును వివరించారు. ప్రజాస్వామ్యం ఉంటేనే కష్టజీవులకు హక్కులుంటాయని నొక్కి చెప్పారు. అందరినీ సమానంగా చూడాలని రాజ్యాంగం చెబితే మోడీ సర్కారు దాన్ని భగ్నం చేస్తున్నదని విమర్శించారు. కేంద్రం పన్నుల్లో రాష్ట్రాలకు 50 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాల హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. వేతన హక్కును కల్పించాలనీ, 60 ఏండ్లు దాటిన కార్మికులకు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ హక్కుల కోసం కొట్లాడేది ఎర్రజెండా మాత్రమేననీ, ఇతర పార్టీలకు అది చెప్పే దమ్ము ఉందా? అని ప్రశ్నించారు. ఒకే దేశం..ఒకే ఎన్నిక వస్తే ముందు అంత రించిపోయే పార్టీలు బీఆర్ఎస్, టీడీపీ, వైసీపీ అనీ, ఆ తర్వాత కాంగ్రెస్ అంతమె పోతుందని చెప్పారు. ఇదంతా ఏకపార్టీగా బీజేపీ మిగిలే ప్రమాదం ఉంటు ందని హెచ్చరించారు. ప్రజాస్వామ్యాన్ని, ఫెడరలి జాన్నీ, రాజ్యాంగాన్ని కాపా డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కపౌరునిపైగా ఉందని నొక్కి చెప్పారు.

హైదరాబాద్ చేరుకున్న ప్రకాశ్‌కరత్

- సీపీఐ(ఎం) నాయకుల ఘన స్వాగతం

సంగారెడ్డిలో కొనసాగుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభల్లో పాల్గొనేందుకు ఆ పార్టీ సమన్వయకర్త ప్రకాశ్‌కరత్ శనివారం సాయంత్రం హైదరాబాద్ చేరుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఆయనకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు, డిజి నరసింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం అడివయ్య సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జయరాజు తదితరులు పుష్పగుచ్ఛం ఇచ్చి ఘన స్వాగతం పలికారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.